
# ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక




4 అణాలు
3-8-55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



రహదారిబంగళా

—ఫొటో: పి. రామారావు, రాజమండ్రి.


నేషనల్ పిక్చర్స్ వారు
సమర్పించు
పరాశక్తి
తెలుగు
డైరెక్షన్: కృష్ణన్ పంజు
స్టూడియో: ఏ.వి.ఎం
... ఆగస్టు విడుదల...

# విషయానుక్రమణిక


ముఖచిత్రం: 'అనితా గుహ'
'వాడు వట్టి ఘంతరా—' 4
మామిడి— 8
'అబద్ధం ఆడను'— 10
ఉదయకిరణాలు— 12
'జేబువాచీ'— 17
వనితాలోకం— 24
బాలసాహితి— 35
కథాగేయ సుధానిధి— 36
స్కార్లెట్ పింపర్నల్ (సీరియల్) 38
చైనీస్ కథలు— 45
దివ్యాంజనము— 46
సినిమా— 50

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

# ఆంధ్రపత్రిక

## సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 48
సంచిక 48
3.8-55

మన్మథ శ్రావణ శుక్ల పౌర్ణమి బుధవారం



మహాబలిపురంలో దేవాలయాలు

ఫొటో : పి. సి. ఎమ్. ఈశ్వరబాబు.

## ఏకాంకిక: 5

# "వాడు వర్తిశుంఠరా!"

గుడిమెళ్ల బాలా త్రిపురసుందరి

> 'వినదగు నెవ్వరు చెప్పిన
> వినినంతనె వేగపడక వివరింపదగున్...'

### పాత్రలు:

| | |
|---|---|
| వెంకయ్య | — నోటి దురుసుగల మనిషి. |
| వర్ధికాసులు | — వెంకయ్య ఆప్తమిత్రుడు. |
| తిరుపతి, వరహాలు, అంజయ్య | — వెంకయ్య సహాధ్యాయులు. |

### ప్రథమ రంగం

[వరహాలు నివసించే గది. గది నలుమూలలా బూజు ఉయ్యాల్లు ఊగుతుంటాయి. గదికి పడమటవైపున పుస్తకాలతో నిండిన కిటికీ ఉంటుంది. పుస్తకాలపై దట్టంగా దుమ్ము పడివుంటుంది. గదికి తూర్పువైపున వేరొక కిటికీ ఉంటుంది. దీనిలో ఒక పౌడరు డబ్బా, స్నో సీసా, సువాసన తలనూనె సీసా, వేసులైను సీసా, సెంటు సీసా, ఉడుకులాం సీసా, సబ్బుపెట్టె, ఓళ్లోరి అద్దం, రెండు దువ్వెన్లు, ఒక తల దువ్వుకొనే కుంచె ఉంటాయి. పడమటి వైపు కిటికీపైన శ్రీ పొట్టి శ్రీరాములుగారి బొమ్మ, తూర్పువైపు కిటికీపైన ఒక ప్రఖ్యాత చిత్రనటి త్రివర్ణచిత్రం గోడకు తగిలించబడి ఉంటాయి. గదిలో ఒకమూల గోడకు చేరగిలవేసి గొడుగు ఉంటుంది.

గది మధ్య ఒక టేబిలు, టేబిలు చుట్టూ నాలుగు కుర్చీలు. టేబిలుపై కాఫీ ఫ్లాస్కు, సిగరెట్టుపెట్టె ఉంటాయి. వరహాలు సిగరెట్టు కాలుస్తూ సినిమా పత్రిక నొకదాన్ని చదువుతుంటాడు. ఉక్రోషంగల మనిషి. తిరుపతి బక్కపలచటి మనిషి. తంత్రాలతో మిత్రభేదం తెచ్చుటలో ఇతనిది అందెవేసిన చేయి. తిరుపతి ప్రవేశం.]

వరహాలు: (కుర్చీలోంచి లేచి) రారా తిరుపతీ. ఏమిటి, ఇవ్వాళ దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?

తిరుపతి: (ఉస్సురనుకొంటూ కుర్చీలో కూర్చొని, వరహాలు చేతిలోని పత్రిక తీసుకొని విసురుకొంటూ) ఒరేయ్! వెంకయ్య ఏమన్నాడో చూశావా? [illegible]

వర: ఆ పాపం, బక్క [illegible], నాకు.

తిరు: వాడికి కళ్లు నెత్తిమీదికెక్కాయోయ్! చిన్నా పెద్దా విచక్షణ లేకుండా ఎంత మాట పడితే అంతమాట అనేస్తాడు. ప్రతి వాడినీ వెంటా, వెధవ, బ్లడీ ఫూల్, యాస్, ఇడియట్, ఉల్లూ ఇత్యాది పదజాలంతో ఉదహరిస్తాడు.

వర: ఈ మాత్రానికే వాణ్ణి కొట్టవలె నటరా?

తిరు: వినవోయ్! మొన్న ఒక 'పజిలు'కి కట్టాను. బహుమతి రాలేదని వాడికి తెలిసింది. అప్పుడు పంకజంతో నేను చవట దద్దమ్మననీ, అందుచేతనే అందరాని పండుకి అర్రులు చాచాననీ చెప్పాడుట. పైపెచ్చు నాది పెత్తిముఖంట. నేను నిరక్షరకుక్షినట. ఇంకా ఏదో పేలాడుట. చెప్పుకుంటే సిగ్గు.

వర: వాణ్ణి పిలిచి అట్లా దూషించడం భావ్యం కాదని నెమ్మదిగా చెప్తా. ఇంతకూ నువ్వు పజిలుకు డబ్బుకట్టి ఓడిపోయింది నిజమంటావా, కాదంటావా?

తిరు: నువ్వు ఇంత సానుభూతి లేనివాడివని ఎప్పుడూ అనుకోలేదు. వెంకయ్య నన్నిట్లా దెప్పిపొడవటం వెయ్యోసారి.

వర: ('అందాల ఓ మేఘమాలా' అని కూనిరాగం తీస్తూ) వాడి ఖర్మని వాణ్ణి పోనివ్వోయ్!

తిరు: నే చెప్పేది పూర్తిగా వినరా. నా ముఖంమీద ఉమ్మివేస్తే తుడుచుకొని వెళ్ళిపోతాను. ఆ ఘాతకుడు నిన్ను కూడా వచ్చిరాని మాటలన్నాడు.

వర: ఆ, ఏమిటి? (ఆదుర్దాపాటుతో)

తిరు: బండబూతులు తిడుతున్నాడు.

వర: అవేమిటో ముందు చెప్పు.

తిరు: మరి విను చెప్తా. నీకు లెక్కల్లో ఫస్టుమార్కు తప్పక వస్తుందని, నీవు [illegible] తెలివైనవాడివని వెంకయ్యతో చెప్పా.

వర: అంటే వాడేమన్నాడు?

తిరు: తోక త్రొక్కిన త్రాచులా నామీదికి లేచి 'వాడు వర్తిశుంఠ. [illegible] వస్తుంది లేవోయ్' అని ములకనచేశాడు.

వర: [illegible] - అట్లా అన్నాడా?

తిరు: ఒరేయ్ - నీవు గెల ఇచ్చినా, కాగితాల్ని వెలువుచేయకపోతే నీకు ఫస్టుమార్కు ఎవడిస్తాడురా? నువ్వు బాగా రాసి వుంటావు.

వర: కాదు మరి. త్రుణమో, ఫలమో ఏదో భక్తికొద్దీ అర్పించుకొంటాం గాని—

తిరు: అది అట్లా ఉంచు. ఇంకా ఏమన్నాడో చూశావా?

వర: త్వరగా చెప్పు మరి. నా వళ్లు మండిపోతోంది.

తిరు: నీ బుఱ్ఱలోని తెలివితేటలు దయ్యం కొబ్బరికాయలోని మీగడలాగ నానాటికీ హరించిపోతున్నాయిట.

వర: హోరి వెధవ! తుచ్ఛుడు అంతమాట అన్నాడురా?

తిరు: పైపెచ్చు...

వర: ఆ పరమదుర్మార్గుణ్ణి పొడిచేసి, నే పొడిచేసుకొంటా.

తిరు: గాడిదకు నీకూ ఏమీ వ్యత్యాసం లేదుట. నీ పేరు వరహాలు కాదుట. వరాహంట,

వర: చంపేస్తా వాణ్ణి, కుర్చీతో చిత్తు

చేయకపోతే నా పేరు వరహాలు కాదు. (కుర్చీలోంచి హఠాత్తుగా లేచి పిడికిలితో టేబిలు గుద్దుతాడు.)

తిరు: నీ చేవ నాకు తెలుసుకదోయ్!

వర: (కుర్చీలో కూర్చుంటాడు) దెబ్బకి మంచినీళ్లడగకుండా పడిపోతాడు. చచ్చు వెధవ.

తిరు: ఆ బకాసురుడికి దేహశుద్ధి కావలసిందే... కాని ఒక్క చిక్కుంది.

వర: (చెవులు మూసుకొంటూ) నా కింకేం చెప్పకు. వాడి భరతం పట్టేదాకా నాకు నిద్రపట్టదు.

తిరు: ఓ విషయం వినరా.

వర: ఇంక నోర్మూయి. నీ యెదుటే వాడికి సరియైన జవాబు చెప్పకపోతేమూడు.

తిరు: (ఖంగారుతో) నా యెదుటనా?

వర: ఊఁ.

తిరు: నేను నీచేత వాణ్ని కొట్టించినట్టు అవదూ? నేను నీచేత వాడిని బాదించినట్టు తెలిస్తే అదను చూచుకొని నావీపు వాడు బీటలు తీయిస్తాడు.

వర: భయపడకోయ్! వాణ్ణి కొట్టిన తర్వాత, ఆఖర్ని 'తిరుపతి నిన్ను బాదమని చెప్పలేదోయ్, వట్టి వెంకయ్యా' అని చెప్పి సాగనంపుతా.

తిరు: ఇంకేం. ఇదొకటా! యీ లంకా దహనానికి నేనే కారకుడనని ధృవపడిపోతుంది.

వర: నాకు కోపమొచ్చి తన్నితే నువ్వు బాదించినట్లు ఎలా అవుతుంది?

తిరు: (వరహాలు చేతులు పట్టుకొని) నే చెప్పినట్లు విని వాణ్ణి నువ్వు చితక బాదవద్దు.

వర: ఐతే ఆ దుర్మార్గుడికి దణ్ణం పెట్టి ఊరుకోమంటావా? బాగుంది నీ బోడిసలహా.

తిరు: అబ్బా నే చెప్పేంది వినరా. అంజయ్యచేత వాణ్ణి పచ్చడిచేయిద్దాం.

వర: ఎల్లాగంటావు?

తిరు: అదంతా నా ప్లాను. నీవుమట్టుకు నే చెప్పిందానికి భళి భళి అని తాళం వేస్తూ ఉండు. మిగతా నాటకం నేనాడిస్తా.

వర: వాడు వచ్చే వేళయింది. తాలింఖానానుంచి గోదావరికి వెడుతూ ఒకసారి నన్ను తొంగిచూచి వెడుతూఉండడం పరిపాటైంది.

[అంజయ్య ప్రవేశం. బోడిగుండు. గుండుపై చిన్న పిలక. శాండో బనీను, కాకీ పొట్టిలాగు తొడుక్కొనిఉంటాడు. పుష్టైన మనిషి. ఎప్పుడూ ముక్కుని వుంటుంది కోపం. కయ్యానికి కాలు దువ్వే మనిషి. లిఫ్టింగ్ చెయ్యి చేసుకుంటాడు. కసరత్తు చేసివచ్చుటచే వళ్లంతా మట్టితో నిండి ఉంటుంది.]

వర: రారా అంజనం.

తిరు: రావోయ్ దిష్టిబొమ్మా!

అంజయ్య: (కుర్చీలో కూర్చొని మోచెయ్యి ముడిచి దండ చూసుకొని మురుస్తూ) ఇవ్వాళ తాలింఖానాలో వీరయ్యను చిత్తుచేశాన్రా!

తిరు: పిప్పళ్లబస్తాలాగున్నావు. బూడిద గుమ్మడికాయంత మోరీల బొజ్జ నువ్వూను. భస్మాసురిడిలాగ.

అం: (చిరాకుతో) ఒరేయ్! నువ్వు అట్టే పరిహాసంచేయకు, నాకు కోపమొస్తుంది.

తిరు: పోవోయ్, పిచ్చిపుల్లాయ్! తాటకి లాగ ఊబశరీరం పెంచేశావు.

అం: (విసుకుతో) ఇంకొచ్చేస్తో వబ్బాయ్! నాకు.

తిరు: అఘోరించావు. ఉండంముక్కా! వీరయ్యను కొట్టేముఖమేనా ఇది?

అం: (హఠాత్తుగా లేచి) వీపు రాంఢోలులా మోగిపోతుంది, చెవలవాజమ్మ!

తిరు: ఈ ఉష్ట్రపక్షి వస్తుందని నాకిదివరకే తెలుసు.

(అంజయ్య గబుక్కున కుర్చీలోంచిలేచి హుంకరించి తిరుపతిమీదకు గుమకుతాడు. వరహాలు అంజయ్యను పట్టుకొని కుర్చీలో కూలవేస్తాడు.)

వర: కూర్చోరా అంజనం. ఇవి తిరుపతి మాటలు కావురా.

అం: ఎవరిమాటలంటావు? మీరిద్దరూ కలిసి నన్ను 'ఫూలు' చేయకండి.

వర: (నవ్వుతూ) ఎవరివో చెప్పుకోరా, చూద్దాం.

తిరు: (నవ్వుతో) ఆమాత్రం చెప్పుకోలేకపోతే ఎందుకోయ్!

అం: (తిరుపతికేసి కోపంగా చూస్తూ) నువ్వు నోరుమూయరా. తిరుపతీ!

వర: శాంతించరా అంజనం. అవి వెంకయ్య పలుకులురా.

అం: (కోపంతో పళ్లు కొరుకుతూ) ఊహూ!

తిరు: నువ్వు రోడ్డురోలరువిట. పాణకబుట్టవిట.

వర: వెలిసిపోయిన బుట్టబొమ్మవిట.

తిరు: చీకేసిన మాగాయి టెంకవిట.

వర: గజ్జెలు కట్టిన గంగిరెద్దువిట.

తిరు: మువ్వలు గులకరించే ముట్టుపామువిట.

వర: ఇంకా ఏవేవో అన్నాడురా.

తిరు: నీ పిలక ఎప్పుడో ఝాడిస్తాడుటరా వాడు.

అం: (కోపంతో కుర్చీలోంచి లేచి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ నడుస్తూ) వాడి పీక నొక్కేసి వస్తా.

వర: (అంజయ్యని ఆపి) వాడు చచ్చిపోతాడురోయ్!

తిరు: వాడి గుండె తపేమని ఆగిపోతుంది.

అం: (వరహాలును ఒక్క ఊపు ఊపి పట్టు వదలించుకొని) నన్ను పోనీ.

తిరు: (అంజయ్యని పట్టుకొని) కూర్చోవోయ్! నీ ఇంట బటారంగానూ.

అం: ఒరే తిరుపతీ! నువ్వు గప్చిప్పుగ ఉండు. నీమాట వింటే నాకు మరీ కోపం ఎక్కువైపోతోంది.

వర: కూర్చోవోయ్! వెధవ అట్టహాసం నువ్వూను.

అం: (కుర్చీలో కూర్చుని) నా కసలు కోపం రానేరాదు. నెత్తురు కళ్ళచూస్తే నే గాని వచ్చింది పోదు.

వర: దాని కింత బ్రహ్మాండం చేయాలా. పాత బేమతో గడ్డం గీసుకో. పాతబ్లేడు యివ్వనా?

అం: (కుర్చీలోంచి లేస్తూ) మీ హాస్యం బాగుంది. తరువాత ఏం జరిగినా సరే వెంక

# "వాడు వట్టి శుంఠరా!" ★

య్యను చితకా మతకా చింతకాయ పచ్చడి చేసివస్తా.

తిరు: (లేచి) దానికి నువ్వు వాడిదగ్గరకి వెళ్లాలా? నేను వాణ్ని ఇక్కడకు పంపిస్తా. నీకు తోచినట్లు వాడిమీద కసి తీర్చుకో. (వరహాలు చెవిలో) వరహాలూ! వీడి వేడి తగ్గకుండా చూడు. తగ్గిపోతే మన ప్లానంతా తారుమారవుతుంది.

వర: (తిరుపతి చెవిలో) నాకా మాత్రం తెలియదంటావా?

[తిరుపతి నిష్క్రమిస్తాడు.]

అం: ఒరే వరహాలూ! తిరుపతి నీ చెవిలో ఏమి ఊదాడురా?

వర: అదంతా ఎందుకురా? అసలే అగ్గిరాముడివై పోయావు.

అం: చెప్పవోయ్!

వర: వెంకయ్య దుర్భాషలన్నీ తిరుపతి నీతో చెప్పొద్దన్నాడురా.

అం: ఏం?

వర: నీది వళ్ళూపై తెలియని కోపమని. తీరా వెంకయ్య ప్రాణం పోయేటట్టు దంచావంటే మా కొంప ముల్గుతుంది. లేనిపోని పాపం మామెడకు చుట్టుకొంటుంది.

అం: అదా! వీడి తగలెయ్యా! ఈ తిరుపతి ఏదో ముఖ్యం లేకుండా ఏదీ చెప్పడు. ఒరే వరహాలూ! వెంకయ్య తిట్టినతిట్లన్నీ నాతో పూర్తిగా చెప్పేయి. లేకపోతే నిన్నూ, వాణ్ణీ కలిపి తంతా. నువ్వు - తిరుపతి తోడుదొంగలు.

వర: ఉండు, ఉండు. అఘాయిత్యం ముండావాడివి. చెపుతానుండు.


అం: వెంటనే చెప్పు మరి.

వర: నువ్వు - మరేం - ఇవి నామాటలు కావుసుమా - నువ్వు సున్నపు పిడతవిట. విగ్రహపుష్టికి నైవేద్యనష్టికి వెలిశావుట. నీ తెలివి ఏనాడో సంతకి వెళ్లిందిట. అది కేవలం సహారావంటి చవిటిపర్రట. కాకి రూపు నీరూపం ఏకంట.

అం: వెంకయ్యని ఏంచేస్తే పాపముందో చెప్పరా.

వర: (అంజయ్యమాట వినిపించుకోకుండా) నువ్వు...

అం: ఇంక చాలు. వాడిమాటలు వాదగ్గర కట్టిపెట్టెయ్యి. ఒక మెతుకు పట్టిచూడగానే తెలిసిపోతుంది.




వర: అంజయ్యోయి! ఒకమాట విను. వాడిని నువ్వు కొడుతోంటే మర్యాదకు నేను అడ్డుకోవలసి వస్తుంది.

అం: అల్లాంటిపని చేయకు. అల్లాచేస్తే మళ్ళీ నువ్వు బిస్మిల్లా - అవుతావు.

వర: అందుచేత వాడు రాగానే నేను టీ పట్టుకువస్తానని అవతలకి పోతా. నేను తిరిగి వచ్చేలోపుగా వాడి ప్రాణాలు ఔపోసన పట్టేయి.

అం: సరే! నువ్వు బయటకు వెళ్ళిం తర్వాత వాడితల అంటుతా.

[వెంకయ్య ప్రవేశం. బక్కపలచటి మనిషి]

వెంకయ్య: ఏంరా వరాలూ! ఎందుకో రమ్మన్నావుట? అతి జరురు అన్నావుట. (నవ్వుచు) తిరుపతి నిలుచున్నపళంగా ఇక్కడికి నన్ను తోలాడురా.

వర: టీపార్టీకి పిలిచారా. నీకీ సంగతి చెప్పలేదేమిటి వాడు?

వెం: వాడు వట్టి శుంఠరా! ఒకటో తరగతి పెయ్యమ్మ.

అం: (తొట్రుపాటుతో) నేను శుంఠనా! ఒరే వరహాలూ! నువ్వు త్వరగా పో.

వర: వెంకయ్యా! టీ పట్టుకు వస్తాను. కూర్చో.

(వరహాలు బయటకి వెడతాడు. వెంకయ్య కుర్చీలో కూర్చుంటాడు. వెంటనే అంజయ్య లేచి వెంకయ్య నెత్తిని మొత్తుతాడు.)

వెం: (తలమీద చేతు లడ్డు పెట్టుకుంటూ) అమ్మోయి! బాబోయి! నీకేం పోయేకాలం వచ్చిందిరా! ధడవా! నన్ను బాగుతావేం? నిన్ను తెగ నరక, మురికివెధవ! శుంఠా!

అం: ఆ, అందుకే, అందుకే. (వీపుమీద కొడతాడు. వీపు సవరించుకొంటూ వెంకయ్య కుర్చీలోంచి లేచిపోతాడు.)

వెం: నన్ను చంపేస్తున్నాడండోయ్! హరి రాక్షసి వెధవా! నీ ముఖం సంతకెళ్లా! నేనేం చేశానురా?

అం: అదే, అదే (మూలనున్న గొడుగు తెచ్చి మళ్ళీ వెంకయ్యని కొడతాడు. గుమ్మంలోంచి వరహాలు టీ కప్పుతో ప్రవేశం.)

వర: వెంకయ్యా! పారిపోక చూస్తావేం? అల్లా కుళ్ళపొడుస్తోంటే మట్టి ద్రోణాచార్యునిలా చతికిల పడిపోతావేం!

[వెంకయ్య 'బ్రతుకు జీవుడా' అంటూ గదిలోంచి పారిపోతాడు.]

వర: (అంజయ్యకేసి చూచి, మందహాసంతో) భలేగా బాదావురా!

అం: పోవోయ్! ఇంకా పూర్తిగా తన్నందే! చచ్చుపీనుగవు నువ్వు పానకంలో పుడకలా మధ్యలో వచ్చావు.

## 2 వ రంగం

[వెంకయ్య గది. గదిలో గోడకానుకొని ఒక చిన్న టేబిలు. టేబిలు కెదురుగా ఒక కుర్చీ ఉంటాయి. టేబిలుపై చిందర వందరగా కొన్ని పుస్తకాలు పడిఉంటాయి. దానిమీద జాంబక్, అమృతాంజనం సబ్బాలు, కర్పూర తైలం, టించరయొడిను సీసాలుకూడా ఉంటాయి. గదిమూల ఒక చోట చేతికఱ్ఱ గోడకానించిఉంటుంది.

గదిలో ఒకవైపున చాప పరచివుంటుంది. చాపమీద ఒక బొంత, ఒక తలగడ ఉంటాయి. స్టౌమీద నీళ్ళు కాగుతూ ఉంటాయి.

చాపమీద వెంకయ్య కూర్చుంటాడు. వడ్డికాసులు స్నేహితుని నెత్తికి కర్పూర తైలం మర్దనా చేస్తుంటాడు. వడ్డికాసులు భుజంమీద తుండుగుడ్డ వేలాడుతుంటుంది].

వెం: ఇప్పటికి కొంత సద్దుకుందిరా, నీపుణ్యమా అని!

వడ్డి: ఔనురాపాపం/ వళ్లంతా హూనమై పోతేనే! వాడు నిన్ను అసలు ఎందుకు కొట్టినట్లు?

వెం: అదే నాకర్థమవటం లేదురా.

వడ్డి: ఎవడో కిట్టనివాడు అంజయ్యకి నీమీద ఏదో చెప్పిఉంటాడు.

వెం: నాకూ అలాగే తోచింది.

వడ్డి: వరహాలు చేయించాడంటావా?

వెం: ఛా - పాపం - వాడే చివరకు అడ్డొచ్చి ప్రాణం కాపాడుత. వాడు బా[illegible]స్తోంటే విస్తుపోయి నిలబడిపోయాను. అప్పుడు వరహాలు 'బతికుంటే బలుసాకు తినొచ్చు' తోక ఝాడించవోయి అని పలాయనమంత్ర ముపదేశించాడు.

వడ్డి: ఇది తిరుపతిపన్నుగడ అంటావు.

వెం: ముమ్మాటికి. నా బొందిలో ప్రాణముండగా వాడిమీద పగ తీర్చుకోకుండా వదలను.

వడ్డి: తిరుపతి దీనికంతకూ గ్రంథకర్తని ఋజువు కావాలి.

వెం: నువ్వు వకీలుపంతులవిరా. ప్రతి చిన్న విషయానికి ఋజువేమిటి?

వడ్డి: అందర్ని శంక అంటావేమి నీవేమం? అంజయ్య బుద్ధిచెప్పినా ఇంతేనా?

వెం: (మాటతప్పించి) తిరుపతి తంత్రాలగొట్టురా. (కొంచెమాలోచించి) బహుశా తిరుపతి ఇవ్వాళ నన్ను పరామర్శ చేయడానికి వస్తాడు. నామీద ద్వేషమున్నట్లు వాడివద్దకుపోయి రహస్యాన్ని తెలుసుకో. తరువాత నీకు చేతనైనది, నాకు కసితీరేట్లు చెయ్యి.

[తిరుపతి ప్రవేశం]

తిరు: ఏమోయ్! వెంకయ్యా! పాలిపోయావు. ఏమైనా జబ్బు చేసిందా?

వెం: నీకు తెలియనిదా ఇది, వెధవన్న వెధవలాగ, అల్లా అడుగుతున్నావుగాని!

# రచయితలకు మనవి

## మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపే వారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫొటోలతో నే చేర్చిపంపాలి.

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి.

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి నెగటివ్ లు స్వీకరించబడవు.

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి. రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం.

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం. ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది.

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయం నుంచి ఎట్టిదైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన.

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము

—సంపాదకుడు

తిరు: అబ్బే! నాకేం తెలుసోయ్! (గది కలియచూచి) ఈ సరంజామా చూస్తుంటే ఏ సైకిలుమీదనుంచో పిల్లి మొగ్గలు వేసినట్లు తోస్తోంది.

వెం: నీ నక్కజిత్తులు నా దగ్గర కట్టిపెట్టరా. అంతా నడిపించి చివరకు ఏమీ ఎరగనట్లు ఇక్కడికి వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నావూ? ఛీ, ఛండాలుడా.

తిరు: (వడ్డికాసులు చెవిలో) కాసులూ! వీడి ధోరణి చూశావా?

వడ్డికాసులు: (తిరుపతి చెవిలో) పట్టుకొని రెండు చరుపులు చరుచు.

తిరు: (కాసులు చెవిలో) ఆ పని నేను ఖుద్దున చేయాలంటావా?

వడ్డి: (తిరుపతి చెవిలో) గత్యంతరం లేదోయ్!

తిరు. (కాసులు చెవిలో) అల్లా చేస్తే గాని చావగా మిగిలిన రవంత పులుసు విరిగి పోదంటావు. ఏం?

వడ్డి: (తిరుపతి చెవిలో) అయితే, తిరుపతీ! మొన్న అంజయ్య యెందుకు వీణ్ణి కొట్టుత?

తిరు: (కాసులు చెవిలో) ఏం లేదోయ్! 'అంజయ్యా, వెంకయ్య నిన్ను నానా బూతులూ తిట్టాడు' అని చెప్పాను అంతే!

వడ్డి: (తిరుపతి చెవిలో) అంతా నీ ప్రయోజకత్వమే అన్నమాట.

తిరు: అంతే, అంతే!

వడ్డి: (తిరుపతి చెవిలో) ఒరేయి! ఈ బక్కవాడి ఎముకలు అంత నిర్దయతో పొడి చేయించావు, కదా! అది మంచిపనేనా?

తిరు: (కాసులు చెవిలో) ఏం చెయ్యమురా. వాడు నన్ను, నిన్ను చీటికి మాటికి ఇంతా, అంతా అని సంబోధిస్తుంటాడు. వాడి అహంభావం మండా!

వడ్డి: (తిరుపతి చెవిలో) అంతే లే బాగా చేశావు. వాడిమిడిసిపాటుకు తగ్గట్టే చేశావు.

తిరు: (కాసులు చెవిలో) మరే మను సున్నా వేమిటి, యీ తిరుపతి ప్రజ్ఞ.

వడ్డి: అయితే నాకుకూడ రెండు వాయించాలని ఉందిరా! ఏమంటావు?

తిరు: (కాసులు చెవిలో) కుమ్మేయవోయ్! దానికేం - శుభ్రంగా సున్నంలోకి ఎముక లేకుండా ఏం చేయి. నేను హృదయపూర్వకంగా హర్షిస్తా.

[వడ్డికాసులు తన భుజముమీదవున్న తుండుగుడ్డని తిరుపతి నెత్తిమీదవేసి రెండు చీకటి మొట్టికాయలు మొట్టుతాడు.]

తిరు: ఇదేం సందేహంరా కాసులూ?

వడ్డి: (ఇంకో రెండు మొట్టికాయలు వేసి.) ఛా ఛా-ఏయ్ వెంకయ్యా! మా స్నేహితుణ్ణి కొట్టావంటే ఏం చేస్తానో చూడు. నీవు మనిషివా? దున్నపోతువా? మున్సిపల్ కౌన్సిలర్ని కి అని పిలిచి కొట్టించి పంపుతావా? నీకు పుట్టగతులుంటాయా? (ఇంకో రెండు మొట్టికాయలు వేసి) పోవోయ్! నీ గదికి వచ్చాము కాబట్టి కొట్టేవు. ఆడదాని వేషాలూ నువ్వూను. రా. వీధిలోకి వచ్చి కొట్టుచూతాం. మా అంజయ్యని కొట్టు చూతాం, మా కోటయ్యను కొట్టుచూతాం. రేపు అంజయ్యచేత నీకు దేహశుద్ధి చేయించకపోతే యీ మొట్టికాయలు తింటున్న వాడు తిరుపతి కాడు. (ఇంకో రెండు మొట్టికాయలు వేసి) కురిడీయో, ముప్పేట కాయో చూస్తున్నావంటావా?...

[తిరుపతి గుంజుకొని గుంజుకొని చివరకు నెత్తిమీద తుండుగుడ్డను తోసేస్తాడు. వెంకయ్య గదిమూలనున్న కర్రను తీసుకొని ముందుకు వస్తాడు.]

వడ్డి: తిరుపతీ! నీకు ముద్దుగా ముసళ్ళ పండగ చేస్తాడట వీడు. ఈ వెంకయ్య అసూయత్వం చూడు—వీడికి యీ వేడి వేడి వీళ గుద్దు ప్రాప్తము చేయి (తిరుపతి వీపుమీద గుద్దుతాడు.)

వెం: తిరుపతీ! నువ్వు కల్లో లింగాన్ని మింగేవాడివి. నీకు గురిమించే కాసులు తటస్థపడ్డాడు. నీ బదులు జవాబు వాడికి నేనే చెపుతాగా! (కర్రతో తిరుపతి వీపుమీద బాది)ఇది వాడికి అందించు. దెబ్బకి గుక్క తిరగక దస్తాడు.

తిరు: నన్ను వదిలెయ్యరా! మీ జిమ్మడా!

వడ్డి: (వెంకయ్యతో) ఓహో హో! నీ పొగరింకా ఉంది! ఈ ముసుగు గుద్దులో అణగిపోతుందిలే. (తిరుపతివిపుమీద బలంగా గుద్ది) దీనిని వెంకయ్యకు దప్పెర ప్రాప్తము చేయి.

వెం: (వడ్డికాసులుతో తన వీపుమీదనే గుద్దుపడినట్లు నటిస్తూ) హరివెన్నవా ఎంత గుద్దు వేశావురా! ఇదిగో! బహుశ స్త్రీ ప్రయోగిస్తున్నాను. (కర్రనెత్తి) రేపుకి అడ్డంగా పెడుతున్నాను. తలతిరుగుడు పోతుంది. (తిరుపతితో) భయపడకేం? (కర్రని తిరుపతిబుర్రమీద వదులుతాడు. తిరుపతి 'అమ్మోయ్! వీళ్ళే తెలివితక్కువవాళ్ళోయ్!' అని పారిపోతాడు.)

వెం: అమ్మ! ఇప్పటికి నాకసి తీరింది.

వడ్డి: నాకు తీరలేదు.

వెం: ఏం?

వడ్డి: నీ పిలకకూడా ఝాడిస్తేగాని నాకు సంతోషం కలుగదు.

వెం: (బిక్కముఖంతో) ఏమిటిరోయ్! అల్లా అంటున్నావు?

వడ్డి: అందర్ని ఇంతా, అంతా అని తిడతావు మాటిమాటికి. నీ నోటిదురుసుతనమే నీకు దెబ్బలు తెస్తోంది.

వెంక: ఏదో బుద్ధి గడ్డితింది లే.

వడ్డి: బుద్ధి గడ్డితింటే వీపు దెబ్బలకి ఏడుస్తుంది. తెలుసా?

వెం: ఇంక జాగ్రత్తగా ఉంటాగా. పరుష వాక్యాలను రానివ్వను నోటంట. ఇదిగో లెంపలు వాయించుకొంటున్నా. (వెంకయ్య లెంపలు వాయించుకొంటాడు.)

(తెర పడుతుంది) ★

# మామిడి

"చదలవాడ"

నవరస భావాలంకృతమైనది కవిత్వం. షడ్రసోపేతమైనది భోజనం. కవిత్వమంటే కొందరే చెవికోసుకొంటారు. భోజనమంటే అందరూ నోరు తెరుస్తారు. ఒకటి వింటే ఆనందం కలుగుతుంది. మరొకటి తింటేనే ఆనందం. లోకంలో వినే వారికన్న తిని ఆనందించేవారే అధిక సంఖ్యాకులు. అందులోనూ వారిది "జిహ్వకొక రుచి." ఆ విషయం తెలిసివుండిన్నీ కవిత్వానికి తొమ్మిది రసాలు, పాకశాస్త్రానికి ఆరే రసాలు నిర్ణయించి పెద్దలు లోపం చేయడం తమకు తలవంపులుగా తలంచినారు భోజనప్రియులు. వారేం తక్కువ తిన్నవారు గనుకనా! వెంటనే మూడు రసాలూ ఎలాగైనా చేర్చి పాకశాస్త్రాన్ని కూడా నవరస భరితం చేయ సంకల్పించి వారు నడుములు సడలించినారు - అంటే నడుముకు కట్టిన ధోవతి పట్టు సడలించి నానా వస్తువులు తిని రస చర్చ చేశారు. కోటిలింగాలకు ఒకటి లోపిస్తే అది వీరేశలింగం అని పూరించుకొన్నారట ఎవరో. వీరున్నూ అదే సిద్ధాంతాన్ని అనుసరించి లోపించిన మూడు రసాలను అతి రసం, (అరిశెలు, అతిరసాలు - అత్రిసాలు అని ప్రాంతీయ పరిభాష) రసం, (అరవచారు) పండ్లరసం అని పూర్తిచేశారు. "పండ్లరసం" అని నిర్ణయం జరిగేసరికి చిన్నయసూరికి మించిన తిన్నయ్యసూరి మరొకడు "పండుకు రసం ప్రధానం" అని మరొక సూత్రాన్ని ప్రతిపాదించాడు. అటువంటి నిర్వచనానికి లక్ష్యమై రసానికి ఆలవాలమైన రసాలఫలం మన కత్యంత ప్రీతిపాత్రమై, మన మన్ననల నందుకోవడం మూలంగా రసాల వృక్షంకూడా మన ప్రశంసలకు పాత్రమైంది. తత్కారణంగా మామిడి ప్రభావం మనలో చాలా కనిపిస్తుంది.

ఏ శుభకార్యం తలపెట్టినా కడపకు మామిడాకుల తోరణం తప్పక కడతాము మనం. అందుకే "నిత్యకళ్యాణం పచ్చతోరణం" అనే సామెత పుట్టింది. మామిడాకుతో ప్రోక్షిస్తేగాని మంత్రజలానికి మర్యాదలేదు. హోమం చేసేటప్పుడు అగ్నికి ఆజ్యాహుతులు మామిడాకుతో చేయడం మన కలవాటు. కలశంమీది కొబ్బరికాయను కూడా మామిడాకుల మధ్యనే నిలుపుతాము.

భోజన రంగంలో మనకూ మామిడికాయకూ గల సంబంధం మరెవరికీ లేదని లొట్టవేసి చెప్పవచ్చును. మామిడికాయ పప్పు వండడం తెలుగువారికే తెలిసిన విద్య. ఆంధ్రత్వానికే అలంకారప్రాయమైన ఆవకాయ తయారయ్యేది మామిడికాయతోనే. ఆ మాటకొస్తే ఆవకాయ పెట్టడం ఒక కళ అనవచ్చును. అందులో చేరే వస్తువులు అందరికీ తెలుసు. కాని ఆంధ్ర మహిళామణి అమృతహస్తం సోకనిదే ఆవకాయకు చిరంజీవత్వం సిద్ధించదు. ఆంధ్రేతరులచేతి ఆవకాయ ఆరో నెలకు చెడిపోతుంది. నాలుకకు చురుకు పుట్టించి, రక్తంలో వేడి కలిగించి మనిషిలో చైతన్యం కలిగించడం చేత ఆవకాయ ఆంధ్రత్వానికి ఆయువుపట్టు అని చెప్పవచ్చును. సప్త సముద్రాల కవతల ఏదో భయంకరద్వీపంలో మంత్రాల మఱ్ఱిచెట్టు తొఱ్ఱగుండా పాతాళగృహం చేరితే అచ్చటవుండే బంగారపు పంజరంలో బంధించివున్న రామచిలుకలో రాక్షసుని ప్రాణం వుండేటట్లు, ఆవకాయ జాడీలో అడుగుముక్క కంటుకొన్న పూటలోని ఆఖరు ముక్కలో ఆంధ్రుని ప్రాణం అతి జాగ్రత్తగా బంధింపబడి వుంటుంది. అందుకే ఆ వస్తువంటే ఆంధ్రుడికి అంత ప్రాణం. కమ్మని ఆవకాయ పూటలో అన్నం కలుపుకొని కడుపునిండా తిని ఆంధ్రుడు కవిత్వం వ్రాస్తాడు. కారమో అంటూ తినే అనాంధ్రుడు కన్నీరు విడుస్తాడు. ఆంధ్రునికే ఆవకాయ జీర్ణమవుతుంది. ఆంధ్రేతరునికి అతిసారం పుడుతుంది. ఆంధ్రుల పంచప్రాణాలైన, ఆవకాయ, అన్నంలో పొడి, కొరివికారం, గోంగూర పచ్చడి ("గోంగూర" అన్నది మద్రాసులో తెలుగువాడికి పర్యాయపదం) పాత చింతకాయ పచ్చడి అనే వానిలో అగ్రస్థానం ఆవకాయదే. దీని విషయంలో మనవారికి ప్రాంతీయాభిమానాలు, కులవిద్వేషాలు, పార్టీద్వేషాలు, రాయలసీమ, కోనసీమ, సర్కార్లు అనే వ్యత్యాసాలు లేవు. తక్కిన అన్ని రంగాల్లో వ్యతిరేకాభిప్రాయాలతో సతమతమయ్యే ఆంధ్రులంతా ఆవకాయదగ్గర కలుసుకోకతప్పదు. ఆంధ్రులలో ఎన్నో "ఇజం"లు వున్నవి. కాని ఆవకాయలో నిజం వుంది. దానిని ఎవరూ కాదనలేరు. అటువంటి ఐక్యతా సాధనమైన ఆవకాయకు మామిడికాయ ముఖ్యం అనేది మరువతగిన విషయం కాదు.

పచ్చి మామిడికాయలు ముక్కలుగా తరిగి ఎండించి వరుగుచేసి వాన దినాల్లో పులుసులో వాడుతారు. ఆ వరుగును కూడా తాత్కాలికావసరాలకు పనికివచ్చే ఊరుగాయగా చేస్తారు. పుల్లమామిడి పండ్లు పులుసులోకి పనికివస్తవి. చింతపండుకు బదులు పచ్చిమామిడికాయలు చేర్చి పప్పు పులుసు తయారు చేయవచ్చును. మామిడికాయను చిన్న ముక్కలుగా తరిగి ఉప్పులో వూరించి ఆకు కొసను వడ్డించుకొని దానిని తాకి నాలికకు అద్దుకొంటూ తట్టెడు అన్నం తింటారు తమిళులు. నంజుకోవడం అన్న మాటకు అరవంలో "తొట్టుకరదు" అంటారు. "తొట్టు"కోవడం అంటే తాకడం అని కూడా అర్థం. అందుకే మన నంజుకోవడానికి వారి తొట్టుకోవడానికి ఎంతో తారతమ్యం వుంటుంది. వారి వ్యవహారమంతా "సూక్ష్మంలో మోక్షంగా" వుంటుంది. ఉప్పులో వూరి ఎండిన మామిడికాయలతో పెరుగుపచ్చడి చేయవచ్చును. దానికే "మామిడికాయ మిడుసు" అని కొన్ని ప్రాంతాల్లో పేరు. పచ్చి మామిడికాయ ముక్కలు, ఎత్తుకెత్తు పచ్చిమిరపకాయలు చేర్చి పచ్చడి తొక్కడం కూడా మనవారికి మామూలే. "వడుమాంగా" అనే మామిడిపిందెల ఊరుగాయ తయారుచేస్తారు తమిళ బ్రాహ్మణులు. ఈ వూరుగాయకు ఖర్చుతక్కువ. ఉపయోగం ఎక్కువ. సంవత్సరం దాకా ఆ మామిడిపిందెలు చెడకుండా ఎప్పుడు తిన్నా అప్పుడే కోసిన పిందెలవలె "కటుక్కు" మని పంటికి తగులుతవి. "వడుమాంగా" పెరుగన్నానికి నంచుకొను పెన్నిధిపంటి వస్తువు.

మామిడికాయతో సంబంధించిన మరొక అపూర్వమైన సృష్టి "మాంగా, తేంగా

పటాణీ సుండల్" అనేది. కొబ్బరికాయ తురిమిచేర్చి, మామిడి ముక్కలూ పడవేసి తయారుచేసిన బటానీ గుగ్గిళ్ళకు వచ్చిన తిప్పలు "తేంగామాంగా పటాణీసుండల్"! బీచిలో, మద్రాస్ సెంట్రల్ స్టేషనులో ఇది లభిస్తుంది. ముస్తాబైనఅమ్మాయి మూకుడు చేసి పొట్లాలు చేతబట్టుకొని ముద్దుముద్దుగా "తేంగా, మాంగా, పటాణీ సుండల్" అంటూ అమ్ముతూ ఒకపొట్లానికి అణా ఖరీదుపుచ్చుకొని వెళ్తుంది. ఆ పొట్లంలో వుండేవి, అక్కడక్కడా మాంగా, అంతకు తక్కువ తేంగా పంటికి చాలని బటానీలే! పరాకు చూస్తూ పరధ్యానంగా తింటే ఆపటానీలతో బాటు పానకంలో ప్రవేశించిన పచ్చిమిరప కాయకూడా లోపలికిపోయి చురక వేసినట్లు చురుకుమంటుంది. పరధ్యానం పటాపంచలై పోతుంది. కాగితం నలిపి చేతిని తుడుచుకొని, కర్చీఫుతో కన్ను తుడుచుకోవడం జరుగుతుంది. ఆరీతిగా అణాకు సముద్రతీరంలో అశ్రుతర్పణం చేసేటి ఇంటిదారి పట్టడం జరుగుతుంటుంది మామూలు.

సాహిత్యరంగంలో కూడా మామిడిని గురించిన ప్రస్తావనలున్నవి. "అరవింమశోకంచ, చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ పంచైతే, పుష్పబాణస్య సాయకాః" (అమరం) అన్నట్లు తీయని విలుకాడైన మన్మథుని మెత్తని అమ్ములలో మామిడి చిగుళ్లుకూడా ఒకటి "బాల రసాలసాల నవ పల్లవకోమల కావ్యకన్యక" పోతనగారిది. ఆయనగారి కోకిల లేత మామిడి చిగురు తప్ప మరేదీ తినదు. అందుకే "లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిలచేరునే కుటజములకు" అన్నాడా కవి. రాయప్రోలు తమ రచనల్లో కొన్ని "మామిడి కొమ్మమీద కల మంత్రపరాయణుడైన కోకిల స్వామికి మ్రొక్కి" ప్రారంభిస్తారు. సాహితీవనంలో కవితాశాఖకూడా ఒక మామిడిచెట్టువంటిదే. కవిత్వానికిన్ని రసం ప్రధానం. మామిడి పండునున్నూ రసపుష్టి కలిగింది. అందులో కోకిల కూర్చున్నదంటే అది మామిడిచెట్టు తప్పక అయితీరాలి. "ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలం" అనేదే ఆ వాదానికి బలం చేకూరుస్తుంది. "అత్తివా

(48 వ పేజీ చూడండి)

# "అబద్ధం ఆడను"

"అబద్ధం ఆడటమంత నీచం ప్రపంచంలో మరొకటి లేదు. అసలు అబద్ధం ఆడాల్సిన గతి ఏం పట్టింది? ఏదన్నా తప్పు చేస్తేగా అబద్ధం ఆడవలసింది? అసలు తప్పు ఎందుకు చేయాలి? తప్పు చేశావనుకో, అబద్ధం ఎందుకు ఆడాలి? నిజం చెప్పి తను చేసిన తప్పుకు న్యాయంగా తనకు రావలసిన శిక్ష అనుభవించటంలో తలవంపులు ఎందుకు?" అన్నాడు జగన్నాథం తన మిత్రుల నుద్దేశించి.

"అదేమిట్రా ప్రాణాపాయంగాని మరేదయినా వచ్చిందనుకో అబద్ధం ఆడక ఏం చేస్తావు?" అన్నాడు సూర్యనారాయణ.

"అసలు ప్రాణాపాయం వచ్చే పనులు ఎందుకు చేయాలి? అంతమాత్రం ఒళ్లు దగ్గర పెట్టుకో నక్కర్లేదా?"

"సరేలే నీ తెలివి. పొరపాట్లు మానవ సహజం. 'పొరపాట్లు మానవులకు గాక మానులకొస్తాయా?' అన్నాడు."

దీనికి సమాధానంగా జగన్నాథం ఏదో చెప్పబోతున్నాడు. ఇంతసేపు అక్కడే కూర్చుని వాళ్ల సంభాషణ విని విసుగెత్తిన శర్మ "పదండ్రా బాబూ. మీ సంభాషణ వినలేక చస్తున్నాను. సినిమా కెళ్దాం రండి. మల్లీశ్వరి రెండోసారి 'రిలీజ్' అయిందట." అన్నాడు.

ముగ్గురూ సినిమాకు బయలుదేరారు.

సినిమానుంచి వస్తూకూడ జగన్నాథం "నేనుమటుకు చచ్చినా అబద్ధం ఆడదల్చుకోలేదు. అంత ఖర్మం ఏం పట్టింది? పొరపాటునయినా సరే, కలలో అయినా సరే అబద్ధం ఆడను" అన్నాడు జగన్నాథం.

"ఎప్పుడో ఒకప్పుడు అబద్ధం ఆడక తప్పదు లేరా. అందులో ఇది కలికాలం. 'కలికాలం అబద్ధాలకు మూలం' అన్నాడొకడు" అన్నాడు సూర్యనారాయణ.

* * *

సూర్యనారాయణ, జగన్నాథం, ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. శర్మ హైస్కూలులో ఇంగ్లీషు టీచరుగా వుంటున్నాడు. ముగ్గురు ఎప్పుడూ కలిసి మెలిసి అన్నదమ్ముల్లా వుంటారు.

జగన్నాథం ఉబుసుపోక ఉద్యోగం చేస్తున్నాడు. అది పురుషలక్షణం అని అన్నారు కాబట్టి చేస్తున్నాడు. సూర్యనారాయణ అలా కాదు. జగన్నాథంలాగా ఇతనికేమీ ఆస్తి లేదు. జగన్నాథానికి తాతలు సంపాదించిన లక్ష రూపాయల ఆస్తి వుంది. సూర్యనారాయణ తన రెక్కల మీదే ఆధారపడాలి. సూర్యనారాయణ సంపాదనపైనే ఇంటిల్లిపాదీ ఆధారపడి వున్నారు. అతని ఇంట్లో జనాభా కూడా తక్కువేం గాదు. కీళ్ళవాతంతో లేవలేని తండ్రి, తల్లి, భార్య, చెల్లెలు, తమ్ముడు. దేవుడు దయతలిచి అతనికి యింతవరకు సంతానం యివ్వలేదు గాని లేకపోతే ప్రపంచధర్మంప్రకారం నలుగురన్నా పుట్టి వుండాలి యిప్పటికి. చెల్లెలి పెళ్లి కూడా సూర్యనారాయణే చేయాలి. ఆమె స్కూల్ ఫైనల్ చదువుతున్నది. అది కాగానే చేద్దాం అనుకొంటున్నాడు. చెల్లెలి పెళ్లి

## వేమూరి సుబ్రహ్మణ్యం

చేయాలంటే వున్న యిల్లు ఒక్కటీ అమ్మటమో, తాకట్టు పెట్టటమో జరగాలి .. ఇంతకూ చెప్పొచ్చే దేమిటంటే అతని సంపాదనే ఆ యింటిమనుగడకు ఆధారం...

సూర్యనారాయణ కేవలం తనకు వచ్చే జీతంతో వీళ్ళని పోషిస్తున్నాడా? అంటే అది శుద్ధ అబద్ధం. కాస్తో కూస్తో వీలున్నప్పుడల్లా పై, పై, సంపాదనకు వెనుకాడడు. దీనిలో అతనికి తప్పు కనబడలేదు. అవును మరి తనబోటివాడు అంతకంటె ఏమి చేయగలడు. తానూ ఏ 'జగం'లాగో పుట్టివుంటే, అసలు ఉద్యోగమే చేసేవాడుగాడు. తాను జగం కాక సూర్యం గనుకనే స్కూల్ ఫైనల్ అయినవెంటనే, కాలేజీలో చేరాలని ఎంత కుతూహలపడ్డా వీలులేక ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. కుటుంబపోషణకోసం పై సంపాదనకు చేతులుచాచినా తప్పు లేదు - అని తనకు తానే సమర్థించుకొనేవాడు మనస్సులో.

ఒకటిమాత్రం నిజం. సూర్యనారాయణకు 'ఈ పైసంపాదనలో' అనుభవమూ, తెలివితేటలూ తక్కువ కాకపోతే ఐదేళ్ళనుంచి వుద్యోగంచేస్తూ, చెల్లెలిపెళ్లికోసం ఇల్లు తాకట్టు పెట్టాల్సిన ఖర్మం ఏంపట్టింది? ఎప్పుడూ మంచి పేంటూ, చొక్కా లేకుండా ఆఫీసుకు పోవాల్సినగతి ఎందుకు? పైసంపాదన అని పేరేగాని అతడు నెలకు ఇరవై, పాతికకంటె ఎక్కువ సంపాదించలేదు...

ఆరోజు సూర్యనారాయణ ఆఫీసులో ఏవో అవసరమైన కాగితాలు చూచుకొంటున్నాడు. అవేవో అర్జెంటు కాగితాలు కనుక తలెత్తకుండా పనిచేసుకొంటున్నాడు.

"మాస్టారూ' అన్న పిలుపు విని తలెత్తి చూశాడు. తెల్లటిలాల్చీ, తెల్లటిపంచె, కళ్లజోడు పెట్టుకొని, జుట్టు పైకి ఎగదువ్వుకుని ఒకాయన నుంచొని ఉన్నాడు.

"ఏం కావాలండీ" అని అడిగాడు సూర్యనారాయణ.

"చూడండి! ఈపని కాస్త త్వరగా అయ్యేటట్లు చూడండి" అని ఒక కాగితం సూర్యనారాయణచేతి కిచ్చాడు.

అదేదో అప్లికేషన్ "అబ్బే ఇప్పుడు వీల్లేదండీ తొందరపనిలో వున్నాను" అన్నాడు సూర్యం. నిజానికి అతను తొందరపనిలోనే వున్నాడు.

"అబ్బే, అది కాదండి. యీపని అవటానికోసరం నాకు కాస్త డబ్బు ఖర్చు అయినా ఫరవాలేదు" అని ఆ పెద్దమనిషి వందరూపాయల నోటు జేబులోంచి తీశాడు.

వందరూపాయల నోటు! సూర్యం కళ్లు జిగేలుమన్నయ్. అది తన జీతంకన్నా కూడా ఎక్కువ. వందరూపాయలతో ఎన్ని పనులు చేయవచ్చు?... ఇంతకన్నా ఆలోచించలేకపోయాడు సూర్యం.

"సరే కాగితం యిచ్చి సాయంత్రం రండి" అన్నాడు సూర్యం.

ఆయన నవ్వుతూ "అలాగే నండి" అని ఆ కాగితంతో పాటు వందరూపాయల నోటు కూడా యిచ్చాడు. చేతులు వణుకుతూ ఉంటే సూర్యం అది తీసుకొని పక్కకు చూచేడు. జగన్నాథం చిరునవ్వు నవ్వాడు, పక్కసీటులో కూర్చుని.

* * *

"ఇప్పుడేలాగరా? ఆ పెద్దమనిషి ఇంత పని చేస్తాడనుకోలేదు. ఏదో పెద్దమనిషిలాగా వున్నాడుగదా అని వందరూపాయలు తీసుకొంటే, ఈమాత్రానికే ఆయన రిపోర్టు చెయ్యాలా? కావాలంటే వంద రూపాయలు తల తాకట్టుపెట్టి అయినా యిచ్చేవాడిని గాదూ?..." అన్నాడు సూర్యం బాధగా, విచారంగా. అక్కడ

వున్న మిగతా యిద్దరూ అతనికి సానుభూతి చూపారు.

"పైగా యిదొకటి. ఆయన నన్నే సాక్ష్యం వేసుకోవాలా. ఇంకెవరూ దొరకలా?" అన్నాడు జగన్నాథం.

"అదేమిట్రా అట్లా అంటావ్? అదీ మన మంచికేలేరా! నువ్వు టకాయించి చెప్పెయ్యొచ్చు. అసలు సూర్యం నిరాకరించాడనీ, ఆయనే బలవంతంచేసి యివ్వబోయాడనీ, చివరికి సూర్యం తీసుకోలేదనీ, ఢంకామీద దెబ్బకొట్టి మరీ చెప్పు" అన్నాడు శర్మ.

"అదెట్లాగరా? సూర్యం తీసుకోవటం నేను కళ్ళారా చూశానుగా? అబద్ధం ఎట్లా చెప్పేదిరా?" అన్నాడు జగన్నాథం.

"వాడు మాత్రం తీసుకొన్నాననే మొత్తుకొంటున్నాడుగా. వాడి జీవనోపాధి కోసరమన్నా నువ్వు అబద్ధం ఆడక తప్పదురా. మిత్రుడివై వుండి ఈమాత్రం సహాయం చేయకపోతే ఎట్లారా?"

"జగం, ఈసారికి రక్షించరా. బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడూ లంచం తీసుకోను, ప్రాణం పోయినా" జాలిగా అన్నాడు సూర్యం.

జగన్నాథం కాసేపు మౌనం వహించాడు. చివరికి "పోనీలేరా. విచారణ జరుగుతుంది. ఫైన్ వేస్తారు. అంతేనా? ఫైన్ ఎంతయినా సరే నేను కడతానులే. చూస్తూ, చూస్తూ అబద్ధం ఎట్లా ఆడేదిరా" అన్నాడు.

శర్మకు ఒళ్లు మండింది. "అబద్ధం ఎట్లా ఆడేదిరా? అబద్ధం ఎట్లా చెప్పేదిరా? అని మాటిమాటికీ అంటున్నావు. అబద్ధం చెప్పకుండానే మీ పూర్వులు యింత ఆస్తి సంపాదించారా? అది నువ్వు అనుభవించటం లేదూ? ఇప్పుడు ఆప్తమిత్రుడికి ఆపద వచ్చిందనేగా నిన్ను ఆదుకోమంటున్నది? అబద్ధం చెప్పనంటే ఎట్లా?" అని దురుసుగా అన్నాడు.

"శర్మా. నువ్వూరుకోరా. జగం! ఫైన్ వేయకుండా ఉద్యోగం తీసివేస్తే..." అన్నాడు సూర్యం దీనంగా.

"ఉద్యోగంలోంచి తీసేస్తారా!... అబ్బే అటువంటిది జరగదులేరా. రెండేళ్ళ క్రిందట ఏమయింది? నాగేశానికి ఐదు వందలు ఫైను వేసి వదలలేదూ?" అన్నాడు జగన్నాథం.

"అయితే నువ్వు అబద్ధం ఆడవన్న మాట! ఒరే జగం మిత్రుడి సంగతి ఆలోచించరా." అన్నాడు శర్మ బ్రతిమలాడుతూ.

"జగం! గట్టిగా ఆలోచించరా. నీకు అయితే ఉద్యోగంపోతే యింట్లో కూర్చుని తింటావ్. కాని నా విషయం అలాకాదు. ఆలోచించు! ఈ ఉద్యోగంపోతే యింటిల్లిపాదీ నడిబజార్లో పడతారు." అన్నాడు సూర్యం, విచారంగా.

జగన్నాథం మౌనం వహించేడు.

మౌనం అంగీకారం అనుకొన్నారు మిత్రులు.

* * *

ఆఫీసరు విచారణ కొచ్చాడు.

సూర్యం కంపించిపోతున్నాడు...జగం ఏంచేస్తాడో...ఆఫీసరు సూర్యాన్ని అడిగాడు. తాను తీసికోలేదని తెగేసి చెప్పాడు సూర్యం. ఆఫీసరు జగాన్ని అడిగాడు. "ఏమయ్యా. ఈయన నువ్వు చూశావని చెబుతున్నాడే? చూశావా?"

సూర్యం జగంవంక ఒక్క చూపు చూసి తలదించేసుకొన్నాడు. సూర్యం చెవులు ఆతురతతో వింటున్నయ్.

"నేను చూశానండి." అని చెప్పాడు జగం.

ఆఫీసరు వెళ్లిపోయాడు.

సూర్యం ఒక్కసారిగా కూలపడ్డాడు. జగన్నాథం సూర్యందగ్గరికి వచ్చాడు. "క్షమించు బ్రదర్. అబద్ధం ఆడలేను. ఎంత ఫైను అయినా సరే నేను కడతాను." అని జేబులోంచి నోట్లకట్ట తీశాడు.

సూర్యం ఏమీ మాట్లాడలేదు.

ఇంతలో ప్యూనువచ్చి ఒక కాగితం సూర్యం చేతికిచ్చి వెళ్లాడు. సూర్యం చేతులు వణుకుతుండగా కాగితంతీసి చూశాడు... అతన్ని బర్తరఫ్ చేస్తూ వచ్చిన ఆర్డర్!...

కాగితం చదివి నిర్ఘాంతపొయ్యాడు జగన్నాథం. ఇదేమిటి? ఇట్లా జరిగింది? తానొకటి తలిస్తే వేరొకటి అయిందే? ఛీ! ఛీ!! నేనెటువంటి పని చేశాను? చేతులారా ఒకడి ఉద్యోగం పోగొట్టానే అని కుమిలిపొయ్యాడు.

"క్షమించు బ్రదర్. అపరాధం క్రింద ఇవి తీసుకో" అని నోట్లకట్ట సూర్యం ఒడిలో వుంచాడు.

నోట్లకట్టను అతనిమీద విసరికొట్టి సూర్యం మౌనంగా వెళ్ళిపోయాడు.

* * *

జగన్నాథం అపరాధాన్ని సూర్యం, శర్మ క్షమించలేకపొయ్యారు. అవును మరి, క్షమించదగ్గ అపరాధమేనా అది? వాళ్ళిద్దరూ అతనితో మాట్లాడటం మానివేశారు. జగన్నాథమే రెండుసార్లు పలుకరించబోయినా మాట్లాడలేదు. జగన్నాథానికి భరించరానంత బాధ కలిగింది. ఆప్తులు తన తప్పును క్షమించలేకపోతే ప్రపంచంలో అంతకన్న బాధ మరొకటి ఏముంటుంది?

ఇటువంటి బాధ భరించలేక ఆఫీసుకు మూడు నెలలు శెలవు పెట్టి దేశాంతరం బయలుదేరాడు జగన్నాథం.

మూడు నెలలు తిరిగాడు దేశమంతా. కాని మనశ్శాంతి కలుగలేదు. సూర్యం పడే కష్టాలను ఊహించుకొని బాధపడుతున్నాడు జగం. తనకు తానే శిక్ష విధించదలచుకొన్నాడు...తాను సూర్యానికి చేసిన అన్యాయం ఫలితంగా తన ఆస్తిలో సగం సూర్యానికి రాసిద్దామనే నిర్ణయంతో తిరిగొచ్చాడు. వెంటనే సూర్యం యింటికి బయలుదేరాడు.

జగన్నాథం సూర్యం యిల్లు చేరేటప్పటికి ఏడుపులు కర్ణకఠోరంగా వినిపిస్తున్నయ్. జగన్నాథం కంపించిపోయాడు. 'సూర్యానికేమన్నా...' ఇక ఊహించలేక వడిగా లోపలికెళ్ళాడు. అక్కడ శవం ఏదీ లేదు. కాని యింట్లో అందరూ దుఃఖంలో మునిగివున్నారు. సంగతి అర్థంకాక అక్కడే నిశ్చేష్టుడైనిలబడి "సూర్యం ఏడండీ" అని అడిగాడు.

అక్కడ ముసిలాయన పెద్ద పెట్టున ఏడుస్తూ "అయ్యో ఇంకెక్కడి సూర్యం నాయనా! మాతో చెప్పకుండా యుద్ధంలోకి ఎందు కెళ్ళావురా నాయనా? నిన్ను చూసుకునే కదరా ఇన్నాళ్ళూ బ్రతికింది? ఇంకెవరిని చూసి యిప్పుడు బ్రతకాలిరా?" అని ఆయన హృదయవిదారకంగా విలపిస్తున్నాడు.

జగన్నాథం నిశ్చేష్టుడయ్యాడు.

శర్మ అక్కడే కూర్చున్నాడు. జగన్నాథాన్ని చూడగానే అతనికి పట్టరానంత కోపం వచ్చింది. "ఛీ! దుర్మార్గుడా. ఇంకా యిక్కడికెందుకు వచ్చావ్? స్నేహితుడవా? అది ఆనాడే అయిపోయింది. వాళ్ళిలా ఏడుస్తుంటే నీకు సంతోషంగా వుందా! ఆరోజున నీకు ఎంత చెప్పాను ప్రాధేయపడుతూ! ఛీ! ఛీ!! నీ ముఖం చూస్తేనే పాపం వస్తుంది. ఇక్కడనుంచి వెళ్లు" అని అరిచాడు.

జగన్నాథం జవాబియలేదు. అక్కడనుంచి కదలనూ లేదు.

"ఇప్పటికైనా సంతృప్తికల్గిందా/ ఇప్పటికైనా తెలిసిందా నీ సత్యవ్రత ఫలితం. సంసారాన్ని పోషించలేక సూర్యం యుద్ధంలోకి వెళ్ళి అక్కడ చనిపోయాడు. !ఛీఛీ! ఇంకా యిక్కడే వుంటున్నావా? బైటికి పోవేం?" అని పట్టరాని కోపంతో జగన్నాథాన్ని బైటికినెట్టి తలుపేశాడు...

★

సీరియల్

# ఉదయ కిరణాలు

పోతుకూచి సాంబశివరావు

## 18

ఒకే యింట్లో ఉంటున్నా, ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా, ఒకరి గుమ్మం ఒకరు తొక్కకుండా, పంక్తిభోజనాలు మానేసి, బద్ధ వైరం సాగిస్తున్నారు పరంధామయ్య, ప్రకాశం. మాణిక్యం స్వయంగా వైరం పెంచుకోడానికి సాహసించక పోయినా పరంధామయ్య పట్టుదల వల్ల ఆ కుటుంబాలమధ్య మాటలు ఆగిపోయాయి. మాణిక్యం మాత్రం అప్పుడప్పుడు చామంతిని, పూబంతిని పిలిచి పలకరిస్తోంది. ఆ పిల్లలు కూడా మేనత్తమీద సహజంగా ఉండే అభిమానం ఒక్కసారి దూరం చేసుకోలేక, తండ్రి లేనప్పుడు, తల్లికి తెలియకుండా, చటుక్కున ఒక నిమిషం మాట్లాడుతూ పోతూ ఉండేవారు. తన యింట్లో చేసుకున్న ఫలహారాలు అలవాటు ప్రకారం పిల్లలిని పిల్చి చాటుగా అందిచ్చేది మాణిక్యం.

ఈ కుటుంబాల మధ్య ప్రబలిన వైరంవల్ల సాంబుకు గొంతుకలో పచ్చి వెలగకాయ పడినట్లయింది. స్కూలు ఫైనలు తప్పి, రెండవ సంవత్సరము చదువుతున్నాడు.

ఆడవాళ్లతో చిన్నప్పటి స్నేహాల కలవాటుపడిన సాంబు ఈ మధ్యకాలంలో ఊరుకోలేదు. వయసు వస్తున్నకొద్దీ స్త్రీ కాంక్ష పెరుగుతోంది అతడికి. ఇంట్లోనే ఉంటున్న పూబంతితో సాంగత్యం అలవరుచుకున్నాడు.

పూబంతి పోర్తుఫారం చదువుతోంది. చామంతిని చదువు మాన్పించినందువల్ల పెళ్ళి సంబంధాలు తెచ్చుకోడంలో ఉన్న కష్టాలు గమనించి, పరంధామయ్య రెండవ కూతురు చదువు ఆపదల్చుకోలేదు. అయన కుటుంబంతో కాకినాడ వచ్చిన తర్వాత పూబంతి, సాంబు, ఒకేసారి కలిసి బడికి వెడుతూ వస్తున్నారు. ప్రకాశం పెళ్లి గొడవ వచ్చేదాకా వారి స్నేహానికి ఎటువంటి అంతరాయం కల్గలేదు.

సాంబు అల్లరివాడంటే పూబంతి అంతకు మించిన అల్లరి చేసేది. పూబంతి నిజంగా పూబంతిలా గెంతేది. చదువుమీదకన్న ఆటలు, కబుర్లు అంటె ఆమెకు చాలా యిష్టం. వారానికి ఒక సినీమా చూడకుండా ఉండలేకపోయేది. సాంబుకూడా పూబంతి తెచ్చిన డబ్బుతో ఎవరికీ తెలియకుండా ఆమెతో సినీమాకి వెళ్ళేవాడు. ప్రకాశం వీళ్ళ నిద్దరినీ పార్కుల్లోనూ, సినీమాల్లోను చూసినా, ఉన్న బంధుత్వం వల్ల, అపార్థం చేసుకునే అవకాశం లేకపోయింది. మాణిక్యం కూడా 'పిల్లలు, కలిసిమెలిసితిరగని' అనే ధోరణిలో ఊరుకుంది.

వయసు వస్తున్నా పిల్లలను ఒంటరిగా వదిలితే అనర్థకాలు రాకమానవు. ఒకరిమీద ఒకరికిఉన్న అభిమానం క్రమంగా ప్రేమగా మారి వారిని బంధించింది. ఏదో అపూర్వమై అగాధమైన ఆనందం తనలో వెల్లివిరిసినట్లు పూబంతిని చూడగానే ఒక అనుభూతిని పొందాడుసాంబు. ఏదో నెపంతో యీ యింగ్లీషుపాఠం చెప్పమని, ఆ లెక్క చేసి పెట్టమని సాంబుదగ్గరకు వచ్చేది పూబంతి. కలం ఒకసారి యిమ్మని, పెన్సిలు తెచ్చిపెట్టమని, తెల్లకాగితాలు కావాలని తన చదువుకు కావలసిన సామగ్రి అంతా పూబంతివద్ద సేకరించేవాడు సాంబు. అవి ఒకవిధంగా తన కవసరమైనా, మరో విధంగా పూబంతితో మాట్లాడే అవకాశం యిచ్చేవని సాంబు సంతోషించేవాడు.

సంయోగంలో కన్నా, వియోగంలో హృదయాల సాన్నిహిత్యం విలువ ఎక్కువ గుర్తుకు వస్తుంది. ఇద్దరిమధ్యా ఆటంకాలు ఏర్పడగానే, సాంబు, ఎప్పుడు కనిపిస్తాడా అని పూబంతి, ఆమె ఎప్పుడు కనిపిస్తుందా అని సాంబు, తమ గదుల కిటికీల్లో కూర్చుని చేతుల్లో పుస్తకాలు పెట్టుకుని చదువుకుంటున్నట్లు నటిస్తూ కూర్చునేవారు. పరంధామయ్య లేనప్పుడు, తల్లి పలకరించినపుడు, పూబంతిని చూస్తూ ముసిముసి నవ్వులు నవ్వి ఊరుకునేవాడు సాంబు. స్కూలు విడిచిపెట్టేక, సాయంత్రం పేళైనప్పుడు సినీమాలోనో ఎక్కడనో కలుసుకునేవారు వాళ్ళిద్దరు.

ప్రకాశం చామంతిని పెండ్లిచేసుకోనందుకు సాంబు ఎంతో సంతోషించాడు. పూబంతిని తాను తప్పక పెండ్లిచేసుకోవచ్చని అతడి ఆశ. కాని చామంతి పెండ్లి ఆ కుటుంబాలను విడదీసి, బంధుత్వాన్ని తెగ్రెంపులు చేసింది. పరంధామయ్య పట్టుదల సామాన్యమైనదికాదు. ఈ పరిస్థితుల్లో పూబంతిని ఎల్లా పెండ్లిచేసుకోవాలా అనే ఊహలో పడ్డాడు సాంబు.

సాంబు, పూబంతిలమధ్య అల్లుకుంటున్న అనురాగ బంధాలను అర్థంచేసుకునే అవకాశంకాని, వ్యవధికాని ప్రకాశానికి లేకపోయాయి. బి. ఏ. లో చేరాక ప్రకాశం నడతలో ఒక విచిత్రమైన మార్పు వచ్చింది. ఆ మార్పువల్ల అతని కార్యకలాపాలు పెరిగిపోయాయి.

ఇంటరులో మామూలుగా ప్యాసవడంతో అవధాని తనముందు చదువు చెప్పించడానికి శంకించాడని ప్రకాశం అభిమానం దెబ్బతింది. చిన్నప్పటినుంచి చదువులో తన పాటీ విద్యార్థియైన వెంకటేశం మొదటి క్లాసులో ప్యాసయ్యాడు. ప్రకాశాన్ని చూసినప్పుడల్లా విజయగర్వంతో నవ్వుతున్నాడు. అతడి నవ్వు ప్రకాశాన్ని చాలా కలత పెట్టింది. అతడి తెలివి తేటలకు అందరూ పోషిస్తున్నట్లనిపించింది. ఈ బి. ఏ. లో ఒక్కసారి తన తెలివి చూపించాలని నిశ్చయం చేసుకున్నాడు. కాలేజీలో బి. ఏ. లో చేరగానే తుపానులా విజృంభించాడు.

ఎన్నికలలో విద్యార్థి సంఘానికి అధ్యక్షపదవి సంపాదించాడు. మొదటి సంవత్సరం బి. ఏ. లో ఇంగ్లీషులో, గ్రూపులో ఫస్టు మార్కులు తెచ్చుకున్నాడు. నాటకాల్లో డిబేట్సులో పాల్గొని బహుమానాలు సంపాదించేడు. పద్యాలు వ్రాయడం నేర్చి కాలేజీలోని తెలుగు పండితులను మెప్పించాడు. కవిగా నటకుడిగా, వక్తగా, ఉత్తమ విద్యార్థిగా, విద్యార్థి నాయకుడిగా, ప్రకాశం మంచిపేరు తెచ్చుకొన్నాడు. పుస్తకాలతో కుస్తీపట్టే వెంకటేశం ప్రకాశం చేస్తున్న కార్యకలాపాలు చూసి ఆశ్చర్యపోయాడు. కాని ఇన్ని కార్యకలాపాలలో నిమగ్నుడైన ప్రకాశం బి. ఏ. లో తప్పక ఫేలయిపోగలడనే ధైర్యం మాత్రం అతడికి కలిగింది.

అప్పుట్లో సాంఘిక, వైజ్ఞానిక కార్యక్రమాలు ఎక్కడ జరిగినా ప్రకాశం సహాయం పురప్రముఖులు అర్థిస్తున్నారు.

ఒకరోజు ప్రొద్దున్నే మబ్బులు అలముకుని సూర్యుడు కనిపించలేదు. ప్రొద్దున్న

ఏ గొమ్మిది గంటలైనా చీకటివదిలినట్లు లేదు. కాలేజీలకు వెళ్ళేసమయానికి ముసురుతో వాన ఎక్కువైంది. ఆగోజల్లా ఈదురు గాలి వీచింది. రాత్రి గాలివాన, విజృంభించింది. ఇంటికప్పులు ఎగిరిపోయేటంత విసురులో గాలి ఝుయ్యిమంటూ విరామం లేకుండా హోరుపెట్టింది. చెట్లు గాలిలో గిజగిజలాడుతూ శరణు కోరుతున్నాయి. నిర్దాక్షిణ్యంగా కొన్నింటిని వేళ్లతో పెకలించుకుపోయింది గాలి.

గాలివాన రెండురోజులు భీభత్సంగా తాండవం చేసింది. సముద్రం పొంగింది. పాత కొకినాడలోని కూలివాళ్ళ గుడిసెలు కూలిపోయాయి. ఇళ్ళగోడలు కూలిపోయాయి చెట్లు రోడ్డకడ్డంగా పడిపోయాయి కొంపలు కూలిన కార్మికులు, నిలువ నీడలేని పేదవాళ్ళు ఆక్రందనలు చేశారు.

ప్రకాశం విద్యార్థి సంఘం నాయకులతో సంప్రతించాడు. చందాలు వసూలుచేసి కొంపలు కూలిన నిరుపేదలకు, అన్న, వస్త్రాలు పంచిపెట్టాడు. నిరుతో మురిగిన కార్మికుల పేటలకు తోటివిద్యార్థులతో వెళ్ళి పేదలకు సాయపడ్డాడు. నాటకాలు వేయించి ధనం సేకరించి పేదలు క్రొత్త యిండ్లు కట్టుకోడానికి సహాయపడ్డాడు.

దేశనాయకుడౌతాడనే ఆశతో తండ్రి యిచ్చిన నామకరణం బోసు విషయంలో వ్యర్థమైంది. నాయక లక్షణాలు లేక, పూర్తిగా ఒక అనామకుడిలా మందమతిగా తయారయ్యేడు. తెగువ, తెలివి, అతనిలో కనిపించలేదు. తండ్రిచాటున జాగ్రత్తగా శరీరం పోషించి పెంచుకుంటున్నాడు. ముఖానికి స్నో, పౌడరు, రాసుకుని, గంటసేపు ముస్తాబు చేసుకుని, నలిగిపోని ఇస్త్రీ మడతలు ఎప్పుడూ శోభిస్తుండగా అందంగా ఉండాలని యత్నించేవాడు. నిత్యం కోమలంగా ఉండాలని ఇతడు చేసే ప్రయత్నాలన్నీ చూసి కొంటె కుర్రాళ్లు గేలిచేసేవారు.

తన తండ్రీ, ప్రకాశం కుటుంబంతో వైరం పెంచుకున్నాక, బోసుకూడా తండ్రిని అనుసరించాడు. ప్రకాశం కాలేజీలోనూ, బయట చేసే పనులుగూర్చి నిత్యమూ వార్తలు యింటికి చేరుస్తున్నాడు. వీలైతే ప్రకాశం కార్యకలాపాలకు అడ్డుతగులుతున్నాడు. తన కార్యకలాపాలలో నిమగ్నుడైన ప్రకాశం చుట్టూ జరిగే విషయాలు పట్టించుకోడు.

కాలేజీలో సెలక్షన్ పరీక్షలు పూర్తయినాయి. విద్యార్థులను కొందరిని పరీక్షలో ఉంచేస్తారనే వదంతి పొక్కింది. విద్యార్థి సంఘ కార్యవర్గం సభలు జరిపి 'యీ పక్షపాత విధానం ఆగిపోవాలని' తీర్మానాలు చేయించాడు ప్రకాశం. ప్రిన్సుపాలుగారిని కలుసుకున్నాడు.

'నీ కెందుకోయి యీ గొడవలన్నీ! నిన్ను పరీక్షకు తప్పకుండా పంపిస్తాం' చికాకు వ్యక్తపరిచారు ప్రిన్సిపాలుగారు.

'నాకోసం రాలేదండి'

'అయినా ఒక్క విషయం అడుగుతా చెప్పు! ఇప్పటివరకూ పుస్తకాలు ముట్టుకోక పది మార్కులు తెచ్చుకోలేని విద్యార్థులు యూనివర్సిటీ పరీక్ష ప్యాసవుతారంటే ఎవరు నమ్మగలరు?'

'ఒక నెల రోజులలో పుస్తకాలు చదివి ప్యాసయిన విద్యార్థులున్నారు. మార్కులకు, వ్యక్తి తెలివికి సహస్రం తేడా ఉంది.'

'అబ్బాయి నాకు ప్రత్యేకం నీతులు నేర్పకు. నువ్వు చెప్పినది విన్నాను. అంతే!'

'మా మనవి మన్నిస్తారని ఆశిస్తున్నాం!'

ప్రిన్సిపాల్ గారు కళ్లజోడు తీసి, కోపంగా ప్రకాశంవైపు చూసి ముఖం చిట్లించారు. ప్రకాశం గిరుక్కున తిరిగి వెళ్ళిపోయాడు.

విద్యార్థుల ఊరేగింపు లేవదీశాడు ప్రకాశం. 'పక్షపాత విధానం నశించాలి' అంటూ విద్యార్థుల కేకలతో ఊరంతా ప్రతిధ్వనించింది. సాయంత్రం బహిరంగ సభ జరిగింది. ప్రకాశం ఉపన్యాసాలను విద్యార్థులు శ్రద్ధగా విన్నారు.

ఎప్పుడూ లేని హడావిడి చూసి ప్రిన్సిపాలుగారు కొంచెం తికమకపడ్డారు. ప్రకాశానికి కబురంపేరు.

'అబ్బాయి! చూడు! వీలైనంతవరకు అందరు విద్యార్థులను పరీక్షకు పంపాలనే మా ఉద్దేశ్యం. అసలుమార్కులు రానివిద్యార్థులను పరీక్ష మాన్పించక ఏంచేస్తాం'

'విద్యార్థులను దద్దమ్మలనడం భావ్యం కాదు. అందరు విద్యార్థులను పరీక్షకు పంపకపోతే, సమ్మెచేయాలని తీర్మానించుకున్నాం!'

'సమ్మె... సమ్మెచేస్తారా? బెదిరిస్తున్నారా?' ఉగ్రులైపోయి గుడ్లురిమారు ప్రిన్సిపాల్ గారు.

చేసుకోండీ! మీ యిష్టం వచ్చినట్లు చేసుకోండి! ప్యూన్...'

బంట్రోతును పిలిచిన ప్రిన్సుపాలుగారి పద్ధతిచూసి, ఆయన గదినుంచి ప్రకాశమే నిష్క్రమించాడు.

ప్రిన్సిపాలుగారు నోటీసు కట్టించారు. ఇరవైమందిని ఇంటరులో, పదిహేనుమందిని బి. ఎ. లో హాజరు సరిగాలేదని, మార్కులు సరిగారాలేదని పరీక్షకు పంపరని తెలియజేశారు. విద్యార్థులలో గందరగోళం పెరిగింది. సమ్మెకట్టారు.

కాలేజీ గేట్లదగ్గర పికెటింగు చేశారు

కొందరు విద్యార్థులు. ప్రకాశం అక్కడే నుంచుని ఉద్వేగంతో ఉపన్యాసిస్తున్నాడు. చాలామంది విద్యార్థులు బడి మానేశారు.

బోసు పుస్తకాలతో వచ్చి కాలేజీ గేటులో అడుగు పెట్టబోయాడు.

ప్రకాశం బోసుకు అడ్డుగా వెళ్లాడు.

'కాలేజీకి ఈరోజు వెళ్ళకూడదు.'

'నువ్వు నాతో మాట్లాడక్కర్లేదు'

'ప్రకాశానికి నవ్వు ఆగలేదు. బలవంతాన ముఖ కళవళికలు మార్చుకున్నాడు.

'అందరూ కాలేజీ మానేశారు. నువ్వు కూడా మానెయ్యాలి!'

'నువ్వు చదువుకోపోతే మానిరి! నన్నెనా చదువుకో నివ్వవా?' సాగదీసుకున్నాడు బోసు.

'నీతోటి విద్యార్థుల్ని పరీక్షకు పంపకుండా ఉంటే నీకిష్టమేనా?'

'అది నాకు తెలియదు' విద్యార్థులు గొల్లుమని నవ్వారు.

'నువ్వు ఈరోజు కాలేజీకి వెళ్లడానికి వీల్లేదు'

'మానాన్నతో చెబుతా.'

'నువ్వు కాలేజీలో అడుగు పెట్టదల్చుకుంటే మా శరీరాలమీదనుంచి నడిచి వెళ్ళాలి!'

'అంటే?'

ముగ్గురు విద్యార్థులతో ప్రకాశం గుమ్మానికి అడ్డంగా పడుకున్నాడు.

బోసు వాళ్ళమీదినుంచి నడిచి వెళ్లిపోయాడు.

'మొండి పీనుగ' అరిచారు పడుకున్న విద్యార్థులు ఒంటిమీది దుమ్ము దులుపుకుంటూ లేచి.

'ఛీ!' ప్రకాశం ముఖం చిట్లించాడు అసహ్యంతో.

పరంధామయ్యకు ఈ విషయం తెలిసింది. ప్రకాశాన్ని పిలిచాడు.

'నువ్వు కాలేజీ మానేదేకాక, బోసును కూడా వెళ్ళవద్దని అడ్డుకున్నావుట.'

'సమ్మె జరుగుతోంది.'

'ప్రబుద్ధుడవు బయలుదేరావు విద్యార్థుల నుద్ధరించడానికి! నీ ప్రవర్తన ఏమీ బాగులేదు. అవధానికి ఉత్తరం వ్రాస్తా.'

'వ్రాయొచ్చు.'

'ఆఁ' నిర్ఘాంతపోయాడు పరంధామయ్య.

సమ్మె నాల్గురోజులు సాగింది. బోసులాంటి పదిమంది విద్యార్థులు కాలేజీలో బెంచీలు అలంకరించారు. ప్రిన్సిపాలుగారు కొంచెం రాజకీయవేత్తలా ప్రవర్తిద్దామనుకున్నాడు.

'అందర్నీ పరీక్షకు పంపిస్తున్నా. సమ్మె మానెయ్యండి'

కొంతారావుగారు చేతికర్ర ఊపుకుంటూ ఉద్వేగంతో ఉపన్యాసమిస్తున్న ప్రకాశాన్ని ఆపి, వేదిక ఎక్కి ప్రకటించారు.

విద్యార్థులు ఉత్సాహంతో 'పక్షపాత విధానం నశించాలని' కేకలు వేశారు. సభలో సమ్మె మానెయ్యాలని తీర్మానించారు. ప్రకాశం నాయకత్వాన్ని ప్రశంసించారు.

మర్నాడు విద్యార్థులతో కాలేజీ కలకలలాడింది. సాయంత్రం క్రొత్త నోటీసు కట్టించారు ప్రిన్సిపాలుగారు.

బి. ఏ. లో యిద్దర్నీ, ఇంటరులో అయిదుగురు విద్యార్థుల్నీ పరీక్షకు పంపలేదు!

ప్రకాశం ఒళ్లు మండిపోయింది. ఆవేశంతో సరాసరి ప్రిన్సిపాలుగారి గదివైపు నడిచాడు. గదికి తాళం వేసిఉంది. ప్రిన్సిపాలుగారు ఊళ్ళో లేరని గుమస్తా చెప్పాడు.

విద్యార్థి సంఘం కార్యవర్గంలో కల్లోలం బయలుదేరింది. పరీక్షకు పంపని విద్యార్థులు దీనమైన ముఖాలతో ప్రకాశం దగ్గరకు వచ్చారు.

'మీరు పరీక్షకు ఎల్లా వెళ్లరో నే చూస్తా!' గుప్పిళ్లు బిగించి పళ్లు కొరికాడు ప్రకాశం.

'ప్రిన్సిపాలుగారు ఊళ్ళో లేరుగా!' ఒక విద్యార్థి ప్రశ్నించాడు.

'లేకపోతే నేం!'

ఊడలు కొమ్మలు మూడు గజాల కైవారంలో విస్తరించుకుని ఎదురుగా మర్రిచెట్టు చిన్న పర్ణశాలలా కనిపించింది ప్రకాశానికి.

'ఈ మర్రిచెట్టు నిశ్చయించాలి.'

'ఏమిటది?' ప్రక్కనున్న విద్యార్థులు ఆశ్చర్యంతో చూశారు.

ప్రకాశం చెట్టుక్రిందకు పోయి కూర్చున్నాడు.

'నిరశనవ్రతం పట్టానని ప్రకటించండి!'

విద్యార్థులు తెల్లబోయారు.

'తొందరపడకూడదు ప్రకాశం!' ఒక విద్యార్థి సలహా యిచ్చాడు.

'ఆలోచించాను అన్నీ' ప్రకాశం కళ్ళల్లోంచి నిప్పులు కక్కుతున్నట్లు కనిపించాడు. విద్యార్థిలోకం ఉద్వేగంతో కంపించిపోయింది.

వారం గడిచింది. ప్రకాశం బాగా నీరసించాడు. అవధాని నిరశనవ్రతం మానమని మందలిస్తూ ఉత్తరం వ్రాశాడు. విద్యార్థుల ఊరేగింపులతో ఊరంతా గందరగోళంగా ఉంది. క్లాసుల్లో పాఠాలు జరగటం లేదు. వాతావరణమంతా అట్టుడికినట్లు ఉడికి పోతూంది.

ప్రిన్సిపాలుగారు ఊరునుంచి యింకా రాలేదు. ఏడవరోజు సాయంత్రం ప్రకాశం నీరసంతో శోషిల్లాడు. డాక్టరు అన్నపూర్ణయ్యగారు చూసి నాడి నీరసంగా ఉంది, ఇరవైనాలు గంటలలో ఏ విషయమూ తేలకపోతే ప్రమాదించగలదని హెచ్చరిక చేశాడు.

మాణిక్యం తల మొత్తుకుని ఏడ్చింది. సాంబు దిగాలుపడి విద్యార్థులలో కలిసి తిరుగుతున్నాడు.

ప్రకాశం పరిస్థితి ప్రమాదకరంగా ఉందని విని ప్రిన్సిపాలుగారు ఊరినించి పరుగెత్తుకు వచ్చారు. శోషిల్లిపడిఉన్న ప్రకాశాన్ని విద్యార్థులు చోద్యంగా చూస్తున్నారు. వాళ్ళను తప్పించుకుని ప్రకాశం దగ్గరకువెళ్లి కూర్చున్నారు ప్రిన్సిపాలుగారు!

'మిస్టర్! ప్రకాశం!'

కళ్లు తెరిచి నీరసంగా చూశాడు ప్రకాశం.

'నే ఊళ్లో లేకపోయాను. ఇంతలో ఇంత గొడవా?'

ప్రకాశం మౌనం వహించాడు.

'నామాటవిను, యీనిరశన వ్రతం మానెయ్యి!' తలతిప్పాడు ప్రకాశం వీలులేదన్నట్లు.

'నేను వాగ్దానమిస్తున్నా! అందరినీ పరీక్షలకు పంపిస్తాను'

'నోటిమాట కాదు. వ్రాసియివ్వండి!'

ప్రిన్సిపాలు కౌగిలింమీద తక్షణం ప్రాపి యిచ్చారు.

'ఇది తప్పితే!' నూతిలో గొంతులా విన పడింది, ప్రకాశంమాట.

'నేను పెద్దవాణ్ణి! నామాట నమ్మవా!' ప్రిన్సిపాలుగారు బాధపడ్డారు.

ప్రకాశం లేచికూర్చోడానికి ప్రయత్నించాడు. ప్రిన్సిపాలుగారు అతన్ని పట్టకుని కూర్చోపెట్టారు. గుమాస్తా బత్తాయి రసం తెచ్చాడు. ప్రకాశం త్రాగాడు.

విద్యార్థులముఖాలు ఆనందంతో వికసించాయి. తమ కలవాకైన నినాదాలు మారుమ్రోగించారు. ప్రిన్సిపాలుగారు ప్రకాశాన్ని తమ కారులో అతని యింట్లో దిగబెట్టారు. విద్యార్థులంతా పరీక్షకు పంపబడ్డారు.

ప్రకాశం చేసిన యీ వింత సాహసం పుర ప్రముఖుల మన్ననలు పొందింది మునుపు, గాలివాన అలజడిలో కలిగిన పరిచయం పురస్కరించుకుని, మ్యునిసిపల్ ఛైర్మను, వకీలు వీన, వైకుంఠరావుగారు ప్రకాశానికి అభినందనాలు పంపించారు. మాణిక్యం గుండె దిటవుపడింది. రామలింగశర్మ, సాంబు 'ప్రకాశం వీరుడు!' అన్నట్లు చూసేరు.

అన్నపూర్ణయ్యగారి చికిత్సతో, తల్లి ఆదరంలో ప్రకాశం పదిహేను రోజుల్లో మామూలు మనిషి అయ్యేడు. కాలేజీ వార్షికోత్సవాలు వచ్చాయి. ఉపన్యాస పోటీలలో, నాటకాలలో, వ్యాసరచనలో, పద్యాలు వ్రాయడంలో బహుమతులు సంపాదించుకున్నాడు.

ఉత్సవాలు ఆఖరిరోజు రాత్రి వెండి కప్పులు, బహుమతులు పట్టుకుని యింటికి వచ్చిన ప్రకాశాన్ని చూసి పరంధామయ్య కళ్ళలో నిప్పులు పోసుకున్నాడు. ప్రిన్సిపాలుగారిని అనవసరంగా పొగిడి ఆయన దయతో యిన్ని బహుమానాలు పొందాడని లోను యాగీచేశాడు.

పరంధామయ్య సుబ్బమ్మ సోమయాజులు ఒకరోజు గుసగుసలాడుకున్నారు. అవధానికి ఒక ఉత్తరం వచ్చింది. 'ప్రకాశం నాటకాల్లో, రాజకీయాల్లో పాల్గొంటున్నాడు. ఈఏడు బి. ఏ. ప్యాసయే సూచనలేమీ కనిపించటంలేదు. మీరు వ్యయం చేసే సొమ్ము అంతా వృథా' అని. ఉత్తరం నాల్గువైపులా చూశాడు. పంపినవాడు ఒక శ్రేయోభిలాషి. 'ఆకాశరామన్న! ఫస్టున నవ్వుకున్నాడు అవధాని. ఇందులో కొంతైనా నిజము ఉండకపోదని అభిప్రాయపడినా, 'ఎవరి ఖర్మ వారిది!' అనే సిద్ధాంతంలో పడి అవధాని ఆ ఉత్తరాన్ని లెక్క చెయ్యలేదు.

బి. ఏ. పరీక్షలు కాగానే ప్రకాశం గడ్డం పెంచాడు. వయసులో ఉండి పెండి కావలసిన కుర్రాడు సన్యాసిలా గడ్డం పెంచడంలో ఏదో రహస్యం ఉండితీరాలని సోమయాజులు పరిశోధన చేశాడు. కనుక్కున్నాడు చివరికి.

'పరీక్షలు ఎల్లా వ్రాశావు.'

'ఏదో రాశేను!'

'ఈ ఏడు గట్టెక్కుతావా?'

'చెప్పలేను'

ఇంతకన్న మరో రహస్యమేముంటుంది! సోమయాజులు తీర్మానించుకున్నాడు—'బి. ఏ.లో ప్రకాశం ఫేలవటం ఖాయము'ని.

ప్రపంచ పరిస్థితులు అర్థంచేసుకుంటున్న కొద్దీ ప్రకాశానికి వైరాగ్యద్ధృక్పథం ప్రబలిపోతోంది. ప్రతిచోట మోసం-స్వలాభం-అవినీతి-అసూయ- తాండవం చేస్తున్నాయి. ఇన్నిటిలో పడి కొట్టుకుంటూ కొందరు ఏదో బాగుపడుతున్నామనుకున్నంతలోనే హఠాత్తుగా అన్నీ వదిలి మాయమైపోతున్నారు. బ్రతుకులోని పరమార్థం ఏదో ప్రకాశానికి బోధపడటం లేదు. అన్నీ విసర్జించి సన్యాసుల్లో కలిసిపోయి దైవ చింతనతో జీవితం గడుపుదామా అని ఆలోచనలు అతనిలో మెదలుతున్నాయి.

తనమీద ఆధారపడే కుటుంబం గుర్తుకు వచ్చినప్పుడు సంసార బాధ్యతలు తీరాకనే సన్యాసం తీసుకోవటం మంచిది అనే పునరాలోచన కూడా వచ్చేది.

అవధాని సెలవుమీద కాకినాడ చ్చాడు. ప్రకాశం పరీక్ష ఫలితాలు తెలిశాయి. ఫస్టు క్లాసులో ప్యాసయ్యేడు. అవధాని చాలా సంతోషించాడు.

ఆ సంతోష సమయంలోనే ప్రకాశం సంపాదించిన బహుమతులన్నీ ఎదురుగా పేర్చాడు సాంబు. అవధాని ఎంతో ప్రశంసిస్తాడని ఆశతో చూశాడు ప్రకాశం.

'బాగున్నాయి!!' ఒక్క ముక్కతో అవధాని తేల్చేసి తీవ్ర వదనం దాల్చాడు.

'కాలేజీలో తెచ్చుకున్న బహుమతులు చూస్తూ సంతోషిస్తే జీవితం గడవదు. ఉద్యోగం సంపాదించుకుని ఆర్థికంగా బాగుపడ కల్గితేనే, తరవాత ఏకళైనా రాణిస్తుంది. ఏదైనా త్వరగా ఉద్యోగం చూసుకోడం మంచిది!'

అవధాని కటువుమాటలు ప్రకాశం హృదయాన్ని దూసుకుపోయాయి. బహుశా కుటుంబాన్ని చాలా కాలంనుంచి పోషించటంవల్ల నెత్తిమీద బరువు తగ్గించుకుందామనే ఉద్దేశ్యంతో అవధాని అని ఉంటాడని ప్రకాశం భావించాడు. అతడి ఆత్మగౌరవం, స్వశక్తి, అవమానించబడినట్లు బాధపడ్డాడు. తక్షణం ఉద్యోగం సంపాదించుకుంటే గాని యింట్లో ఉండడము అనవసరమనే నిశ్చయానికి వచ్చాడు.

తనకు చదువు పూరికాగానే సునాయాసంగా అవధాని టీ కంపెనీలో ఒక ఉద్యోగం చూపించగలడని ఆశించాడు ప్రకాశం. కాని అవధాని మాటల్తో అతనికి నిరుత్సాహం, నిరాశ కలిగాయి. అయినా అవధానిమీద ఉద్యోగానికి ఆధారపడడం తెలివితక్కువ అనుకున్నాడు ప్రకాశం.

తెలివి, చురుకు, ఉన్న కుర్రాళ్ళను అతిగా పొగిడితే, ఆనందంలో తమ శక్తిని విస్మరించి బూజు పట్టించగలరని అవధాని నమ్మిక. బహుమతులు పొందినందుకు ప్రకాశాన్ని ఎక్కువగా పొగడదల్చుకోలేదు అతను. శ్రేయోభిలాషిగా అతడి ముందు కర్తవ్యాన్ని సూచించాలని తలచాడు. కొంచెం కరుకుగా అంటే, ప్రకాశం స్వభావం కొంచెం చురుకుగా పనిచేస్తుందని అవధాని గమనించాడు. అందుకే 'ఉద్యోగం త్వరలో చూసుకో' అన్నాడు అవధాని.

తన టీ కంపెనీలో ఉద్యోగం యిప్పిద్దామన్నా, స్వానుభవంవల్ల, అందులో పెద్ద అభివృద్ధి ఉండదని, ప్రకాశానికి తన కంపెనీలో ఉద్యోగం యిప్పించదల్చుకోలేదు అవధాని. యుక్తవయసులో మనిషికి ప్రతీ విషయంలో అనవసరంగా సహాయం చేసేకంటే, ఒంటరిగా స్వానుభవానికి ఒదిలితే యింకా బాగుపడతారని, స్వయంగా ఉద్యోగం సంపాదించుకునే బాధ్యత ప్రకాశంపై నెట్టాడు అవధాని.

ఎన్నో తంటాలుపడి, అరపెజను దండయాత్రలు చేసి, చివరకు ఇంటరు ప్యాసయిన

# ★ ఉదయ కిరణాలు ★

ఆంజనేయమూర్తి ఏదైనా ఉద్యోగం యిప్పించమని ప్రాధేయపడితే, జాలికలిగి అవధాని అతడిని తన కంపెనీ డైరక్టరు దగ్గరకు తీసుకువెళ్లాడు ఒకరోజు. హోదాగా దర్జాగా పెద్ద ఆఫీసులో ఠీవిగా కూర్చున్న డైరక్టరుగారిని చూడగానే ఆంజనేయమూర్తికి చెమటలు పోశాయి.

'అయ్యబాబోయ్! యిటువంటిచోట్ల పనిచెయ్యాలనే!' అనుకున్నాడు.

'నీ పేరేమిటోయ్.'

'ఆంజ... మూర్తి' మాటలు మింగేసి గుటకలు వేశాడు మూర్తి.

'ఏం చదువుకున్నావు?'

భయంలో ఒణికిపోయాడు.

'ఏ వూళ్లో ఉంటున్నావు?'

ముఖంనిండా చెమటలు జేబురుమాలుతో తుడుచుకున్నాడు.

'ఇంటరు ఎప్పుడు ప్యాసయ్యావు.'

'ఊఁ' భయంలో మూర్తి నోరు పెకలలేదు.

అవధానికి ఒళ్లు మండింది ఇంత భయపడే ఆఫీసర్ల ముందు ఉద్యోగం ఏం చేస్తాడని ఆశ్చర్యపోతున్నాడు.

'భయపడతా వెందుకు. సమాధానాలు చెప్పవేవ్?'

భయంలో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మూర్తి అవధాని కోపం మాటలకు మరీ బిగిసిపోయాడు.

డైరక్టరు ఒక పదిహేను నిమిషాలు మూర్తిని పరీక్షించాడు.

మూర్తి భయంతో ఏమీ మాట్లాడకుండా బొమ్మలా కూర్చున్నాడు.

ఇటువంటి మూర్తిని డైరక్టరు దగ్గరకు తీసుకు వచ్చినందుకు అవధాని కించపడ్డాడు.

'సరే వెళ్లు' అవధాని ముఖం చిట్లించాడు.

మూర్తి కంగారుగా లేచి కోటు జోళ్లు తొడుక్కుని బయటికి నడిచాడు భయంతో.

ఆ క్రొత్త వాతావరణం అంతా అదోలా కొత్తగా ఉంది అతడికి. యిటువంటి ఆఫీసుల్లో ఏం పనిఉంటుందో, ఎల్లా పనిచేయాలో అనే ఆలోచనల్లోపడి భయపడ్డాడు మూర్తి.

'ఎవరండీ ఈ కుర్రాడు!' డైరక్టరు నవ్వాడు.

'మావాడే!' అని నోటి చివరదాకా వచ్చిన మాట ఆపుకుని అవధానికూడా నవ్వేశాడు.

ఈ సంఘటన జరిగాక, తన కంపెనీలో ఉద్యోగానికి ఎవరినీ తీసుకువెళ్ళకూడదని అవధాని నిశ్చయించుకున్నాడు.

ప్రకాశం ఆలోచించాడు, ఉద్యోగం తక్షణం ఎలా సంపాదించాలా అని బి. ఏ. పరీక్షలకు కూర్చున్నాక, అనేకచోట్లకు దరఖాస్తులు పెట్టుకున్నాడు. ఏమీ లాభం లేకపోయింది.

'మామయ్యా! మద్రాసు వెడదామనుకుంటున్నాను! ఒక ఏభయి రూపాయిలు ఇస్తే చాలు! ఏదైనా ఉద్యోగం చూసుకుంటాను! ఉద్యోగం చూసుకుంటేగాని యింటికి రాను!!'

అవధాని ప్రకాశం నిశ్చయానికి కంగారుపడ్డాడు. అయినా మద్రాసు నగరంలో ఉద్యోగం సంపాదించటం కొంచెం కష్టమేకాని మనిషికి లోగవకావాలి. మద్రాసు నగరంలోని అనుభవాలు ప్రకాశం తెలివికి వన్నె తీసుకురావచ్చునుకున్నాడు అవధాని.

'సరే!'

మర్నాడు ప్రకాశం బయలుదేరి ఉద్యోగాన్వేషణకు ఒక్కడూ మద్రాసు వెళ్ళిపోయాడు. మాణిక్యం కొడుకుపై బెంగపెట్టుకున్నా, కూడా అవధాని ఊరుకున్నందువల్ల ఏమన లేకపోయింది.

అవధాని దృష్టిలో చామంతి మెలిగింది. సెలవులేక ఆమె పెండ్లికిరాలేదు. పైగా ఆ పరిణయం ఎటువంటి పరిస్థితుల్లో జరిగినది, దాని ఫలితాలు అన్నీ యిక్కడికి రాగానే అవధాని కళ్లకు కట్టాయి. ఈ కుటుంబాల మధ్యనున్న బద్ధవైరం సమసిపోవాలనుకున్నాడు అవధాని.

అవధాని వచ్చేడని చూసికూడా పరంధామయ్య పలకరించలేదు. అన్ని సంగతులు విన్న అవధాని అవకాశంకోసం ఊరుకున్నాడు.

పరంధామయ్య ఒకరాత్రి భోజనమయ్యాక వరండాలో కుర్చీలో కూర్చుని వార్తాపత్రిక చదువుకుంటున్నాడు.

'అన్నయ్యా!' అవధాని పలకరించాడు.

ఉలిక్కిపడ్డాడు పరంధామయ్య.

ముఖం ప్రక్కకు తిప్పుకుని, కూర్చోమన్నాడు.

'పెండ్లి జరిగిపోయాక కూడా ఎందుకు యీ వైరాలు. పైగా ఒకేయింట్లో ఉంటూ యిలా చీలిపోయి బ్రతకడం నాకు నచ్చుటంలేదు'

'సంతోషం, నీసలహాకు'

అన్నగారి కటువు సమాధానానికి అవధాని వచ్చేనవ్వు ఆపుకున్నాడు. పరంధామయ్య కోపం తగ్గించాలనుకున్నాడు.

'చామంతిబాగా ఎదిగాక చూడడం యిదే మొదటిసారి. ఇంత చక్కటిపిల్లని వాడు ఎందుకు పెళ్ళిచేసుకోలేదా అని నా బాధ!'

'నీకూ యిష్టంలేదుగా!'

'నాకు యిష్టంలేక కాదు. చేసుకోనంటున్నవాడిని బలవంతపెట్టడం నాకిష్టం లేకపోయింది!'

పరంధామయ్య తమ్ముడివైపు సంతృప్తితో చూశాడు.

'జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఇంక ఈ వైరం మానుకోండి!'

'వాళ్ళగొడవ నాకనవసరం!'

ఇంక అవధాని ఆప్రసంగం పొడిగించడం అనవసరమనుకున్నాడు.

'వదినె, పిల్లలు, కులాసా?'

'ఆఁ'

'చామంతిని యింకా కాపరానికి పంపలేదా?'

'యం. బి. బి. యస్. ప్యాసయితేగాని అల్లుడు పునస్సంధానం చేసుకోనన్నాడు!'

'పోనీలే! ఎప్పుడో భార్యాభర్తలు సుఖంగా ఉంటే అంతే కావలసింది మనకి!'

ఎదురుగా ఉన్న తమ్ముడికి ఏమైనా ఫలహారం పెట్టి మర్యాద చెయ్యాలనుకుని 'చామంతీ! కొంచెం బత్తాయిలు తెచ్చి పెట్టమ్మా!' అని కేకవేశాడు పరంధామయ్య.

చామంతి వళ్లెం వలిచి అతని ముందు పెట్టింది.

చాలా అందంగా ఉన్న చామంతి ముఖంలో అసంతృప్తి, విషాదరేఖలు గోచరించాయి. ఆమె తలదించుకుని లోనికి వెళ్లిపోయింది.

'పోనీ! పూబంతిని పొంబుకిచ్చి పెళ్లి చేద్దాం' యథాలాపంగా అన్నాడు అవధాని. ఈ సంబంధంవల్లనైనా యీ కుటుంబాల వైరం నశించగలదని అవధాని ఆశించాడు.

'నా కిష్టంలేదు!' పరంధామయ్య కసిరాడు.

అవధాని మౌనంగా ఊరుకున్నాడు ఒక క్షణం. బత్తాయిలు తినడం పూర్తయింది.

'రేపు నే వెళ్ళిపోతున్నా.'

'మంచిది'

అవధాని తిరిగి బెంగుళూరు వెళ్ళిపోయాడు.

[ఇంకా వుంది

## నాటిక:

# జేబువాచీ

[నాలుగయిదురకాల కలగలుపు వాద్యసంగీతం. గడియారం ఒంటిగంట కొడుతుంది. మళ్లీ ఒక్క క్షణం వాద్యసంగీతం. గొంతు సర్దుకొన్న ధ్వని]

గోడగడియారం:

మిత్రులారా! మన యీ దైనిక రాత్రిసమావేశాలకి ప్రతిదినం నేనే అధ్యక్షత వహించడం బాగుండటం లేదు. అందుచేత నేను చెప్పేదేమిటంటే, ఈనాటి మన సమావేశానికి చేతివాచీగారో, మనీపర్సు మహాశయులో, పార్కరు ఫౌంటెన్ పెన్నుగారో, రవ్వల ఉంగరంగారో, వెండి సిగరెట్టు పెట్టెగారో, కొత్తగా మనతో చేరిన రేడియో రిసీవరుగారో ఎవరో ఒకరు అధ్యక్షత వహించడం బాగుంటుందని. ఏమంటారు పార్కరుకలంగారు?

పార్కరుఫౌంటెన్ పెన్ను:

మీరు నన్ను నా అభిప్రాయం చెప్పవలసినదిగా కోరి గౌరవించినందుకు ఎంతైనా కృతజ్ఞుణ్ణి. అయితే ఈ అంశంలో నా అభిప్రాయం ఏమిటంటే, మన యీ నిశాసమావేశాలు ప్రతిరాత్రీ ఇంత చక్కగా, నియమబద్ధంగా, ఎటువంటిగల్లంతూ లేకుండా జరుగుతున్నాయంటే అందుకు నిజంగా మన గోడగడియారంగారి అత్యంత సమర్థమయిన అధ్యక్షత్వమే కారణమని నా నమ్మకం. వారు అన్ని అతి చౌకగా ఉండే కృతయుగంలో కొనబడడంచేత విలువలో మనకంటె తక్కువేమోనని మనలో కొందరికి దుర్భ్రమ ఉండవచ్చును కాని, నిజానికి వారి వయస్సులోని అధిక్యమే కాదు, విజ్ఞానంలోని ఘనతవల్లనే వారిని మనసభలకు అధ్యక్షులుగా ఉండవలసిందని కోరడం అనునిత్యమూ జరుగుతూ వచ్చింది. ఈ విషయంలో మన సభ్యుల్లో ఎవ్వరికీ అభిప్రాయభేదాలు లేవనే నమ్ముతున్నాను.

అందరూ కలిసి: లేవు లేవు, ఎటువంటి భేదాభిప్రాయాలూ లేవు.

పార్కర్ ఫౌంటెన్ పెన్ను:

ఈ అంశంలో కూడా మనందరికీ ఏకవాక్యత కుదిరినందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. (గొంతుసర్దుకొని) అయితే ఇప్పుడు నేను సభవారి ఆమోదంతో ఒక కొత్త సూచన చేస్తున్నాను. మన యీ సమావేశాలు ప్రారంభం కావడమే తరుచు ఆలస్యం అవుతూంది; అయినా అది మన చేతిలోని పని కాదు. కొందరు కొందరు సభికులు తిరిగి వచ్చేసరికి చాలా ఆలస్యం అవుతూంది. ఇదంతా చాలనట్టు, మన అధ్యక్షులవారి ఎన్నిక అనే కార్యక్రమంతో కొంత సమయం వృథా కావడం నాకిష్టం లేదు. కాబట్టి ఇకమీదట మన యీ సమావేశాలకి, ప్రతిదినం వేరే ఎన్నిక అవసరం లేకుండా అన్నివిషయాల్లోనూ పెద్దలయి, ఉన్నచోటునుండి కదలకుండా నే సుమారు ఈ అరశతాబ్దం కాలంలోనూ అపారంగా అనుభవం ఆర్జించినటువంటి శ్రీశ్రీ గోడగడియారంగారే అధ్యక్షులుగా ఉంటారు.

పంతుల శ్రీరామశాస్త్రి

ఎప్పుడయినా వారికి అస్వస్థతగా ఉంటే, వారి అనుమతిమీద ఇంకొకరు తాత్కాలికంగా అధ్యక్షత వహిస్తారు. ఈ అంశంలో సభికులు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తే మరి ఆలస్యం లేకుండా నేటి కార్యక్రమం ఆరంభమవుతుంది.

అందరూ కలిసి: అందరికీ అంగీకారమే. గోడగడియారంగారే మనకు శాశ్వతాధ్యక్షులు! గోడగడియారంగారికీ జెయ్!

గోడగడియారం:

(కంచుమని గంట మ్రోగించి) మిత్రులారా! ఈ శాశ్వతాధ్యక్షపదవి అనే మహత్తర గౌరవం ఆపాదించినందులకు మీకు ఎంతయినా కృతజ్ఞుణ్ణి; ఈ మన సమావేశాలను సక్రమంగా జరపడానికి ఇతోధికంగా పరిశ్రమించకలనని వాగ్దానం చేస్తున్నాను. శ్రీ పార్కర్ ఫౌంటెన్ పెన్నుగారు నా గురించి చెప్పినదంతా యథార్థమే; అయితే ఒక్క విషయంలో మరికొంత విపులీకరించవలసిన బాధ్యత నాయందు ఉంది. మొదట ఈ యింటిలో నేను ప్రవేశించేసరికి, ఈ మేడ ఉన్న ప్రదేశమంతా ఖాళీస్థలంగా ఉండేది. ఒక మూలను ఒక పూరిసాల, అందులో ఒక చిన్న మిల్లు ఉండేది.

(కొన్ని గొంతులు) అప్పటికి మేము పుట్టే ఉండము.

నేను అప్పుడు, ప్రస్తుతం, బస్తాలు పెట్టుకొందికి ఉపయోగించే చీకటి కోణంగా ఉండే ఆ గదిలో తూర్పుగోడను ఉండేవాణ్ణి. అప్పుడు ఆ గదికూడా కొంతగా అలంకరించబడి ఉండేది; అయితే అప్పటి ఆ అలంకరణపద్ధతి మీకు చాలా వింతగా మోటుగా కనిపిస్తుందనుకొండి. ఆ తరవాత పదేళ్ళకి ఈ మేడ కట్టించడం జరిగింది. అక్కడి పాత సామగ్రి అంతటిలోనూ ఈ భవనానికి రావడానికి తగినట్లుగా ఎన్నిక చేయబడ్డవాణ్ని నే నొక్కణ్ణే అన్నది ఎంతటి వినయవంతులకయినా కొంత గర్వకారణం కాకపోదు.

అందరూ: నిజం! నిజం. చాలా ఘనమయిన విషయం, కాబట్టే మాకు మీ సలహాలు, సాహచర్య భాగ్యం లభించింద.

గోడగడియారం:

మిత్రులారా! మరి ఆలస్యం దేనికి? మీలో ఎవరయినా అధ్యక్షులుగా ఉండి ఉంటే నేనే నా గతచరిత్రలోనుండి కొన్ని రసవద్ఘట్టాలు వినిపించాలనుకొన్నాను.

రవ్వల ఉంగరం:

అధ్యక్షులవారు తమ అనుభవాలు చెప్పకూడదనే నియమం లేదే.

గోడగడియారం:

రవ్వల ఉంగరంగారి అభిప్రాయాన్ని నేను కాదనడం లేదు. కాని, ఒక్కొక్కనాడు ముగ్గురు నలుగురం పోటీపడినట్లుగా తొందర తొందరగా తమ తమ అనుభవాలను చెప్పకు రావడమూ, కాగా కొందరికి తగినంత వ్యవధి దొరకకపోవడమూ, మరి కొన్ని రోజుల్లో ఎవరికీ తగినంత చెప్పదగిన విషయం అంటూ లేకుండా సమావేశం నీరసంగా ఉండడమూ మీరూ గమనించే ఉంటారు.

అందరూ: నిజమే నిజమే, ఒక్కొక్కనాడు సభ మరీ రసహీనంగా ఉంటుంది.

గోడగడియారం:

(గంట) అవే, ఒక్కొక్కనాడు చాలా

★ # జేబువాచీ ★

ముఖ్యమయిన నీతిదాయకమయిన అంశాలు తొందర తొందరగా సభ్యులందరూ సరిగా వినకుండానే అయిపోతున్నాయి. కాబట్టి ఇకనుండి, అంటే రేపటినుండికాదు, నేటినుండే, మన పద్ధతి ఏమిటంటే, రోజుకి ఒక్కరే ప్రధాన వక్త ఉంటారు. వారి ఉపన్యాసాంతరం, అవసరమనితోస్తే, ఉపన్యాసంలోని వివిధాంశాలమీద చర్చ జరుగుతుంది; ఆ సమయంలో నే ఒకరోజు కార్యక్రమానికి సరిపడినవీ అయినా విజ్ఞానప్రదమయినవీ అయిన చిన్న చిన్న విషయాలను కూడా అధ్యక్షుని ఆమోదంతో వివరించవచ్చును. అయితే ఈ రోజు కొకరు అనే పద్ధతిలో ఒక్కొక్కప్పుడు కొన్ని కొన్ని మంచిసంగతులు ఒకటి రెండు రోజులు ఆగవలసివస్తే వస్తుంది. కాని ఇంచుమించుగా అందరికీ సరియయిన సావకాశాలు లభిస్తాయనే నా నమ్మకము. సభ్యులు తాము చెప్పబోయే అంశాలగురించి సమావేశానికి ముందుగా నాతో సంప్రదించవచ్చును నేను శక్తివంచన లేకుండా కంతులు ఏర్పాటు చెయ్యడానికి ప్రయత్నిస్తాను. ఈ ఏర్పాటు మీ అందరికీ యిష్టమనే నమ్ముతున్నాను. ఇష్టంలేనివాళ్లు నిర్మొహమాటంగా చేతు లెత్తవచ్చును...ఎవ్వరూ లేరన్నమాట? సరే, ఈ రోజు కార్యక్రమానికి ముందుగా ఏర్పాటుచేసుకో లేదు కాబట్టి ప్రసంగించదలచినవాడు మామూలుచొప్పున నిలబడితే ఎవరు ముందో ఎవరు వెనకో నిర్ణయిస్తాను. ఏమిటిది? చిత్రంగా ఉందే, ఎవరూ లేరా?

పార్కర్ ఫౌంటెన్ పెన్ను:

లేవండి, జేబువాచీగారున్నారండి ఆయన కాలుకి నిన్నరాత్రి కాస్త జెణుకు పట్టడంవల్ల సరిగా నిలబడలేకపోతున్నారు.

గోడ గడియారం:

జేబువాచీగారు వస్తున్నారని నమ్ముతున్నాను. ఇన్నాళ్లకు వారు తమ అనుభవాలు చెప్పడానికి ముందుకు వచ్చినందుకు బ్రహ్మానందంగా ఉంది. ఈ యింటికి రావడం అయితే నాకంటె కొంచెం వెనకయినా అసలు వయసులో నాకంటె వారే పెద్ద. ప్రస్తుతపు యాజమాని గారి తండ్రిగారికి వారు బహుమతి గా ప్రసాదించబడినవారు. నేటికయినా వారి శరీర దార్ఢ్యంలో లోపం లేదు, అయితే మన యజమానిగారికి చాలావిషయాల్లో మామూలయిన అశ్రద్ధమూలంగా వీరికి అప్పుడప్పుడు కదలికకి లోపం వస్తుంది. కొంతకాలం, మీ రెవ్వరూ ఇక్కడికి రాకమునుపు మే మిద్దరమే, ఒకరికొకరము తోడుగా అహర్నిశలు కాలక్షేపం చేసేవారము. వారిగురించి మరి అధికంగా చెప్పనక్కరలేదు. వారు జగమెరిగిన బ్రాహ్మణుడు. వారిని, వారి స్థానంలో నుండే, అది విశ్రాంతిగా కూర్చొనే వారి అనుభవవిశేషాలు తెలియజేయవలసిందని సభవారి తరఫున కోరుతున్నాను.

జేబు వాచీ:

మీరందరూ నాయెడల చూపిన ఆదరాభిమానాలకు ఎలా కృతజ్ఞత చెప్పుకోవాలో నాకు తెలియడంలేదు. అయితే అసలు నేను చెప్పదలచిన విషయానికి వస్తాను. నేనేమో చెప్తానని లేచేసరికి, ఏ తాతల నాటి సంగతులో తవ్వి తీస్తానను కొని ఉంటారు మీరు. అందులో ఏమీ పొరపాటు లేదు. ఏమంటే, నావంటి వయోవృద్ధుడికి, అంతా గత చరిత్రేగాని, వర్తమాన జీవితం అంటూ ఉండదు. అసలే నాది చత్వారపు దృష్టి; పానీ ఆమాత్రంగానయినా చూడ్డానికి వీలులేకుండా ఇటీవల నన్ను కోటు జేబులో పడేశాడు యాజమాని; గోడనున్న మేకు ఊడిపోతే మరొకటి కొట్టడానికి కూడా బద్ధకమే. సరే మన యిష్టాయిష్టాలతో మనుష్యుల కేమిటి సంబంధం. అయితే, ఇటువంటి కదలిక లేని, చూడడానికి వీలులేని, వర్తమానమే లేని నావంటివాడు కూడా, ఎప్పుడో కాదు, నిన్నంటే నిన్ననే జరిగిన విశేషాలు చెప్పగలగడం విశేషమే—ఇక, మరొక్కమాట. వార్ధక్యం మూలాన, నా గొంతుకి అసలే బలంలేదు. అందుకు తోడు నిన్న రాత్రి సంభవించిన అలజడితోనూ రాపు పోటులతోనూ మరీహీనస్వరమయిపోయింది. ఇటువంటి పరిస్థితిలో నేనే అంతా చెప్పడం అంటే నాకూ మీకూ కూడా కష్టమే. కాబట్టి కాస్త కొత్తపద్ధతి అయినా మీ కందరికీ ఆమోదం కాకపోదనే నమ్మకంతో నిన్నరాత్రి తొమ్మిదిగంటల మొదలు, ఉదయం ఏడుగంటలవరకూ జరిగిన సంగతులను శ్రవ్యనాటక రూపంలో ప్రదర్శింపించదలచుకొన్న సంగతి మీలో కొందరికి తెలిసినదే. కాని, ప్రాతికూలాదికం మనవారికి కొత్తకావడంచేత, కొన్ని లోటుపాట్లుండక పోవు. అయినా మీరంతా సావధానంగా విని, భవిష్యదభివృద్ధికి దోహదప్రాయమయిన విమర్శన చేస్తారని ఆశిస్తున్నాను.

* * *

[గడియారం తొమ్మిది గంటలు కొడుతుంది. తలుపు కిరకిరమన్న ధ్వని.]

ఆడగొంతు: ఎవరురా అది?

కుర్రవాడి గొంతు: నేనేనమ్మా! టైమెంతయిందో చూస్తున్నాను.

ఆడ గొంతు: ఇప్పుడిప్పుడే తొమ్మిది గంటలు కొట్టింది విన లేదురా?

కు. గొం: ఏమోనమ్మా, గడియారం పాతబడిపోయింది. తిరగడం తిన్నగానే తిరుగుతుందిగాని, గంటలుమాత్రం దానిష్టం వచ్చినట్లు కొడుతూంది.

ఆ. గొం: సర్లే, ఎంతయినా ఒక అయిదు పది నిమిషాలకంటె భేదం ఉండదు. అయినా ఇప్పుడే టైముకేం తొందర వచ్చింది. ఇప్పటినుంచి పడుకోవాలంటావా?

ఏడాదంతా ఎలాగూ లేదు, పరీక్షల ముందయినా తిన్నగా చదవకపోతే ఎలాగరా?

పె. గొం: చదవకేమమ్మా, ఏడుగంటల నుండి కదలకుండా చదువుతున్నాను. మళ్లీ తెల్లవారుజాము నాలుగుగంటలకల్లా లేస్తాను కదా!

ఆ. గొం: ఉదయం ఏడు గంటలకి లేస్తే తెల్లవారుజామున లేచినట్టే. గడియారం అలారంమూలాన నువ్వెలాగూ లేవవుగాని, ఇంటందరి నిద్దర్లూ పాడవుతున్నాయి. మీ నాన్నగారు రోజూ నన్ను తిడుతున్నారు. నీకు కావాలంటే, ఎన్ని గంటలకంటే అన్ని గంటలకి లేపుతాను. ఆ అలారం మాత్రం పెట్టకు.

కు. గొం: అలాగేనమ్మా. సరిగా నాలుగు గంటలకి లేపుతే చాలును. లెక్కలు చేసుకోవాలి. ఇప్పు డెక్కువగా మేలుకొంటే అప్పుడు మరి లేవలేను.

* * *

నోటిలో వేలుపెట్టి ఊళ ఊదినధ్వని, మూడుమార్లు వినిపిస్తుంది. ఇందాకటి కుర్రవాడు ఇంకొక కుర్రవాడు మాట్లాడుతూ ఉంటారు.

1. ఏమిరా అంతలాగోలెత్తించేసేవు. మారామస్వామిగాని మాఅమ్మగాని లేస్తే మరి నేను రావడానికి అవుతుందా?

2. నీమొహం. వాళ్లు లేస్తేమటుకు నేను కనిపిస్తానా? అయినా తొమ్మిదింపావుకల్లా తగలడతానన్న ఘటానివి, తొమ్మిదిన్నరకయినా తెమలకపోతే ఏంలాభం? హుఁమరి ఇలా పెళ్లి నడకలు నడిస్తే లాభంలేదు, ఈః పాటికప్పుడే సినీమా మొదులుపెట్టేసి ఉంటారు. కాస్త పరుగందుకో.

1. కొగురా నామాటవిను. అసలివాళ మానాన్నగారింట్లో లేరు.

2: అయితేమరీ మంచిది. అందుకేనా ఇంత ఆలస్యంచేసేవు?

1: ఏం చెయ్యమన్నావు? ఆయనపర్సు జేబులో వేసుకొని వెళ్లిపోయారు. మాఅమ్మ సాయంకాలం ఎవరికో డబ్బులిచ్చి, జాగ్రత్తగా పందుగపెట్టి తాళంవేసుకొంది. మరెక్కడా ఒక్కకాణి అయినా దొరకడం లేదు.

2: ఓరి దద్దమ్మా, అయితే ఇంత ఆలస్యం చేసి, ఇప్పుడు వట్టి చేతుల్తో వచ్చావన్నమాట? కుక్కతోక పట్టుకొని గోదావరీదినట్టు నీమాట నమ్ముకొని నేను కూర్చున్నాను. లేకపోతే నరసింహమో, రణమురావో, జగన్నాధమో ఎవరో ఒకరు ఎగిరిగంతేసి వచ్చిఉండేవారు.

1: అయితే అంతగా వట్టి చేతుల్తో వచ్చాననుకొన్నావేమిటి?

2: భేష్, ఏమిటేమిటి? - హారి, ఇదా? పాతజేబు వాచీ, ఎందుకు పనికివస్తుందిరా?

1: పాతకేగాని చాలా విలువయినదిటరా! మా నాన్నగారు అప్పుడప్పుడు తన స్నేహితులతో గొప్పగా చెప్తూ ఉంటారు, ఇది మా తాతయ్యకి ఎవళ్ళో బహుమతి చేసేరట!

2: తాతలనాటి పాత కబుర్లు కేంలే. ఇవాళకి మరి సినీమా ఆశలేదు. అయితే ఇది సగం సగం కాకుండా పూర్తిగా వదిలించేసుకొందామా?

1: అయ్యబాబో: మా నాన్నగారు చంపెయ్యరూ? రెండు రోజుల్లో ట్యూషను మాష్టారి జీతం ఇస్తారు. అక్కడికి మనం ఈ నెలంతా వెళ్ళలేదు గనక అది దీనికింద సర్దుకోవచ్చును.

2: అబ్బో అయితే పెద్దదే. అయితే ట్యూషను మాష్టరుగారు నువ్వుగాని రాలేదని చెప్పేస్తే?

1: ఆఁ ఎందుకు చెప్తారు? రేపూ ఎల్లుండి వరసగా వెళ్ళి వచ్చే నెలలో రెండు నెలల జీతం కలిపి ఇస్తామన్నారంటాను. ఈలోగా మా అన్నయ్యా, అక్కయ్యా వస్తారు. వాళ్లు వస్తే 'ఎందుకు?' అని అడగకుండా నే రూపాయి రెండూ ఇస్తూఉంటారు.

2: సరేకానీ పద. వెంకటస్వామి కిళ్లీకొట్టు మూసేకుండా - వాడయితేనే ఇటువంటి దానిమీద డబ్బిస్తాడు.

1: వాడికి మనం ఇవ్వవలసిన పాత బకాయి కొంతఉందికదూ?

2: ఉంటే దాని సంగతి దానిదీ దీని సంగతి దీనిదీని. నీకేం భయం లేదు. నేనున్నాను కదూ!

1: ఏమిటోరా; నాకు భయంగాఉంది. వాడుగాని వాచీ దొబ్బేడంటే చచ్చేమన్నమాట. మళ్ళీ రెండు రోజుల్లో ఇది మా నాన్నగారి కోటుజేబులో పడెయ్యకపోతే మన ఆ బోరు దక్కదు. అసలు ఈ రెండు రోజుల్లోనూ ఆయన కీ యిద్దామని దీనికోసం చూడకుండా ఉండాలి.

2: నీలాంటి పిరికిపందకి అన్నీ అనుమానాలే; అందరున్న ఇంటిలో నువ్వొక్కడివే దొంగతనం చేసినట్టు నిర్ధారణ ఏమిటి? నేనే అయితేనా? రోజూ పదిమంది ఫ్రెండ్సుతో జల్సాచేసి ఉందును. మరి నీకంత బితుకయితే భద్రంగా ఇంటిమొగం పట్టు.

1: నీకు మా నాన్నగారి సంగతి తెలీదు. ఆయన ఊరుకొన్నంతసేపు ఊరుకొంటారుగాని, బాగా కోపం వచ్చిందంటే వీపు పగల గొడతారు. వెంకటస్వామి దగ్గరికి కాకుండా మరెక్కడికైనా పట్టుకొని వెళ్ళలేమంటావా?

2: హుఁ సరే పద, ఆ గౌరీశంకర్ కుందు అయ్యర్ని అడిగి చూద్దాము. వాడీసరికి మూసేసి నిద్రపోయుంటాడేమో?

1: భేష్, అది బాగుంది. నిద్రపోయినా లేపుదాము. వాడి దగ్గర మనకేమి బకాయి లేదుకూడాను.

2: పద, లేపు మన రామశర్మగాడు, సుబ్బారావు వెళ్తున్నారు. మనం వాళ్ళ టిక్కెట్టు కొనేదాకా డబ్బులేనట్టు గమ్మత్తు చేసి, వాళ్లు కొన్నకంటె పైక్లాసు టిక్కెట్టు కొని వెళ్లాలి.

1: అలాగే తప్పకుండాను. మొన్న ఎక్స్కర్షన్‌లో ముందు మనదగ్గర డబ్బులయిపోయాయని ఏం డాబు చేశారు వాళ్లు.

* * *

ఇద్దరు మగవాళ్ల గొంతులు: సైకిలు గంట. అరరె. సైకిలుగంట. అరరె.

1: అరరె. ఏమిరా ఇట్ల షేవ్ చేస్తివి? రోడ్డల్లాం కాళీగా ఉండుకున్నది.

2: అందుకేనా గంటకొడుతున్నా సైకిలుకి అడ్డుగా వచ్చావు, పాపం లేవలేవు కాబోలు, కాస్త ఏమైనా బ్రహ్మపదార్థం సేవించలేదుకదా?

1: తలకు మయక్కం ఎక్కిందా ఏమిరా? నన్నుదా డాష్ చేస్తుడు, నన్నే మాటలంటుడు.

2: (కొంచెం తాగినవాడి ధోరణితో) ఒరేయి, నన్నవసరంగా అన్నావంటే చూసుకో. కళ్లుమూసుకొని నడిచి, బెల్లు కొడుతున్నా వినకుండా, అడ్డంగా సైకిలు మీదపడి, పోనీకదా అని లేవదీస్తే నామీద ఏడుస్తావు, తిన్నగా నీదారిని పో, సైకిలు గంట.

1: ఆగు ఆగు ఆగు. దొంగవెధవా, నా మనీపర్సు మనీపర్సు, జేబు వాచీ.

3: (పోలీసుజవాను) ఏమిటయ్యా, రోడ్డు మీద చతికిలపడి అలా అరుస్తావు.

1: దొంగ సార్, ఇప్పుడే, అడుగో, సైకిలుమీద పారిపోతున్నాడు. అయ్యో రామ.

3: అసలు జరిగిన సంగతేమిటో చెప్పవయ్యా నీయేడుపే నీది.

1: ఏమయ్యా దొంగ పారిపోతూఉంటే పట్టుకోవు?


3: నేను పట్టుకోలేదనకపోతే నువ్వే పట్టుకోలేకపోయావు? అసలు ఏంపోయింది? ఎలా పోయింది.

1: ఇంటికి పోతూండాను. మనీపర్సు, అందులో జేబు వాచీకూడా ఉంది. అది కొట్టేసినాడు. సైకిలుమీదవచ్చి తాగి మయిక్కంలో ఉన్నట్టే, సైకిలుతిప్పి డాష్ చేసినాడు. నన్ను లేవదీసినట్టే చేసి, మనీపర్సు పట్టుకొని ఉడాయించినాడు.

3: సైకిలుకి లైటుందా? ఎటువంటి సైకిలో చూసేవా? మనిషి ఎలా ఉన్నాడో, ఎంతవయస్సుంటుందో చెప్పగలవా?

1: అదంతా చీకట్లో నే నెలా చూసేది. ఏమయ్యా, పారిపోతున్నాడు దొంగ అంటే పట్టుకొంటివి కాదు, ఏమి పోలీసులో...

3: ఏమయ్యా, నీ తెలివితక్కువకి నామీద ఏడుస్తావు? దగ్గరున్నప్పుడు సైకిలు పట్టుకొని ఆపలేకపోయావు. దూరాన



పిక్నిక్ పార్టీ ఫొటో: వై. రామకృష్ణారావు—బందరు.

## ★ జేబువాచీ ★

సైకిలుమీద పోతున్నవాణ్ణి నేనెలా పట్టుకొంటాననుకొన్నావు? ముందు పద పోలీసు స్టేషనుకి.

1: ఎందుకు రావాలి మీ. ఎదురుగా దొంగ ఉంటే నీవు పట్టుకోలేకపోతివి. విజిల్ వేసి మరొక పోలీసునయినా పిలవకపోతివి. రిపోర్టిస్తే నేమి నా వస్తువులు నాకు దొరుకునా? పదిసార్లు మీ స్టేషనుచుట్టూ తిరగమందువు. ఇంతే.

3: ఏమయ్యోయి, నీ ధోరణి బాగా ఉందే. అసలు వాడు దొంగో నువ్వు వాడి దగ్గర ఏమయినా కొట్టేసి గమ్మత్తు చేస్తున్నావో? పద పోలీసు స్టేషనుకి, నిన్ను తనిఖీ చెయ్యాలి.

1: చేస్తువు, బాగానే చేస్తువు, ఇదిదా మీకు చేతనయినది. నీ దారిని నీవు వెళ్లుమీ, నీకు పుణ్యం ఉంటును. అంతా పదిహేను రూపాయిలు పోయి నేను ఏడుస్తూ ఉంటే; ఎక్కడకు వచ్చినా దగ్గర మరి ఒక్క కానీ డబ్బుకూడా లేదు.

3: సరే, ఈమారుకి విడిచిపెడుతున్నాను. ఆమాత్రం డబ్బు జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలీదూ?

1: (మెల్లగా) మీకు తెలిసింది ఆ మాట చెప్పడమే.

* * *

ఒక మగగొంతు, ఒక ఆడగొంతు

మ: ఏమిటి తిలకం? ఎందుకింత చిరాగ్గా ఉన్నావివాళ?

ఆ: ఎప్పుడూ ఉన్న చిరాకే. ఖర్చులు ఎంత తగ్గించుకొన్నా అక్కడికీ చాలకుండా ఉంటె.

మ: అందికే నేనంటాను. అసలు ఖర్చులు తగ్గించుకోకుండా ఉంటే సే, వాటికి కావలసిన డబ్బు దానంతటదే వచ్చి పడుతూ ఉంటుందని.

ఆ: ఆఁ రాకేం, డబ్బు వర్షంలా వచ్చి పడుతుంది. నీలాగ పగలు బుర్రలు మార్చి, రాత్రి బుర్రలు కొట్టేవాడికి డబ్బు లక్ష్యం ఏముంది? అయితే అన్యాయపు డబ్బు అది ఎలా వచ్చిందో అలాగే పోతూ ఉంటుంది. ఇవాళ వంద రూపాయిలుంటుంది. రేపు కాఫీకి కూడా డబ్బులుండవు.

మ: నీలో అన్ని గుణాలూ మంచివే, గాని డబ్బంటే మాత్రం ఎందుకింత కాఫీనమో నాకు తెలియకుండా ఉంది. వెధవ డబ్బు వస్తుంది, పోతుంది. మనం డబ్బుని గణించామా, మనల్ని డబ్బు గణించిందా?

ఆ: కబుర్లకేమి, ఎన్నయినా చెప్పవచ్చును. నీదగ్గర డబ్బున్నవాడు నేను కనబడను. ఎప్పుడు జేబులో డబ్బులు లేక, ఆ పూట తిండికి కూడా అభాసవస్తే అప్పుడు జ్ఞాపకం వస్తుందీ తిలకం! ఆవేళ ఇంటి అద్దె కోసం దాచిఉంచేసిన పాతిక రూపాయిలూ పట్టుకుపోయావు. పాతి కేమిటి, రెండువందలిస్తానన్నావు. నీ రెండువందల మాటా దేముడెరుగు. ఆ పాతికా లేక ఎంత ఇబ్బందయిపోతూందో నీకేం తెలుసు? ఇంటి అద్దెకోసం ఆ ముసలమ్మ రోజూ వచ్చి నానాగల్లంతూ చేస్తున్నది.

మ: అరరె, నువ్వంతగా డబ్బుకి ఇబ్బంది పడుతున్నావని తెలిస్తే ఒక వందయినా తెచ్చిపడేసి ఉండేవాణ్ణి. నిన్న రాత్రి వెళ్లిడమే మో, పూర్తిగా పాతిక కూడా లేకుండా వెళ్లేను. మొత్తం అంతా నాలుగు వందల వరకూ వచ్చింది. అయితే కొసకి, వెధవలందరూ కలిసి దొంగ ఆట ఆడడంవల్ల పోయిందిగాని; వెధవ డబ్బు పోతేపోయింది గాని, ఒక్కొక్కడికి జన్మలో మరిచిపోలేనట్టు, ముక్కలు విరగదిన్నాను, అయితే దొంగ వెధవలు ముందే డబ్బు బైటికి దాటించేసేరు.

ఆ: ఏదయితే నేం, నాకు తెలియదూ నీ సంగతి, నీ జేబులో అసలు ఒక్క పది రూపాయిలనోటు ఉన్నా నేను జ్ఞాపకం రానని. నే నెప్పుడూ నీమీద ఆశ పెట్టుకోలేదు. ఇవాళ ఆ గౌరీశంకర్ విలాస్ అయ్యరు రావలసిన రోజు. వారానికి ఒక రోజు వస్తాడు, ఆరోజు అమ్మకమంతా చిల్లరతో సహా తెచ్చియిస్తాడు పాపం.

మ: హుఁ నీకు ఆ గుండుగాడిమీద ఉన్న పాటి అభిమానం కూడా నామీద లేకుండా పోయింది.

ఆ: అదికాదు రంగా! నీకు తెలియదు నా స్థితి ఎలా ఉందో. చిల్లరబాకీలు ఎన్నో ఉన్నాయి. అతను వచ్చి ఇక పదో పన్నెండో ఇచ్చేడంటే ఈ రాత్రికి నిద్ర పడుతుంది. రేపు కొన్నికొన్ని పీడలను వదిలించుకోవచ్చును.

మ: ఏమోన్లే, నీమాటలు వింటూంటే నీకు వాడిచ్చే అయిదూ పదీ మీదకంటె ఆ

గుండు అయ్యారుగారిమీదే ప్రేమలాగున్న ట్టుంది. పాపం, అయ్యారుగారికోసం, విరహంలో వేగిపోతున్నావన్నమాట.

ఆ: నీ కెలా అనుకోవాలంటే అలా అనుకో. నిజంగా నువ్వు తల్చుకుంటే నన్ను ఏ ఇబ్బందులూ లేకుండా పోషించ లేవూ? ఉహుఁ, నీకు అటువంటి పెద్దమనిషి తరహా కోరిక ఏమయినా ఉంటేకదూ? ఇప్పుడు ఆ అయ్యారు వచ్చే వేళకూడా బాగా దాటిపోయింది.

మ: నువ్వు వాడిమీద విరహంలో మూర్ఛపోయినా సరే, వాడివాళ రాడు, రాలేడు.

ఆ: నీ కెలా తెలుసును?

మ: ఎలా తెలుసు నేమిటి? పాపం వాడే గాభరాగా అటూ ఇటూ తిరిగి, సైకిలుకి డెష్ అయి, కిందపడి ఏడుస్తూ ఉంటే...

ఆ: అయితే మరి ఇవాళ కింతే. రేపు చిల్లరబాకీలవాళ్లు మొగం చూసేకంటే రాత్రికి రాత్రి ఎక్కడికయినా పారిపోతే బాగుండు ననిపిస్తోంది.

మ: అయితే పద. నేనునీకి ఒక్కటే వూ నెళ్ళలేవు కాబోలు. సైకిలుమీద తీసుకొని వెళ్తాను.

ఆ: నీకంత నవ్వులాటలుగా ఉంది. ఇక్కడ నుండి మరెక్కడికీ వెళ్ళేదిలేదు; వెళ్తే పిరట్లోని నూతిలోకే.

మ: వెధవ గుండుగాడు రాలేదనే అంత సాహసానికి ఒడికడతావా? నీకు వాడు మనిషే కావాలంటే నేనేమీ చెయ్యలేను గాని, వాడి పర్సు కావాలంటే మాత్రం కొంచెం సాయపడగలను. ఇది చూడు. నీకు బాగా ఆనవాలే ననుకొంటాను.

ఆ: నిజమే. ఇది అతనిదే. ఈమూలను కుట్టు, ఈ ఊడిన గుండీ. ఇది నీ కెలా వచ్చింది? అతని కేమయింది? బాగా దెబ్బలు తగల్లేదుకదా?

మ: చెప్పాను కాదూ, నీకు పర్సుమీద కంటె మనిషిమీదే ప్రేమ ఎక్కువయిందని.

ఆ: రంగా, నీకు నిజంగా నన్ను గురించిన ఈర్ష్య ఉంటే ఎంత బాగుండును? నీకు అంతా తమాషాగానే ఉంటుంది కాని అసలు సంగతేమిటి?

మ: ఏమీ లేదు. నేను ఏమి చెయ్యడానికీ తోచక, అటూ ఇటూ తిరుగుతున్నాను. వాడు అట్నునించి వస్తున్నాడు. నీదగ్గరకేనని నాకంతా జ్ఞాపకం వచ్చింది. సైకిలు అటూ ఇటూ తిప్పేసరికి గాభరాపడి చతికిలబడిపోయేడు. లేవనెత్తి అప్రయత్నంగా చేతికి చిక్కిన ఇది పట్టుకొని దౌడు తీసేను. నీకు మామూలుగా వాడి పర్సు రావడం, నాకక్కడ వాడి కంపు లేకపోవడం—ఒక్క దెబ్బకి రెండుపిట్టలు. కాని, వెధవపర్సు బరువుగాఉంటే ఎంతఉందో, ఏమిటో అనుకున్నాను. అంతా ఏడు రూపాయిల పదకొండణాలు. ఈ వెధవ బొక్కి జేబువాచీ ఎక్కడ దొరికిందో? అక్కడే కాలవలోకి విసిరెయ్యాలనుకున్నాను.

ఆ: ఎందుకు పారెయ్యడం? అత నెంత ఇష్టపడి దాచుకున్నాడో? లేకపోయినా ఎవళ్ళయినా పిల్లలకి ఆడుకోందికి పనికి వస్తుంది.

మ: అంత ఆడుకొనే పిల్లలే లేరుగాని మనకి.

ఆ: పోనీ మా పనిమనిషి పిల్లలయినా ఆడుకోందికి పనికివస్తుంది.

మ: ఇప్పటికయినా అయ్యారుగారిని గూర్చిన విరహం తగ్గిందా?

ఆ: పర్సు తెచ్చావుగనక ఇవాళకి నువ్వే నా పాలిటి అయ్యారువి. కాని, పాపం అత న్నెందుకు బాధపెట్టేవు? ఎలాగూ ఇది మనకి రావలసిన డబ్బే. ఇక ఎవడుంటే మాత్రం నీవిక్కడికి రావడానికి అడ్డేముంది?

మ: అంటే మరీ డొంక తిరుగుడంతా ఎందుకు? నన్ను పొమ్మంటే పోతాను.

ఆ. ఛః రంగా, ఏమిటామాటలు, అసలు ఈపూట ఏమీ తినలేనట్టుంది. అందికే ఈ చిరాకంతా. పద, రొట్టె ఉంది, కాఫీ పెట్టుకొందాము.

*　　　*　　　*

ఒక మగ గొంతు, ఒక ఆడగొంతు

మ: ఏటప్పలమ్మా, తలుపు తాళం వేసుకొని ఎళ్ళిపోనావు. నీ కోసం కాసి కాసి తెల్లారిపోనాది.

ఆ: ఓసి, ఎవళ్లో అనుకున్నాను, నువ్వురా సీతన్నా! నువ్వొత్తావని నానేటి కలగానేనా?

మ: అవును నే, నీకేటి రేత్తిరంతా షికారు కొట్టొచ్చినావు. గుంట లింట్లో తొంగున్నారు కాబోలు.

ఆ: ఏటి సెయ్యను. ఆయమ్మ తిలకమ్మగోరు, ఏటి తోచకుండా ఉంది. తోడు పడుకోమంటే ఎళ్లినాను. నువ్వొత్తావని నాకేటి తెలుసు.

మ: ఏబడి, అలా దాస్తన్నావు? ఒస్సి, చూపెట్టకూడదా?

ఆ: ఏటి నేను, ఆయమ్మకి ఎవుడో ఇచ్చినాడు. గుంటలాడుకొంటారని.

మ: ఏదేదీ, అరె, జేబువోచీ, చేతివోచీ అయితే కిర్రుగా ఉండును. బాగవుతాదేమో?

ఆ: నీ సెయ్యిపడితే ఉన్నదికూడా ఊడుతుంది.

మ: నీకంటికి నేనంత అలుసయిపోనాను. మరెందుకు, నువ్వూ దానిలాగ దుకాణం పెట్టే, నీకూ వోచీలు, పెన్నులు, గొలుసులు అన్నీ వొస్తాయి.

ఆ: ఓ రెళ్ళురా, దమ్మిడీ సంపాదించ నేవు, డబ్బానాగ వాగుతావు.

మ: నువ్వు మహా సంపాదించినావులే.

ఆ: మరేటనుకొన్నావు ముగ్గురు గుంటల్ని సదివిస్తన్నాను; ఆళ్ళకి తిండి పెడుతున్నాను; బట్టలు కడుతున్నాను రోజంతా పదిళ్ళలో కష్టపడి పనిచేస్తన్నాను. నీనాగ అసుకు కబుర్లెట్టుకొని ఆడిపంచనీ ఈడిపంచనీ చేరి బతకడం నేదు.

మ: ఇవాళ నీకు మంచి రింగుగా ఉన్నట్లుందే. మరి పోతాను. తెల్లారిపోతున్నాది. అది నాకిద్దూ, ఏటైనా ఒస్తే నీకే తెచ్చిస్తాను.

ఆ: ఎందుకియ్యావురా, పిల్లి ఎలకని పట్టుకొని తెచ్చి ఇస్తుందిరా!

మ: పోనీ నీకేటి కష్టం నేదుకదా, డబ్బిచ్చికొన్నేగు.

ఆ: గుంటలెంతో సరదాగా ఆడుకొంటారని తెచ్చేను.

మ: అప్పలమ్మా, ఇది పనికిరాదని తెలిస్తే రేపు తెచ్చిచ్చేస్తాను. పనికొస్తే డబ్బు ఒక్క రూపాయి నాకు కావాలి, తక్కింది నీకు పువ్వుల్లో పెట్టి తెచ్చి ఇచ్చేస్తాను. ఒట్టు.

ఆ: నీమాటే నమ్మాల్రా. ఇదిగో. ఎళ్లు. రేత్తిరికి ఒస్తావేటి?

మ: నువ్వింటికాడ ఉంటానంటే... ఎళ్తాను మరి, ఎళ్తాను మరి, (మెల్లగా పాటలాగ) అప్పలమ్మా నామీద దయాలుంచు.

*　　　*　　　*

[ఇద్దరు కుర్రవాళ్ల గొంతులు]

1: అయితే రామం, మరి మన ఊరినించి తిరిగి రానంటావా?

2: ఏమిటోరా, ఎక్కడికక్కడ బాకీలు ఉండిపోయాయి; మా నాన్న డబ్బు పంపించడం లేదు. ఈ సంవత్సరాని కింతే. ఈ సంవత్సర మేమిటి మరిక స్కూలుకి వెళ్ళే అవకాశమే లేదనుకొంటాను?

1: నీ పనే కాదు, నా పనీ అలాగే ఉంది. ఈ సంవత్సరం పరీక్ష పాసవకపోతే మరి చదివించనంటున్నాడు మా పెద్దన్నయ్య.

2: నాకలా అనే వాడెవడయినా ఉంటే బాగుండును!

1: నీకేం, అన్నీ ఫస్టుమార్కులో సెకండు మార్కులో. నన్ను ఇంట్లో కూర్చోనిచ్చే మాటయితే, నేను చదువు మానేసినందుకు నాకేం విచారం లేదు. కాని, మా నేనిన మర్నాటి నుండి మా పెద్దన్నయ్య కంసారి వాడి చేతకంటె ఎక్కువపని చెయిస్తాడు. అంచేతే నాకు వేసవికాలం శెలవుల్లో మన ఊరు వెళ్లడం అంటే భయం. మాఅక్కయ్యగారి ఊరో, మా మయ్యగారి ఊరో పోతాను.

2: ఒరే. శర్మా ఆవేళ ఉదయం వెళ్తోంటే మన గోపాలానికి పది రూపాయిల నోటు

దొరికింది కదూ! అలాగే మనకిప్పుడొక నూరు రూపాయిల నోటు దొరికితే....

1: అంత అదృష్టం ఉండొద్దూ? నిజంగా దొరకాలేగాని దొరికితే నా కొక్క దమ్మిడీ కూడా అందులో వంతడగను. నీకీ సంవత్సరం చదువు ఏ బాధా లేకుండా గడిచి పోతుంది.

2: సరదాకి అనుకొన్న మాటయినా ఈ మాత్రం మంచి మాట అన్నావు, అదెంత కాదు. నిజానికి మా నాన్న చేసే ఖర్చు చూస్తే, డబ్బు లేదనడం అంతా నా చదువు ఎగ్గొట్టడానికే సాకనిపిస్తుంది. మొన్న పెద్ద పండగల్లో ఆయన పేకాటలో నాలుగు వందలు ఓడిపోయాడు. ఆయనకి నా చదువు కంటె ఆ మూడు రోజులు పేకాట ఆడి పొందిన ఆనందమే ఎక్కువగా అనిపించింది.

1: అంత డబ్బూ పేకాటకింద తగలేస్తే మీ పిన్ని ఏమీ అనదూ?

2: అనకేం అంటుంది. కాని ఆవిడ గోలంతా ఆ డబ్బుకూడా జాగ్రత్తచేసి తాను బంగారం సింగారించుకోవాలనే. ఇక నింకేరా! మా నాన్న అంటాడు, ఈ సంవత్సరానికి చదువు మానేసి వచ్చేయి అబ్బాయి అని. మళ్ళీ సంవత్సరానికల్లా ఎక్కడినుండో ఆకాశంమీదినుండి డబ్బు వచ్చి పడేట్లు.

1: ఓరే రామం, ఏమిట్రా అది, సైను కాలవపక్కను తెల్లగా...

2: ఏమిట్రా నీ ఆశ, ఏదో డబ్బారేకు ముక్క కాబోలు.

1: కాదురా! ఇదుగో చూడు, జేబు వాచీ, మా బావ రైల్వేగార్డు. అతనిదగ్గర ఇలాటిదే ఉంటుంది. నా కిటువంటిదాని మీద ఎంతో సరదాగా ఉండేది. ఇది ముందు నేను చూసేను గనక నేను ఉంచుకోడం న్యాయం.

2: అలాగే ఉంచుకోరా! నువ్విచ్చినా నాకది అక్కర్లేదు.

1: అలాక్కాదురా! ఇందాకా అన్నానుకదూ, మన కేదయినా దొరికితే అంతా నీకే ఇస్తానన్నానుకదూ! ఇది అమ్మేసి ఎవరికీ లేకుండా చేసేకంటె, ఎవరయినా వాచీ మేకరు చేత ఖరీదు కట్టించి, ఎంతంటే అంత నీ కిచ్చేస్తాను. ఎంత ఖరీదయినా సరే, బాగుచేయించి, ఈమారు మా బావగారి ఊరు వెళ్ళేటప్పుడు పెట్టుకొని వెళ్ళాలి.

2: నీకు మంచి చేతివాచీ ఉంది కదా, ఎందు కిదంటే ఇంత సరదా?

1: ఇప్పుడు ప్రతివాడికీ చేతివాచీ ఉంది. జేబువాచీలు, ఎక్కడో నూటికో కోటికో ఎవళ్ళకో పెద్దమనుషులకి గాని లేవు. దీనికి ఒక వెండిగొలుసు చేయించి, జేబులో పెట్టుకొని, గొప్పగా ఒకమారు బయటకితీసి, టైము చూస్తూ ఉండడం అదొక సరదా! మనం నూరు రూపాయిల నోటు అనుకొంటే ఇది దొరికింది. పోనీలే ఇప్పటి బండిలోమానేసి, సాయంకాలం బండికి మన ఊరు వెళ్దాము. ఈలోగా దీని వ్యవహారం ఒకటి తేలి పోతుంది. మన ఊరు వెళ్ళగానే మా పెద్దత్త దగ్గర నేను దాచిన డబ్బులోంచి నీకు రావలసింది ఇచ్చేస్తాను.

2: అలాగే కాని, ఏదీ చూడనీ, అసలిది ఏ కాలపునాటిదో, దీనికి విలువ ఏమయినా ఉంటుందో ఉండదో, బాగు చేయించబడే పరిస్థితిలో ఉందో లేదో...

1: ఎందుకు బాగు కాదు? కావాలంటే అన్నీ కొత్తభాగాలు వేయిస్తాను. అసలే కొత్తది కొనడం అంటే మావాళ్ళు తిడతారు గాని, ఉన్నది బాగుచేయించడం అంటే అట్టే కాదనరు. నీకేమిటి ఈ ఒక్క పూటలో మించిపోయింది లేదుకదూ.

2: ఒక్కపూట కాదు, ఎన్నాళ్ళు వీలుంటే అన్నాళ్ళుండాలనే ఉంది. కాని, మరి, హోటలువాడి బాధపడలేక, నిన్న రాత్రి కూడా వెళ్ళలేదు.

1: అరరే, నాకైనా చెప్పావు కాదు, ఇవాళకి నువ్వు నా గెస్టువి. మా హోటలుకి పోదాం, ముందు, ఇప్పుడిలా కాఫీ హోటల్లో, ఇక్కడ దగ్గరలో గౌరీశంకర రొక్కటే ఉంది. కాఫీ తాగి, కాస్త అటూ ఇటూ తిరిగే మంటే వాచీమేకరు ఈళ్వరప్ప దుకాణం తీస్తాడు.

కర్కశమయిన మగగొంతు—3: తీస్తాడ్రా దొంగ వెధవల్లారా? మిమ్మల్నిలా విడిచి పెట్టకూడదు, పదండి పోలీసు స్టేషనుకి.

1: ఏమిటయ్యా, చెయ్యొదులు, నువ్వెవడివి మమ్మల్ని పట్టుకొందికి?

3: పట్టకొంచెం కూత ఘనం. నే నెవడినో ఏమిటో అంతా పోలీసు స్టేషనులో తెలుస్తుంది లెండి, పదండి. మీకు ఇంత చిన్నతనం నించి దొంగతనాలు అలవాటయి పోయాయి. మిమ్మల్ని తేలికగా విడిచిపెట్ట కూడదు. ఈ జేబువాచీ మీకెలా వచ్చింది?

2: మేమేమీ దొంగతనం చెయ్యలేదండి. ఇది మాకు...

1: మా బావగారు రైల్వేగార్డు, ఆయనకి కొత్త వాచీ సప్లయిఅయింది. పాతది నా కిచ్చేసేడు.

3. పాతది నీ కిచ్చేసేడేం, పద ఆ మాటే పోలీస్టేషన్లో చెప్పుదుగాని, దొంగ వెధవలు. నేనిందాక వెళ్తున్నప్పుడు పైమీది తువ్వాలు జారిపోయింది. దాని కోసం వంగడంలో ఇది పడిపోయి వుంటుంది. దానికోసమే వెతుక్కొంటూ వస్తున్నాను. ఇంతలో నే ఇది మీ దొంగకళ్ళకి కనబడింది.

2: పోనీ మేమేం మీజేబులోంచి దొంగలించేమని మీరే అనలేదుకదా! కనిపించిన వస్తువు తియ్యడమూ తప్పేనా?

3: నువ్వు కొస్త బుద్ధిమంతుడిలా గున్నావు. తియ్యడం తప్పలేదుగాని, అసలు మనిషి వెతుక్కొంటూ వస్తే, వాళ్ళ వస్తువు వాళ్ళకివ్వకుండా కొన్నామనీ మా బావ ఇచ్చేడనీ దబాయించడం తప్పకాదూ? మీకు సరదాగా ఉంటే, నా మాటమీద నమ్మకం లేకపోతే పోలీసు స్టేషనుకి పదండి. అక్కడ వాళ్లు నా వాచీ నా కెలాగూ ఇచ్చేస్తారు. మీకుమాత్రం జైలు తప్పదు.

2: జెయిలు. ఎందుకు? మేమేం చేసే మని?

3: కనిపించిన వస్తువు సరియయినవారికి లేదా పోలీసులకి అప్పగించకుండా మాదే నని మోసంచేసి అమ్మడానికి ప్రయత్నించి నందుకు. ఆఁ ఏమిరోయి, నాకే కన్నుగప్పి పారిపోవాలని చూస్తున్నావు, నా పట్టు ఒదిలించుకోడం మహామహా వాళ్లకే శక్యం కాదు. మీరు కుంటలు గనక దయదలచి చెప్తున్నాను. అనవసరంగా తాపులు తినకుండా అది ఇచ్చేసిపొండి.

1: నే నివ్వను. ఏంచేస్తావో చూస్తాను. ఇది నీ వాచీ అని ఏమిటి నమ్మకం.

3: ఏంజేస్తానా? ఇంకా ఎదురు తిరిగి దబాయిస్తున్నావురా? గట్టిగా ఒక్కటి తగిలించేనంటే మొగం తిరిగి పడతారు.

2: ఒరే శిరామ్మ, మనం లేచిన వేళ మంచిదికాదురా? అది ఇతనిదయినా కాకపోయినా మన కెందుకు? ఇక్కడ మనమాట వినేవా ళ్లెవళ్లు? ఇచ్చేసి పోదాంపద. రైలు కింకా వేళుంది.

3: అదీ మంచిమాట. ఊఁ మారుమాటాడ

కుండా, తిరిగి చూడకుండా పొండి; మీ బతుక్కి పోలీసులదాకా ఎందుకు, నేనే చాలును, పొండి.

నిండైన నుగ గొంతు 4: ఏమిటండీ అది, ఏమి టబ్బాయిలూ ఏమిటి చేసేరేమిటి?

2: ఏమీ లేదండీ, మాకేమీ తెలియదు.

4: ఏమీ లేకపోతే ఎందుకింత గొడవ జరుగుతూంది?

3: మరేమీ కాదు సార్. నేను ఇందాకా అరగంటకిందట ఈ దారిని వెళ్తూంటే, నా జేబులోంచి ఈ వాచీ పడిపోయింది. దానికోసం వెతుక్కుంటూ వచ్చేసరికి అది వీళ్ళకి దొరికిపోయింది. వీళ్ళలో ఇతను కొత్త నెమ్మదియినవాడిలాగున్నాడు. ఇదుగో ఇతనున్నాడే, నన్నే నుబికి కొట్టించాలని మాసేడు; మా బావదని, నాకు మరామత్తు చేయించడానికిచ్చేననిని.

4: అలాగా పోనిలెండి. మీ వస్తువు మీకు శ్రమలేకుండా దొరికిపోయిందికదా? కుర్రవాళ్లి నెందుకు బాధపెడతారు. దొరికితే సరదాపడి తీసుకుంటారు. వాళ్ళేం మీ జేబులోది దొంగిలించలేదుకదా!

3: నేనూ అదే అంటున్నాను మర్యాదగా చేసిన తప్పు ఒప్పుకోని పొమ్మంటున్నాను.

4: మంచిపని చేసేరు. ఏది, కొంచెం పాతబడినట్టుంది. అయినా బాగానే ఉంది. దీని చెయిను తెగిపోయింది కాబోలు.

3: అవునండీ. అందుచేతనే జేబులో పెట్టుకొంటే ఎందుకో వంగితే పడిపోయింది.

4: అంతే అయివుంటుంది అబ్బాయిలూ పొండి. ఈ మారు ఏదయినా వస్తువు దొరికితే అది ఎవరిదయితే వారికి మీ అంతట మీరు అప్పజెప్తే మిమ్మల్ని మెచ్చుకుంటారు... సరే. కాని, ఇది చాలా పాతదిలాగుంది, మీకేం ఉపయోగిస్తుంది?

3: పాతదేనండి. అందులోనూ ఈ మధ్య నల్లా వాడిక లేదు, పెట్టె అడుగుని పడివుండేది. ఈమధ్యను నా చేతివాచీ, మాతమ్ముడు పట్టుకొనిపోయాడు. ఇది బాగవుతుందేమో చూపించాలని. లేకపోతే, సరైన ధరవస్తే, ఇది ఇచ్చేసి, చేతివాచీ ఒకటి కొనుక్కుందామని.

4: బాగుంది అలా అయితే చూడండి. నాకు పాతవస్తువులంటే చాలా సరదా. అందులో వాచీలు కలాలు అంటే మరీని. నాదగ్గర మంచిదే వెస్టెండు కంపెనీ చేతివాచీ ఈ మధ్యనే కొన్నది ఉంది. మీరు గాని శ్రమ అనుకోకుండా మాయింటికి వస్తే అది చూద్దురుగాని ఇష్టపడితే...

3: ఎందుకు లెండి మీకీ పాతది అంటగట్టి కొత్తది మంచిది తీసుకోడం నా కిష్టం లేదు.

4: ఫర్వాలేదు లెండి. మీ రెలాగూ అమ్మకవలసినప్పుడే కదూ అది మానేక, మీ కిష్టం లేకపోతే, వాచీ మేకరుచేత ధర కట్టించి ఎంతంటే అంత మీ కిచ్చేస్తాను పదండి.

*                *                *

ఫోను కాలింగు బెల్ ఒకటే గొంతు

హల్లో! ఎవరూ నారాయణమూర్తి పంతులు గారా! నేను ఇన్‌స్పెక్టరు నీలకంఠాన్ని...

ఏమిటి సంగతి...ఆఁ ఆఁ ఈ ఉదయమేనా?

ఏమిటి? మనిషి దొరికేడా? మీ యింటి దగ్గరే ఉన్నాడా? చిత్రంగానే ఉందే, మరేమీ పోయినట్టు లేదుకదా!

ఆఁ ఆఁ సరే.

ఇప్పుడే ఇద్దరు కానిస్టేబుల్స్‌ని పంపిస్తున్నాను. ఈలోగా పారిపోలేడు కదూ!

ఏమిటి, మీ రామస్వామి ఉన్నాడా? అయితే బాధలేదు. ఆఁ ఆఁ నేనూ ఒక్క పావుగంటలో వస్తున్నాను. అన్ని సంగతులూ కక్కిద్దాము. సెలవు.

*                *                *

(మొట్టమొదట వినిపించినటువంటి వాద్యాల కలగలపు ధ్వని)

జేబు వాచీ

మిత్రులారా! భూతమే తప్ప, వర్తమానమే లేదని మూలబడిన నావంటివాడికి, ఒక్క రాత్రిలో ఇన్ని సంఘటనలు జరగడమూ మళ్ళీ నేను ఇక్కడికి చిత్రంగా రాగలగడమూ ఇదంతా ఏమో దైవ సంకల్పమే అనుకోవాలి. అయితే మానవులలో మనలాగ ఎక్కడ పొరపాటుందో, తెలుసుకొని సరిదిద్దబడరు. అసలు వాళ్లకి మనకి లేని, బుద్ధి అనే శక్తి ఉందని చాలా గర్వం గాని, అందువల్లనే వాళ్ళు తమ తమ పనులు నియమబద్ధంగా సాగించుకోడం మానేసి, ఒకరి దారికి ఒకరు అడ్డు తగుల్తూ ఉంటారు. తప్పొకచోటుంటే దండన ఇంకొకచోట చేస్తూఉంటారు. అసలు—

గోడ గడియారం:

చాలా విలువయిన ఉపన్యాసానికి అడ్డు తగుల్తున్నందుకు జేబువాచీగారు క్షమించాలి. నేటి సంఘటన చాలా గొప్ప అనుభవమే! అయితే, అదుగో వినండి. మెట్ల మీద అడుగులసవ్వడి వినిపిస్తూంది. కాబట్టి నేటికి మన సమావేశం ముగిద్దాము. రేపు ఎన్ని ముఖ్యాంశాలున్నా వాయిదా వేసి, ఈ వేర్వేరు సంఘటనలనుగూర్చి ఒక్కొక్కరం చర్చ సాగిద్దాము—అదుగో చప్పుడు దగ్గరపడుతూంది. ఊఁహుఁ ఇంక రాలేదు. అయినా మరి సమయం లేదు. ఒక్క సంగతి. ఇకముందు మనవారందరూ కూడా వీలున్నప్పుడల్లా కథలుగా కాక నాటికలుగా తమ తమ అనుభవాలను తెలియజేస్తారని ఆశిస్తున్నాను—ఈ మంచి పావడి మనకు పెట్టిన జేబువాచీగారు కలకాలం మనతో కలిసిఉండాలని నా ప్రార్థన.

అందరూ: జెయ్ గోడవాచీగారికీ జెయ్, ఒక్క రవ్వంతలో మనల్ని శాశ్వతంగా విడిచిపెట్టిఉండవలసిన జేబువాచీగారికీ జెయ్, యాంత్రిక మిత్రమండలికీ జెయ్, నిశాసమావేశాలకీ జెయ్. ★

# వనితాలోకం

## బాలికలు - సహవిద్య

ఇల్లిందల సరస్వతీదేవి

"ఆడపిల్లలకు చదువు చెప్పించటము ఇక ముందు చాలా కష్టము కాదూ? పాఠశాలలన్నీ సహ విద్యా విధానములో నడుపబడుతాయని అంతా అనుకుంటున్నారు. ప్రజలకందరికీ ఈ పద్ధతి నచ్చుతుందా?" అని విశాలాక్షికి ఆలోచన కలిగింది.

ఆధునిక కాలములో అక్షరాస్యతకూ విద్యాభివృద్ధికీ ముఖ్య సాధనలు పాఠశాలలు. నిరక్షరాస్యతను నిర్మూలించాలనీ, జీవితావసరాలకు ఉపయోగకరమైన విద్య అందరికీ అందుబాటులో ఉండాలనీ అన్ని దేశాలూ పాటుపడుతున్నాయి. బాగా అభివృద్ధి చెందిన అమెరికా ఇంగ్లండు, జపాను మొదలైన దేశాలలో అక్షరాస్యుల సంఖ్య ఇంచుమించుగా నూటికి నూరుపాళ్లు ఉన్నది. ఈ విషయములో భారతదేశము కొంత వెనుకబడి ఉన్నమాట వాస్తవము. స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత భారత ప్రభుత్వము అక్షరాస్యతను వృద్ధిచేయటానికీ, విద్యా ప్రచారానికీ ఎన్నో పథకాలు సిద్ధము చేసింది.

> సహ విద్యా విధానం (Co-education) గురించి అనుభవజ్ఞులైన విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తమ తమ అభిప్రాయాలను, అనుభవాలను క్లుప్తంగా వ్రాసి పంపినట్లయితే వనితాలోకంలో ప్రచురించగలము. ఈ లేఖలను పంపువారు తమ పూర్తి పేరు, చిరునామా మాకు తెలియపరచడం అవసరం.
>
> —సంపాదకుడు

మొదటి రెండవ పంచవర్ష ప్రణాళికలలో దీనికి వందలకోలది కోట్ల రూపాయలను కేటాయించింది. ఇటీవల భారతీయ విద్యావేత్తలూ విద్యాశాఖామాత్యులు ఈ విషయములో కొన్ని ప్రకటనలు చేస్తూ వచ్చారు. హైదరాబాదు విద్యాశాఖామాత్యులు కూడా 'ప్రాథమిక తరగతులలో బాలబాలికలకు సహవిద్యా విధానము అత్యంత ఆవశ్యకమని నేను గుర్తింపబడ్డది. ఈ విధానము తిరిగి పోస్టుగ్రాజ్యుయేటు తరగతులలో కూడా ఉంచటము సమంజసము' అని సూచించారు. 'మాధ్యమిక ఉన్నత పాఠశాలలు బాలబాలికలకు విడివిడిగా ఉండటము ఉత్తమము' అని విద్యాశాఖామాత్యులు ప్రసంగించారు.

అయితే - వివిధరకాల పాఠశాలలను స్థాపించేటప్పుడు బాలికల విద్యాభివృద్ధిని కూడా ప్రత్యేకముగా దృష్టిలో ఉంచుకోవలసి ఉన్నది. మన సాంఘిక పరిస్థితులవల్ల మతవిశ్వాసాలవల్ల మన దేశములో స్త్రీవిద్య వెనుకబడి ఉన్నది. నూటికి 51 వంతున ఉన్న స్త్రీ జనానికి అక్షరాస్యతను కలిగించటానికీ, విద్యాభివృద్ధి చెయ్యటానికీ, ప్రణాళికలలోని పథకాలు తోడ్పడాలి. నాటి ఆశయము కూడా ఇదే. దీనికి తోడ్పడే విధానాలలో సహవిద్య ఒకటి అని తీర్మానించటమువల్ల - ఒక్క విశాలాక్షికే కాదు-చాలమందికి ఆ విధానములో విశ్వాసము కలుగలేదు. ఈ విషయము విద్యావేత్తలు, పౌరులు, తలిదండ్రులూ ఆలోచించవలసినది.

పిల్లలను పాఠశాలలో చేర్పించటములో కలిగే సమస్యలలో సహవిద్య ఒకటి. ఇది ఎంత ప్రధానమైనదో అంత వివాదాత్మకమైనది. ఈ సమస్యకు సంబంధించిన చర్చలూ ప్రయోగాలూ ఇంగ్లండు మొదలైన ఇతర దేశాలలో జరుగుతూవచ్చాయి. కాని ఇంతవరకూ ఏ దేశంలోనూ ఎవరూ ఒక నిశ్చితాభిప్రాయానికి రాలేదు. మన దేశములో ఈ సమస్య ఇటీవలనే బహులు గిరి గడ్డుసమస్యగా ఎంచబడ్డది. ఆర్థిక విద్యావిషయికముగా ఈ సమస్య పదిమంది దృష్టిలోకి తీసుకొనిరాబడి ప్రధాన సమస్యగా భావించబడ్డది. ఈ సమస్య స్త్రీ విద్యకు సంబంధించినది; దీని పరిష్కారమూ స్త్రీలకు సంబంధించినదే కనుక స్త్రీలు తమ తమ అనుభవాలను ఆశయాలను కలబోసుకొని ఒక నిర్ణయానికి రావలసిన అవసరము ప్రస్తుతము ఎంతైనా ఉన్నది.

సహవిద్య అంటే బాలికలను బాలుర పాఠశాలలలో విద్యాభ్యాసానికై చేర్పించి విడివిడిగా ఉంచటము కాదు; బాలబాలికలు ఒకే పాఠశాలలో ఒకే తరగతిలో సమానమైన వరతులమీద చేరి, ఆ పాఠశాలలో సహా బయటకూడా, అన్ని కార్యక్రమాలలో సమానాధికారముతో పాల్గొంటూ విద్యాభ్యాసము చేయటము.

పాశ్చాత్యదేశాలు సహవిద్యావిధానానికి అలవాటుపడ్డాయి. గ్రీసు రోము దేశాలలో సహవిద్య ప్రాచీనకాలమునుండీ ఉన్నది. కాని మధ్యకాలములో రోమన్ కాథలిక్కు ప్రచారకుల ఒత్తిడివల్ల, బాల బాలికలకు ప్రత్యేక విద్యాసంస్థలు వెలశాయి. కాని ప్రజల సంస్కరణాభిలాషవల్ల సహవిద్య తిరిగి ప్రాముఖ్యము వహించింది. 18 వ శతాబ్దాంతములో ఇది మరింత ప్రాధాన్యత కలదియైంది.

విద్యార్థులకు సౌకర్యముగా, సదుపాయముగా ఉంటుందనీ, ఆర్థికముగా లాభకరమనీ, అన్నిటిని మించి సహవిద్యావిధానమువల్ల బాలబాలికలు కలసిమెలసి సహకార భావముతో విజ్ఞాన శిక్షణను పొందటమువల్ల జాతీయాభ్యుదయం సాధించవచ్చుననే ఉద్దేశ్యముతో సహవిద్యా సంస్థలు అధిక సంఖ్యలో స్థాపింపబడ్డాయి. అమెరికా దేశములో విద్యావిధానము చాలా వరకూ సహవిద్యలోనే సాగిపోతున్నది. కెనడా, స్కాట్లండు, డెన్మార్కు, స్కాండినేవియన్ దేశాలలోకూడా విద్యాసంస్థలు చాలావరకూ సహవిద్యావిధానములోనే నడుపబడుతున్నాయి. జర్మనీలో సహవిద్యా పాఠశాలలు ప్రాథమికదశలో సర్వసామాన్యమే అయినా, మాధ్యమిక పాఠశాలలవరకు సహవిద్యను విస్తరింపచేయటానికి బహుజనాభిప్రాయము అనుకూలముగా లేదు. కనుక మాధ్యమిక పాఠశాలలు బాల బాలికలకు విడివిడిగా స్థాపింపబడ్డాయి. ఫ్రాంసు ఇటలీదేశాలలోను యూరపు ఖండములోని రోమన్ కాథలిక్కు దేశాలలోను, ప్రాథమిక పాఠశాలలవరకే సహవిద్య అంగీకరింపబడ్డది. దానికయినా బహుజనాంగీకారము తక్కువ.

ఇంగ్లండులో ప్రాథమిక పాఠశాలలు సహవిద్యా విధానములో ఉండటము సాధారణమైన విషయము. కాని మాధ్యమిక ఉన్నత పాఠశాలల విషయము వేరుగానే భావించారు. ఆ దేశములో ప్రాథమికదశలోను, కళాశాల దశలోను, సహవిద్యావిధానాన్ని అమలుపరచటములో ఎక్కువగా ఆక్షేపణలు లేవు 1934 లో ఎడ్యుకేషన్ బోర్డువారు ప్రకటించిన రిపోర్టు ప్రకారము, ప్రాథమిక పాఠశాలలు (*Primary Schools*) సహవిద్యా విధానములోనే ఉన్నాయి. బాలబాలికలకు ప్రత్యేకముగా ఉన్న పాఠశాలలకంటె, సహవిద్యా విధానములో ఉన్న పాఠశాలల సంఖ్య 20 రెట్లు అధికముగా ఉన్నది. కొన్ని ఉన్నత పాఠశాలలు సహవిద్యావిధానములో ఉన్నప్పటికీ వ్యతిరేకాభిప్రాయాలు లేకపోలేదు. "సహవిద్య పన్నెండు సంవత్సరాల లోపుగాను, ఇరవై సంవత్సరాలపైనను, ఎటువంటి ఆక్షేపణా లేకుండా అంగీకరింపవచ్చును, కాని—మధ్యకాలములో, 12 సంవత్సరాలనుండి 20 సం. లోపుగా మాత్రము అభ్యంతరాలు చాలా ఉన్నాయి" యని అక్కడి విద్యావేత్తలు అభిప్రాయమిచ్చారు.

భారత దేశములో సహ విద్య మొన్న మొన్నటి వరకు ఒక సమస్యగా పరిణమించలేదు. పూర్వము స్త్రీవిద్యకు 'గృహారాజ్యమాన్యము వరకే పరిమితి' అని నిర్వచనము కనుక బాలికలకు సామాన్యముగా గృహములోనే విద్యాభ్యాసము జరుగుతూ ఉండేది. కాని యీ కాలములో విశాలదృష్టి ఏర్పడ్డది. విజ్ఞానవంతులయిన తలిదండ్రులు తమ బాలికలకు పాఠశాల విద్య కావలెనని అభిలషిస్తున్నారు. ఉద్యోగాలకు తగిన అర్హత, యోగ్యత బాలికలకు కావలెనని అపేక్షిస్తున్నారు. కొందరు ఉత్తమ గృహిణిగా రూపొందించటానికే విద్య కావాలంటున్నారు. స్త్రీలకు ప్రత్యేక విద్యావిధానము కావలెనని కాంక్షిస్తున్నారు. సహ విద్యా విధానము ననుసరిస్తే బాలికలకు ప్రత్యేక ప్రణాళిక ఏర్పరటము అసంభవము కదా!

మన దేశములో సహవిద్య ప్రస్తుతము ప్రాథమిక పాఠశాలలకు సంబంధించినంత వరకే అతికష్టముమీద ఆమోదింపబడ్డది. ఇది పాలనా సౌకర్యాన్ని దృష్టియందుంచుకొని చేసిన మార్పేగాని, సంపూర్ణ విద్యాసౌకర్యాల దృష్ట్యా చేసినది కాదు. భారత దేశములో సహవిద్యకు దక్షిణప్రాంతములో అనుకూల్యము ఎక్కువగాను, ఉత్తరాదిని తక్కువగాను కనిపిస్తూ ఉన్నది. మదరాసు మైసూరు తిరువాన్కూరు కొచ్చిను రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సదుపాయము కొరకూ, విద్యాసౌకర్యము కొరకూ, ప్రాథమిక పాఠశాలలలో సహవిద్యను అమలుజరుప నిశ్చయించారు. ప్రాథమికదశలోనే సహవిద్యకు ఆర్థిక విద్యాసౌకర్య లాభాల ఆధారము అనుకూలముగా ఉన్నది. గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య అల్పము కనుక బాలబాలికలకు విడివిడిగా నాలుగు తరగతులవరకూ నడపటము ఆర్థికముగా ఎంతమాత్రమూ లాభకరము కాదు. కాగా గ్రామాలలో ఒకరిద్దరు ఉపాధ్యాయులు గల పాఠశాలలు అంతగా సమర్థనీయములుగా కూడా లేవు.

మొత్తముమీద అనేక చర్చలూ వివాదాలు జరిగిన తరువాత ప్రాథమిక పాఠశాలలు సహవిద్యావిధానములో నడుపవలెనన్న విషయము అందరూ ఏకగ్రీవముగా సమర్థించినదే. ప్రాథమిక పాఠశాలలు ఒక కుటుంబము మాదిరిగా నడుపవలెనన్నది కూడా అందరిచేత ఆమోదింపబడ్డదే కనుక సాధ్యమైనంతవరకు ప్రాథమిక పాఠశాలలో ఆశయము, విధానము, వ్యక్తుల మధ్య సంబంధము మొదలైన అంశాలు తీర్చిదిద్ది రూపొందించిన ఆదర్శ గృహములో ఉన్నటువంటి వాతావరణము సృష్టింపబడాలి. అప్పుడు గాని బాలబాలికలు సహజముగా ఉల్లాసముతో సోదరీ సోదరులవలె మెలగటానికి అనువుగా ఉండదు.

ప్రాథమికదశలో సహవిద్యావిధానము అనేక విషయాల దృష్ట్యా, బహుజనామోదము పొందింది. వీటిని నిజమువంతము చేయటానికి గుర్తించవలసిన ముఖ్యాంశము, పాఠశాలలలో నియమింపబడే ఉపాధ్యాయులకు సంబంధించినది. సహవిద్యా పాఠశాలలలో స్త్రీలనే ఉపాధ్యాయులుగా నియమించవలసి ఉన్నది. బిడ్డకు బాల్యములో తల్లే ప్రధానమైనది కనుక పాఠశాలలో తల్లికి మారుగా ఉపాధ్యాయిని సామర్థ్యముతో బిడ్డలకు బోధించగలదు. బాలబాలికలకు ఇదరికీ తల్లివలె స్త్రీయే మనసుకెక్కునట్లుగా బోధ చేయగలదు. బిడ్డలకు ఉత్తమమైనవిగా నిర్ణయింపబడిన మాంటెసరీ కిండరుగార్టెను విధానాల ననుసరించి బోధించటానికి తగిన యోగ్యత స్త్రీలకే ఉన్నది. సహజవాత్సల్యముతో బాలురతోనయినా బాలికలతోనయినా పురుషులకంటె స్త్రీలే చక్కగా మసలుకొనగలరు. బాలికలకు ప్రత్యేకముగా కుట్టుపని సంగీతము ఇంటిపనులు కూడా నేర్పగలుగుతారు.

# ★ బాలికలు-సహవిద్య ★

భారతదేశ సాంఘిక పరిస్థితులదృష్ట్యా స్త్రీలు ఉపాధ్యాయులుగా నియమింపబడటమువల్ల కొన్ని అదనపులాభాలు కూడా ఉన్నాయి. తమ బాలికలను సహవిద్యా పాఠశాలలకు పంపినప్పటికీ తగిన రక్షణ లభిస్తుందనే నమ్మకము ధైర్యము తలిదండ్రులకు కలగటానికి అవకాశము కలుగుతుంది. ఈవిధముగా మరికొంతకాలము చదువుకొన్నప్పటికీ అభ్యంతరము లేదనిపిస్తుంది. తగిన సామర్థ్యముగల ఉపాధ్యాయినుల సంఖ్య అల్పముగా ఉన్నపక్షములో, ఈ దృష్ట్యా ప్రాథమిక సహవిద్యా పాఠశాలలలో స్త్రీ పురుషులను ఉపాధ్యాయులుగా సమాన సంఖ్యలో నియమింపబడటముతో సమాధానపడవచ్చు. స్త్రీలలో ముఖ్యముగా వివాహితలనే నియమించటము ఉత్తమము.

మాధ్యమిక ఉన్నత పాఠశాలలలో సహవిద్యావిధానము అన్ని యితర దేశాలవలెనే మనదేశములో కూడా కూడదనుకున్నారు. ఇకపోతే—కళాశాల విద్యలో సహవిద్యా విధానము విషయములో టెక్నికల్ కళాశాలలు (మెడికల్, అగ్రికల్చర్) తప్ప మిగతా వాటిలో కూడా సహవిద్యా విధానాన్ని అమలుపరచటాన్నిగురించినది పెద్ద సమస్య.

దూరదృష్టితో చూడగలిగితే విద్యావ్యవస్థలకు సంబంధించిన అనేక సమస్యలవలెనే సహవిద్యా సమస్య సాంఘికమైనది. అది స్త్రీ విద్యా విషయానికి సంబంధించినది. మనదేశములో స్త్రీ విద్య భారతదేశ సాంఘిక జీవిత పరిస్థితుల చేత రూపొందించబడ్డది. అవి ఈదేశములో స్త్రీ జీవితాదర్శాలు సంఘములో ఆమెకుగల స్థానాన్ని బట్టి నిర్ణయింపబడ్డాయి. మొత్తముమీద ఈ సమస్యా పరిష్కారము ఆయా దేశపు ప్రజల ఆదర్శాలు, దృక్పథాలు, సంఘ వ్యవస్థలు, వ్యవహారాలు, ఆచారాలు, విశ్వాసాలు మొదలైనవాటి మీద ఆధారపడి ఉంటుంది.

సోవియట్ రష్యాలో బాలబాలికలు రాష్ట్ర ఆర్థిక ఛాయాలో సమాన విలువగల సైన్యము క్రింద పరిగణింపబడుతున్నారు. కనుక విద్యయొక్క ఆదర్శాలు, ఆశయాలు జాతిభేదాలు, తత్సంబంధమైన సహవిద్యాసమస్యలు ఆ దేశీయులకు కలగవు. కాని జర్మనీలోను, ఇంకా ఇతర యూరపు దేశాలలోను బాలికను భావి గృహిణిగా, మాతగా దృష్టియందుంచుకొని పాఠశాల విద్యావిధానాలను ప్రత్యేకావసరాలకు తగినట్లుగా నిర్మాణము చేశారు. ఆ దేశములోనయినా దృక్పథములోను ఆశయాలలోను సాంఘికముగా మార్పుగలిగి ఒత్తిడి తటస్థించినట్లయితే సహవిద్యావిధానముపట్ల నిర్ణయములో మార్పులు విధిగా కలుగుతూనే ఉన్నాయి. ఇంగ్లండులో విక్టోరియా రాణికి యౌవనదశ వచ్చినప్పుడు, ఇతర విద్యార్థుల నుండి ఆమెను విడదీసి ప్రత్యేకమైన వాతావరణములో వివిధ విద్యలలో నైపుణ్యము కలిగించారు. ఆ మీదట-మహిళోద్యమము పుట్టి క్రమ వికాసము పొందిన తరువాతను, స్త్రీలు ఉద్యోగ వ్యాపారముల రీత్యా, పారిశ్రామికముగా, సాంఘికముగా, పురుషులతో సమానఛాయాలో బహిరంగముగా మెలగవలసి రావటముతో, సహవిద్యా విధానముపట్ల ఆ దేశములో స్వల్పముగా సుముఖత యేర్పడ్డది. ఇంగ్లండులో కూడా మార్పు చాలా నిదానముగా కలగటము గమనింపతగిన విషయము.

భారతీయుల సాంఘికదృష్టిలో స్త్రీ గృహయజమానురాలు. యుగముల తరబడి ఆమె మతసాంఘిక శిక్షణము కట్టుబాట్లలో ఉన్నమాట వాస్తవమే. ప్రాచీన విజ్ఞానానికీ మతానికీ ఆమె పట్టుకొమ్మయి వాటి ప్రభావము తన గృహముమీద చూపగలుగుతుంది. ఇక గృహములో వున్నవారు పెనిమిటి కొడుకులు కూతుళ్లు కోడళ్లు ఆమె యాజమాన్యములోనివారే. సంఘదృష్టి విస్తృతమయి, రాజకీయముగా మెలకువ కలిగిన తరువాత, భారతదేశములోకూడా ఇంగ్లండుదేశములోవలెనే స్త్రీ స్వాతంత్ర్య సమరము ప్రారంభమయి ఆ మార్గములోనే నడచింది. మతసంబంధమైన సాంఘికమైన కట్టుబాట్లు క్రమముగా సడలిపోతున్నాయి. విశాలదృష్టిగల సంస్కారప్రియులు వివాహ వయసును అధికముచేసి చట్టసమ్మతము చేశారు. చాలామంది స్త్రీలు పరదాలలో నుండి బయటపడి ముందడుగు వేశారు. స్త్రీలకు పునర్వివాహము బహుభార్యాత్వ నిషేధము, విడాకులు చట్టసమ్మతిమయ్యాయి. వారసత్వాధికారము కొంతవరకు లాభించింది. రాజకీయపు ముమ్మరము అనేకమంది స్త్రీలను రంగముమీదికి తీసుకురాగలిగింది. వోటింగు హక్కు కూడా స్త్రీలకు సులభముగానే లభించింది. భారత స్త్రీలు క్రమముగా ఉద్యోగాలలో ప్రవేశించి వైద్యురాండ్రుగా, న్యాయవాదినులుగా ఉపాధ్యాయినులుగా ప్రఖ్యాతిగాంచుతున్నారు. సాంఘికసేవకు కొందరు స్త్రీలు పూనుకొన్నారు. మరికొంతమంది రాజ్యాంగపరిపాలనలో మంత్రిణులుగా ప్రధాన సభ్యురాండ్రుగా, అధ్యక్షురాండ్రుగా, రాయబారులుగా ఉన్నతోద్యోగులుగా సమర్థులనిపించుకొంటున్నారు. ప్రస్తుత పరిస్థితులలో స్త్రీలనుండి భారతదేశము అపేక్షించేదేమిటి? స్త్రీ ఆదర్శమాత! సంఘనిర్మాత! మన నాగరికత ఇదే! స్త్రీని ఒక భూషణముగా, అలంకారప్రాయముగా భావించటము గాని, గృహోపకరణముగా ఎంచుకోవటము గాని భారతదేశము అంగీకరించదు. సాంఘిక ఆర్థిక రాజకీయరంగాలలో స్త్రీ పురుషునికి తోడునీడయి, జీవితంలో కష్టసుఖాలలో భాగస్వామినిగా, భావింపబడుతున్నది. భారత స్త్రీ భర్తకు సహధర్మచారిణి—అర్థాంగి!

మనదేశములో కూడా విద్యాప్రచారము ఎక్కువగా ఉన్న పట్టణాలలో బాలుర విద్యాసంస్థలలో విద్యాభ్యాసముచేసే బాలికల సంఖ్య తక్కువ. వారయినా ప్రత్యేక విద్యాసంస్థలు అందుబాటులో లేకనే పంపబడుతున్నారు. అటువంటి పరిస్థితులలో బాలికలు దూరదూరముగా తిరగటము గాని అతిస్వేచ్ఛగా తిరగటముగాని సంభవిస్తున్నది. ఈ స్థితిలో సహవిద్యావిధానమువల్ల పొందజూచిన లాభాలను పొందక పోగా ప్రత్యేకకళాశాలలవల్ల కలిగే లాభాలనయినా పొందలేకపోవటము సంభవించుచున్నది.

భారతదేశములో అనుభవజ్ఞులైన విద్యావేత్తల అభిప్రాయము సహవిద్యా విధానానికి ప్రతికూలముగా ఉన్నది. విద్యార్థినులకు సంబంధించినంతవరకూ కూడా అభిప్రాయము వ్యతిరేకముగానే ఉన్నది. 'మాకు ప్రత్యేక కళాశాల కావలె' నని బరోడా యూనివర్సిటీ కమిషనుకు విద్యార్థినులు విజ్ఞప్తి చేశారు. అలహాబాదు, బనారసు యూనివర్సిటీల విద్యార్థినులు కూడా బరోడా సోదరీమణులతో ఏకీభవిస్తున్నారు. అఖిలభారత మహిళాసభ కూడా 1934 డిసెంబరులో జరిగిన సమావేశములో ఉన్నత తరగతులలో బాలికలకు సహవిద్యావిధానాన్ని చర్చించి కొన్ని షరతులను నిర్ణయించింది. స్త్రీ విద్యలో ముందడుగు వేసిన కొచ్చిను సంస్థానము కూడా సహవిద్యా విధానానికి ప్రతికూలముగానే ఉన్నది. 1934 విద్యాకమిటీ నివేదిక సెకండరీ పాఠశాలలలో సహవిద్యా విధానానికి వ్యతిరేకాభిప్రాయాన్ని ప్రకటించింది. 'భారతదేశపు పరిస్థితులకు సహవిద్యా విధానము అవసరమా - కాదా' అని తేల్చుకోవటానికి భారతదేశపు ఇంటర్ యూనివర్సిటీ బోర్డు యూనివర్సిటీల అభిప్రాయాన్ని అర్థించింది. 'భారతదేశపు పరిస్థితులకు అనుకూలము ఆచరణయోగ్యము అయినది బిడ్డలకు 10 సంవత్సరముల వరకే సహవిద్యా విధానము ఉండవలెననీ, ఆతరువాత సెకండరీ స్టేజిలో నేకాదు. ఇంటర్ మీడియేట్ స్టేజిలోకూడా ప్రత్యేక విద్యాసంస్థల అవసరము ఉన్నదనీ, అన్ని యూనివర్సిటీలు ఏకాభిప్రాయం వ్యక్తీకరించాయి. ఈ విధముగా సహవిద్యా విధానములో ఉన్న కష్టనష్టాలను గురించి సమగ

మూలం:
రవీంద్రనాధ మైత్రా

# చంపా

అనువాదం:
యం. మంగతాయారు

## 1

చంపా అని ఎవరు పేరు పెట్టారో గాని వాళ్లు ఏమాత్రం పొరపడలా. సంపెంగ పువ్వు రంగుకి ఆమె శరీర చ్ఛాయకి సరిగ్గా సరిపోతుంది. రవ్వంతైనా తేడా లేదు. కానీ చంపాకి లోటల్లా అదృష్టం ఒక్కటే. ఆమెకు పదేళ్లప్పుడు గోపాలగోసాయితో పెళ్ళయింది. పదమూడో యేట విధవ అయింది. అప్పటికింకా ఆమె తల్లి బతికేఉంది. ముసలావిడ చంపాకి మళ్ళీ పెళ్ళి చెయ్యాలనుకున్నది. కానీ...పిల్ల ఒప్పుకోలేదు. అతరువాత తల్లి చనిపోయింది. సరే; చంపాగూడ ఏవిధమైన తత్తరపాటూ లేకుండా రోజులు గడుపుతున్నది. అప్పటి కామె ఇరవై ఏళ్లదైంది.

ఏవిధమైన ఒడుదుడుకులు లేకుండా రోజులన్నీ ఒకేతీరుగా గడిపిందని చెప్పడం కొంత అసత్యంతో కూడినదే. ఆమె రూపాన్ని అర్థించే పూజారులకేం కొరత లేదు. నందూ అహీర్ మొదలుకొని, ధిదామీ గోసాయి వరకు అందరూ ఒక మాటో అరమాటో ఆమె కృపను అర్థించిన వారై చెడ్డ చివాట్లు తిని మనస్సు చిన్న పుచ్చుకుని ఊరుకున్నారు. పెళ్లి చేసుకోమనటం సంగతి అలా ఉంచి ఇప్పుడైతే ఎవ్వరూ ఆమె చాయలకు గూడ రారు. ఎందువల్లనగా— మొదటి విషయం— చంపాకి ధర్మపితయైన గ్రామపు జమీందారు భూపాలసింహుడంటే భయం, ఆపైన చంపా యొక్క చివాట్లు ఈ రెండు పాణిగ్రహణార్థుల ఆగడంనుంచి చంపాని కాపాడుతున్నయ్.

చంపాకి కొద్ది కొద్దిగా చదవనూ వ్రాయనూ వచ్చును. గ్రామంలో ఉన్న ప్రయిమరీ స్కూల్లో చదివిన చదువునే ఎడతెరిపి లేకుండా రామాయణ మహాభారతాలని చదవటంలో వినియోగించి వృద్ధి చేసుకున్నది. చంపా రోజూ చీకటితో లేచి మరమరాలు వేయించి రూపగామ్ బజారులో అమ్మడానికి వెడుతుంది. అవి అమ్మి సాయంకాలానికి యింటికి తిరిగి వస్తుంది. ఆ తరువాత తన సావాసకత్తె అయిన జమీందారుగారి యింటి పనిమనిషి ముసల్ది, లఖియాని శ్రోతగా పెట్టి తను భారతం చదవటానికి కూర్చుంటుంది. ఇదీ – ఆమె దినచర్య. ఆమెకి అందులోనే ఆనందం.

## 2

ఆ రోజు శ్రావణ మాసపు మేఘాలు అలుముకుంటున్నాయి. చంపా త్వరత్వరగా మరమరాలు అమ్ముకుని యింటికి తిరిగి వచ్చినది. ఇంటి ముంగిట్లో ఉన్న వేపచెట్టు నీడ వల్ల చీకటి చీకటిగా ఉన్నది. ముంగిట్లో అడుగు పెడుతూనే చంపా అదిరిపడింది: చూస్తే ఎవరో వసారాలో పడుకుని నిద్రపోతున్నట్టున్నారు. గుయ్యారంగా ఉండటంచేత సరిగ్గా కనబడటం లేదు.

ఎవరక్కడ? అని ఆమె అడిగింది.

జవాబు లేదు.

చంపా మరమరాల సంచి అక్కడ పెట్టి లోపలికి వెళ్ళి దీపం వెలిగించింది. చేతిలో దీపం పట్టుకుని బయటికి వచ్చింది.

ఆ పడుకున్నవాడు నిద్రపోతున్నాడు. చంపా ఇంతకుపూర్వ మెప్పుడూ అతన్ని చూసినట్టు లేదు.

ఇరవై ఇరవైరెండేళ్ళ యువకుడు, కళ్లు మూసుకుని పడుకున్నాడు. చంపా అతని దగ్గరగా వెళ్లి - ఎవరు నీవు? అని మళ్ళీ అడిగింది.

యువకుడు కళ్లు తెరిచాడు.

'మంచినీళ్లు' అన్నాడు.

ఎవరు నువ్వు? ఏమిటి నీబాధ? అని చంపా అడిగింది.

యువకుని గొంతు ఆరిపోయింది.

మంచినీళ్లు, దాహం అన్నాడు.

ఈ ఆగంతుకుడు అస్వస్థతగా ఉన్న సంగతిని చంపా గ్రహించింది. లోటాతో నీళ్లు తెచ్చి త్రాగించింది. వొళ్ళు పట్టిచూసింది. తావాలాగా మాడిపోతూంది. మహా తీవ్రంగా ఉంది జ్వరం.

ఎవరు నువ్వు? ఇక్కడికెలా వచ్చావ్? అన్నది.

అప్పుడు యువకుడు చెప్పినదానికి సంక్షిప్త సారాంశ మేమంటే - తన పేరు బన్వారీ అని, మహేశపుర్ వెడుతూండగా దోవలో జ్వరం వచ్చిందని, ఇక వెళ్ళలేక పోవటంవల్ల ఇక్కడ పండుకున్నానని, జ్వరం జారగానే వెళ్లిపోతానని—

మహేశపుర్ రూపగామ్‌కి రెండుకోసుల దూరంలో ఉన్నది.

అక్కడ మీవాళ్లెవరైనా ఉన్నారా? మనిషిని పంపించి పిలిపించనా? అన్నది చంపా.

ఎవ్వరూ లేరు. దేవాలయం చూద్దామని వెడుతున్నా నన్నాడు యువకుడు.

అయితే ఇక్కడ నిన్ను కనిపెట్టి ఎవరు చూస్తారు? అసలు వచ్చింది ఎక్కడినుంచి నువ్వు? అన్నది చంపా కొంచెం గాబరా పడుతూ.

కనిపెట్టి చూడాల్సినంత అవసరమేమీ లేదు. జ్వరం జారగానే నే వెళ్లిపోతాను. నువ్విక వెళ్ళు—అన్నాడు. ఆ స్వరం కొంచెం కటువుగా ఉండటంచేత చంపాకి చివుక్కుమన్నది. ఆమె ఇంకేం అడగలేదు. తలవైపున లోటాలో నీళ్లు పెట్టి దాహం వేస్తే త్రాగమని చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

రాత్రి దాదాపు తొమ్మిదైయుంటుంది. చంపా అప్పుడే బయటకు వచ్చింది. బన్వారీ

(30-వ పేజీ చూడండి)

---


మైన చర్చలు జరిగిన తరువాత బహుజనాభిప్రాయము మధ్యకాలములో తప్ప ప్రాథమిక, కళాశాలలలో సహవిద్యావిధానము ఉండవలె నన్నట్టే తేలింది.

పాశ్చాత్య విద్యావేత్తలు ప్రచురించిన గ్రంథాలలోను ఆధునిక భారతీయ విద్యావేత్తలు వ్రాసిన గ్రంథాలలోను సహవిద్యావిధానాన్ని గురించి సమగ్రముగా చర్చింపబడ్డది.


ఎవరు ఎన్ని చర్చలు చేసినా, 'మన స్తత్వదృష్ట్యా దేహపరిణామదృష్ట్యా, తరుణావస్థలో ఉన్న బాలబాలికలను ఒకచోట చేర్చి, సహవిద్యా విధానములో విద్యాబోధ చేయుటము లాభదాయకమా? 1934, 1940 సంవత్సరాలనాటి నివేదికలను ఆధారముగా చేసుకొని కాకుండా - ప్రత్యక్షముగా కనబడే సాంఘికదృష్ట్యా తలిదండ్రుల అభిప్రాయా లేమిటి? ముఖ్యముగా తల్లి అభిప్రాయ మేమిటి?' అని ఆలోచించవలసి ఉన్నది. మన దేశములో ఉన్న తల్లులందరి అభిప్రాయాలనూ సేకరించి మహిళాసంస్థలు చర్చించి నిర్ణయానికి రావలసిన సమయము ఇది. రెండవ పంచవర్ష ప్రణాళికా రచన ఇంకా చిత్తులోనే ఉన్నది కనుక స్త్రీలు తమతమ అభిప్రాయాలను ప్రకటించటము అవసరము.

(ఈ వ్యాసము వ్రాయటములో తోడ్పడిన గ్రంథము *School Organisation and Management By M. Sultan Mohiyuddin M. A. L. L. B., M. Ed. & M. Sidda Lingayya M. A. BT Phd.*)

★



బొంబాయి దృశ్యం



ఫొటో : పి. సి. ఎమ్. ఈశ్వరబాబు—మద్రాసు.

జ్వరఉద్ధృతంచేత ఏవేవో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. కానీ— చంపా ఇదేం చూడకుండా—ఇంత జ్వరంలో ఉన్నప్పుడు ఒకమనిషిని బయట పడేసిఉంచట మెలా? అయినా ఒక అపరిచితుడైన యువకునికి ఇంట్లో చోటెలా ఇవ్వడం? అని పరిపరివిధాల ఆలోచిస్తూ నిలబడింది. ఇంతలో లక్షియా వచ్చింది. ఇదంతా గమనించి-అయితే ఏం చేస్తావ్? భగవంతుడు సృష్టించిన ప్రాణి. ఇక్కడ పడేసిఉంచటం మంచిది కాదు. బాధ పడతాడు. బయట గుమ్మందగ్గర పక్క వేయ్, పాపం ఎవరి బిడ్డడో యేమో—అన్నది.

ఇదే బావున్నట్టు తోచింది. పక్క పరిచి యిద్దరూ బన్వారీని లేవదీసి ద్వారందగ్గర పడుకోబెట్టారు. రాత్రంతా చంపా నుదుటి మీద తడిగుడ్డ వేస్తూ, విసనకర్రతో విసురుతూనే కూర్చుంది. కానీ నిద్రతో కునికిపాట్లు పడుతూ పడుతూ ఎప్పుడో తెలియకుండా నిద్రపోయింది. తీరా చూసేసరికి తెల్లవారిపోయింది.

ఇక ఆరోజు మరమరాలు వేయించలేకపోయింది.

## 3

ఆ రోజు కూడ జ్వరం పట్టిన పట్టు వదల్లేదు. రెండుజాముల వేళ జ్వరోద్రేకంలో బన్వారీ ఆమె చెయ్యి పట్టుకుని - నువ్వు నాకు చాలా సేవచేశావ్ కాని నే బ్రతికను. అనేప్పటికల్లా మొదట చంపాకు కొంచెం బాధ అనిపించింది. కళ్లవెంట కూడ వాటంతటవే నీళ్లు జలజలరాలాయ్. మళ్లీ క్షణంలో తన కష్టాల్ని ఇబ్బందుల్ని మర్చిపోయి గాబరా పడతావెందుకు? నయమైపోతుందిగా - నువ్వు పడుకో నేను వెళ్ళి వైద్యుణ్ణి పిలుచుకు వస్తానన్నది.

అయిదురోజులవరకు తన వ్యాపారాన్ని కట్టిపెట్టి చంపా అంతులేని శ్రమపడి బన్వారీకి ఉపచారం చేసింది. ఆ రోజు సుమారు మూడు గంటలప్పుడు డాక్టరు సుఖనందన్ వచ్చి మందిచ్చి పథ్యంసంగతి చెప్పి వెళ్ళారు.

ఆమాట వినటంతోనే ఆమె కళ్ళలోంచి ఆనందాశ్రువులు రాలాయ్. బన్వారీ తన చేతిలోనికి - ఆమె చెయ్యి తీసుకుని - ఏడుస్తా వెందుకు? నాకు నయమైపోయిందిగా...అన్నాడు. చంపా చెయ్యి విడిపించుకుని పథ్యం తీసుకురావటానికి వెళ్లింది.

పథ్యం తిన్నతరువాత, - బన్వారీ - నువ్వు నాకోసం చేసినదానికి నేను నీఋణం ఎప్పటికీ తీర్చుకోలేను. కాని భగవంతుడు ఎప్పటికైనా ఆ రోజనేది చూపిస్తే... అన్నాడు.

సరే! ఇప్పుడు ఆ మాటలన్నీ అలా ఉండనీ లెద్దూ. వారంరోజులనుంచీ దుకాణం మూయబడిఉంది. ఇవాళైనా వెళ్లి తెరవాలి. నువ్వు బయటి కెక్కడికీ వెళ్ళవద్దు. ఇంట్లోనే ఉండాలి సుమా? ఇదిగో మందు-అని పొట్లం చేతిలో పెట్టి, దీన్ని మధ్యాహ్నం తులసిఆకు పసరుతో పుచ్చుకోవాలి. నేను స్నానంచేసి తులసిదళాలు తెస్తా సరేనా? అన్నది చంపా.

ఈ బీదరాలి సంపాదన పడుండి తిని కూర్చోటం ఏమైనా బాగుందా? అని బన్వారీ ఆరోజల్లా ఏదో ఆలోచిస్తూనే ఉన్నాడు.

సాయంత్రం చంపా వచ్చి - జ్వరం రాలేదుగదా అనడిగింది. 'లేదులే' అని బన్వారీ మళ్ళీ నేనిక వెళ్ళిపోదామనుకుంటున్నానన్నాడు.

చంపా ముఖం గంభీరంగా మారిపోయింది. బన్వారీ చీకట్లో ఆమె ముఖం గమనించలేకపోయాడు. తరువాత కొంచెం సేపు నిశ్శబ్దం.

సరే! వెళ్లు. నన్నడగటమెందుకు అన్నది చంపా.

ఆ మాట అనుమతించినట్టుగా లేదు. బన్వారీ మెదలకుండా ఊరుకున్నాడు.

జాము రాత్రి గడిచాక చంపా సగ్గుబియ్యం జావ తీసుకువచ్చింది. అప్పటికీ గూడ ఆమె ముఖంలోని గాంభీర్యం తగ్గలేదు.

బన్వారీ ఒక్క గుక్కలో ఆ గిన్నెడు ఖాళీచేసి—ఇదిగో చూడు. నువ్వేమో బీదదానివి. ఎన్ని రోజులు నన్నిలా పోషిస్తావ్? అందువల్లే నే వెడతానంటున్నాను. ఇప్పుడు కులాసాగానే ఉన్నాగదా. వెళ్ళగలుగుతానన్నాడు.

చంపా ఒక్కసారి బన్వారీ ముఖంలోకి చూసింది. సందేహం లేదు. ఇప్పుడతనికి వెళ్లిపోవలసిందే. కాని ఈ అసహాయుడైన అతిథికోసం చంపా హృదయంలో ఏ మూలనో నలుసంత మమత్వం కూడుకొని ఉన్నది. కావటంచేతనే 'వెళ్ళమని చెప్పటానికి నోరు రావటంలేదు. బాగా పర్యాలోచించి రొట్టె తినడం మొదలెట్టిన తిరువాత వెడుదువుగాని అన్నది. సరేనని బన్వారీ మంచంమీద నడుం వాల్చాడు.

## 4

ఇవాళ సాయంత్రం అన్నం తింటానని బన్వారీ ఆరోజు మొండిపట్టు పట్టాడు. 'వద్దు, అంటే ఏమైనా అనుకుంటాడేమో' ననే భయంచేత చంపా, సరే, అన్నది. కాని ఆమె కళవళిక మారిపోయింది. రోజల్లా ఆమె బన్వారీతో మాటాడలా పలుకాడలా' ఇందుకు బన్వారీ బాధపడ్డాడు. కొద్దిరోజులుగా తెంపులేకుండా నారీ సహవాసంలో ఉండటంచేత ఆడవాళ్ళ మనస్తత్వాన్ని గురించి అతనికి కొద్దిగా పరిచయం ఏర్పడింది.

సాయంత్రం పొయ్యి రాజేసి చంపా ఎసరుపెడుతూనే ఉన్నది. ఇంతలో ఒక

వైష్ణవభిక్షుకుడు వాకిట్లోంచి గీనస్వరంతో - అమ్మా పప్పుకు బియ్యం వెయ్యమ్మా! ఇవాళ ఏకాదశి - ఏకాదశి. అన్న మాటలు వినపడటంతోనే చంపాకు హృదయంలోని బరువు సడలిపోయింది. బన్వారీ వేపు తిరిగి ఇవాళ ఏకాదశి అన్నమాట మర్చిపోయాను సుమా - అన్నది.

బన్వారీ ప్రొద్దుటినుంచి చంపాయొక్క భావభంగిమను చూస్తూనే ఉండటంచేత ఆమె అన్న మాటకు అర్థం అతను సులభంగా తెల్సుకోగలిగాడు.

అయితే సరే ఇవాళ అన్నం తినను. రేపు చూద్దాం అన్నాడు.

చంపా ముఖం విప్పారింది.

పుల్కాలు చేసి పెడతాను. పాలు త్రాగు సరేనా?

బన్వారీ కేవలం అమాయకపు పిల్లవాడి లాగా - ఊఁ అవే తింటాలే - అన్నాడు.

వైష్ణవ భిక్షుకుడు ఆరోజు చంపాయింటి నుంచి మూడు రోజులకు సరిపడా స్వయం పాకం తీసికెళ్ళాడు. మర్నాడు సాయంకాలం బన్వారీ ఇక అన్నం తింటానని పట్టు పట్టలేదు. బజారుకు వెడుతున్నప్పుడు మాత్రం చంపాని ఒక దస్తా రంగు కాగితాలు తెమ్మని చెప్పాడు. రాత్రికి కాగితాలకట్ట చేతితో పట్టుకుని చంపా వచ్చి - ఇవాళ ఏం తింటావ్ అని అడిగింది.

ఈ ప్రశ్నకి సమాధానం బన్వారీ చాలా సేపటి క్రితమే ఆలోచించి పెట్టాడు కాబట్టి ఉహుఁ ఈ మూడు నాలుగు రోజులుగూడ గడిచిపోనీ - పౌర్ణమి తరువాత తింటానన్నాడు.

చంపాకి చాలా సంతోషం కలిగింది. ప్రొద్దున్నే లేచి చూసేప్పటికి వాళ్ల యింటి వరండాలో కాగితాలతో చేసిన పదో ఎనిమిదో పంజరాలు పెట్టి ఉన్నయ్. వాటి లోపల రకరకాల కాగితపు చిలకలు కూర్చుని ఉన్నయ్. చిలకల్ని తయారు చేసే నేర్పరితనాన్ని చూచి చంపా ఆశ్చర్య చకితురాలైంది. కాస్త పొద్దెక్కాక బన్వారీ కళ్లు నులుపుకుంటూ వాకిట్లోకి వచ్చాడు.

రాత్రంతా ఇవే చూస్తూ కూర్చున్నావా యేం? మళ్లీ ఒకవేళ జ్వరం వస్తే ఎవరు చూస్తారో చెప్పు పోనీ... అన్నది చంపా అతనిని.

బన్వారీ ఆమెమాటకేమీ సమాధానం చెప్పకుండా - నువ్వు బజారు వెడతావు గదా - వెళ్లేటప్పుడు వీటిని తీసుకు వెళ్లన్నాడు. ఏంచేయాలి వాటిని? అన్నది చంపా..

అమ్మే. అయిదారణాలువస్తే అవే చాలు. 'ఊరికే కూర్చోటం మంచిదా!' అన్నాడు బన్వారీ.

ఇందుకే రాత్రంతా జాగారంచేసి ఈ సంబరం చేశావుగాబోలు. మళ్లీ జబ్బుపడితే అనుభవించేదెవరు? ఇవన్నీ మోసే దెవరు? ఒక్కత్తిని మరమరాలే అమ్మనా నేను నీ బొమ్మలనే పెట్టుకు కూర్చోనా? అన్నది చంపా.

బన్వారీ మౌనం.

రెండుజాముల వేళ పంజరాలన్నిటిని పురికొసతాడుతో కట్టి బన్వారీ ఎక్కడికో బయల్దేరటం చంపా కనిపెట్టింది. ఆమెకు ప్రొద్దుటిసంగతి జ్ఞాపకానికి వచ్చింది. వెంటనే లేచివెళ్లి ఆమె బన్వారీకి ఎదురుగా నిలబడింది. 'నువ్వు వెళ్లటానికి వీల్లేదు. ఇప్పుడే రెండురోజులైంది. కాస్త అన్నమంటూ కడుపులోకి పోతోంది. అప్పుడే బయల్దేరాడు బజారుకి పిడుగల్లే. ఇల్లాంటి మనిషిని నేనెక్కడా చూడలా.

ఇయ్యి నాచేతి కియ్యి అన్నది.

బన్వారీ మెల్లిగా తాడు అందించి - జాగ్రత్తగా పట్టుకువెళ్లు. పెద్ద గాలితగులుతే చిరిగిపోతాయ్. అన్నాడు.

చంపా తలమీద మరమరాల సంచీ పెట్టుకుని, చేతికి పంజరాలను వ్రేలాడ వేసుకుని వెళ్ళింది.

సాయంత్రం బజారునుండి చంపా తిరిగి వచ్చి - నవ్వుతూ ఇదిగో తీసుకోండి మీ పంజరాల పైకం. రెండు రూపాయ లారణాలు...అన్నది.

బన్వారీ చెయ్యి తొలగిస్తూ - ఉంచు నీదగ్గర అన్నాడు.

నీ సొమ్ము నువ్వు...అన్నది చంపా.

బన్వారీ మధ్యలోనే ఆపి నిస్సంకోచంగా ఆమె కొంగున ముడివేస్తూ - నువ్వు కనుక నన్ను బతికించకపోతే ఈ పంజరాలను చేసే దెవరు చంపా అన్నాడు.

చంపా ఒక్కసారి కళ్లారా బన్వారీని చూసింది. తరువాత వంటచేసుకోడానికి వెళ్ళిపోయింది.

మర్నాటినుంచి బన్వారీ మంచి ఉత్సాహంతో కాగితాల పువ్వులు ఆకులు పక్షులు వగైరా చెయ్యటం మొదలెట్టాడు. చంపా గూడ తీరిక ఉన్న వేళలలో అతని పనిలో సహాయపడుతూండేది. ఈవిధంగా కొద్ది రోజులు గడిచాయ్.

ఒకరోజున బన్వారీ — అయితే ఒక కొట్టు అద్దెకు తీసుకుంటే ఎలా వుంటుందో! దాంట్లో ఒకపక్కన మరమరాలు శనగలు గుగ్గిళ్ళు గూడ ఉంటాయ్. ఇంకోపక్క పువ్వులు ఆకులు పక్షులు గూడ అమ్మబడతాయ్. పగలంతా అక్కడే కూర్చుని పని చేసుకుంటాము అన్నాడు.

చంపాగూడ ఉత్సాహంతో - అయితే చాలా బావుంటుంది. సరేగానీ...నీకూ - అమ్మటం చేతనవునా కాదా? ఎందుకంటే మోసం చెయ్యటానికి వచ్చేవాళ్లు కూడ చాలామంది ఉంటూంటారుగా - అన్నది.

నువ్వు ధరలు మాత్రం చెప్పు. తూనిక రాళ్లు త్రాసు సరిగ్గా పెట్టు చాలు - ఆపైన మిగతాదంతా చేస్తానన్నాడు బన్వారీ.

ఆ తరువాత దుకాణంలో ఇంకా ఏమేమి పెట్టాలి అనే విషయంమీద రాత్రి ప్రొద్దుపోయేదాకా ఇద్దరికీ సంభాషణ జరుగుతూనే ఉంది. పొరుగున ఉన్న మున్నీ దుకాణం లాంటిది పెట్టుకోవాలని చంపాకి ఎన్నో రోజులనుంచీ కోరిక. కాని ఒక్కత్తె



రెక్సోనా అందాలరాణి కుమారి మీనా పెరుంటా మద్రాసు వుడ్‌లాండ్ హోటలులో 24 వ తేదీన రెక్సోనా సౌందర్య పోటీలో ప్రథమ బహుమతిని పంచుకున్న వారిలో ఒకరైన శ్రీ ఆంథోనీ ధాచిన్‌కు రు 10,000 చెక్కును బహూకరించింది.

## ★ చంపా ★

కల్ల కావటం కష్టం. అందువల్లనే ఆమె దాన్ని కార్యరూపంలో పెట్టలేకపోయింది. ఏనాటికో ఈనాడు సఫలమౌతూంది.

పటం చూసి చంపా అమిత ఉత్సాహంగా ఉంది. ఉత్సాహోద్రేకంలో రాత్రంతా ఆమెకు నిద్రపట్టలేదు. ఆలోచిస్తూ ఆలోచిస్తూ ఎంతదూరం వెళ్ళిందంటే - ఒకటి రెండేళ్లలో తన కొట్టుగూడా చిల్లర దుకాణంగా అయిపోయేంతవరకూ ఆలోచించింది.

చంపా ఒక కొట్టు అద్దెకు తీసుకున్నది.

అయిదున్నర రూపాయలు అద్దె అన్న సంగతి విని మొదట్లో ఆమె కొంచెం బేజారైంది. బన్వారీ ఆమెను ఓదారుస్తూ అయిదున్నర అంటే ఒక్క రోజు సంపాదనన్న మాట చంపా.

దసరాల్లో ఒక్క రోజున కనక కాగితపు ఏనుగు పడవ అమ్మేమా అంటే సంవత్సరం బాడుగా సంపాయించామన్నమాటే. అన్నాడు.

అప్పుడు చంపా కొంటె చూపుతో బన్వారీని బహూకరించింది. రకరకాల కాగితాలతో రెండురోజుల్లోనే బన్వారీ దుకాణాన్ని చూడ ముచ్చటగా అలంకరించాడు. ఆ కొట్టు సింగారం పూర్తయినతరువాత చంపాతోకూడ ఒకళ్లిద్దరు స్నేహితురాళ్లు సాయంకాలం దుకాణం చూడటానికి వచ్చారు. ఎంత చక్కగా అలంకరించబడిందో! దుకాణంనిండా వేలకొలది రంగురంగుల చిలకలు వచ్చి కూర్చున్నట్లుంది. ఆవెనుక శిల్పకారుని ప్రశంసించి మున్నోకామె చంపా చెవిలో ఇలా అన్నది బలే అదృష్టవంతురాలివే చంపా! చూడు నిర్లక్ష్యంచేసి ఎడబాటు తెచ్చుకోకేఁ?

సిగ్గుతో చంపాముఖం జేవురించింది.

ఆరోజు సంతనుంచి తిరిగి వచ్చేప్పటికి రాత్రయింది. వచ్చేటప్పుడు దోవలో పురోహితుడితో దుకాణం తెరిచేందుకు మంచి ముహూర్తంకూడ పెట్టించి మరీ వచ్చింది. ఖాళీసంచుల్లో రెండున్నర సేర్ల పాత కాగితాలు తుక్కుగూడ తీసుకొచ్చింది.

ఈ కాగితాలతో ఏం చేస్తావ్ చంపా అన్నాడు బన్వారీ.

పొట్లాలు కట్టాలిగా—అంతకూ ధోవతుల్లో మూటకట్టుకు నేం పోరు—అన్నది చంపా.

ఇయ్యి నాకియ్యి ఈ రాత్రే కట్టేస్తానన్నాడు బన్వారీ చెయ్యి జాపి.

పగలల్లా కష్టపడి పనిచేస్తివి. ఇప్పుడింకా రాత్రికూడ జాగారం చేద్దామనుకున్నావా? బలే ఆసక్తుడవే. అని చంపా తొందరగా తన గదిలో దూరింది.

భోజనాలైన తరువాత చంపా తన గదిలో పొట్లాలు కట్టడానికిగాను కాగితాలు కత్తిరిస్తూ కూర్చుంది. రేపు దుకాణంలోకి మరికొన్ని సామానులు జమ చేసుకోవలసినవి ఉన్నయ్. చంపా చేతులంటే కాగితాలు కత్తిరించటంలో నిమగ్నమై ఉన్నాయి గాని మనస్సు మాత్రం తన మరమరాల కొట్టుదగ్గరనుంచి పచారుకొట్టువరకు పరుగులెత్తుతూంది.

"బన్వారీ బాగా లావుగా ఆరోగ్యంగా వున్నాడు. ఎర్రని బెండుగల లావాటి ఖాతా పుస్తకంలో పెద్దపెద్ద మొత్తాలు వ్రాస్తున్నాడు. దుకాణానికి ఎదురుగుండా రోడ్డుఅంచు వెంబడే ఎంతోమంది కొనుక్కునేందుకు వచ్చినవాళ్లు నిలబడి నిలబడి వస్తువులు కొనుక్కుంటున్నారు..." చంపా యేమో—దుకాణానికి వెనకాతల లతలతో అల్లుకున్న పొదరింటి వాకిట్లో కూర్చొని బంగారు తీగతో మెలిచిన తులసిపూసల మాలతో జపం చేసుకుంటూన్నట్టుగా ఆమెకిదంతా స్పష్టంగా కనిపించింది.

ఇంతేకాదు - ఇంకా ఎన్నో ఎన్నెన్నో రకాల సుఖస్వప్నాలలో శరత్కాలంలోని మేఘాల్లాగ ఆమె మనస్సుమీంచి దొర్లిపోతున్నాయి - వాటికి లెక్కలేదు.

ఉన్నట్టే ఉండి - ఒక్కసారి చంపా త్రుళ్ళిపడింది. బన్వారీ ఫోటో! పేపర్లో బన్వారీ ఫోటో ఎందుకు ముద్రించబడింది. తొందర తొందరగా దీపందగ్గరికి తీసుకువెళ్లి చంపా ఆ ఫోటోక్రింద ఉన్న పంక్తుల మీద దృష్టి ఆనించింది.

కన్నుమూసి తెరిచేలోగా ఎక్కడినుంచో చీకటివరద వచ్చి ఆమె దుకాణాన్ని ఇల్లు వాకిళ్లు అన్నింటిని ముంచిపోయింది. మిగిలిందల్లా బన్వారీ ఫోటో - అక్షరాల పంక్తులు - ఒంటరిగా చంపా మాత్రమే.

మరుక్షణంలో రెండు చేతులతో గుండె అదిమి పట్టుకుని ఒక్క పెద్ద నిట్టూర్పు విడిచింది. నోటివెంట 'అయ్యో' అని మాత్రం వెలువడింది.

పేపర్లో ప్రకటనలు వేసే కాలమ్‌లో బన్వారీ ఫోటో ఉన్నది. దానిక్రింద ఇలా వ్రాయబడి ఉన్నది-ఏమనంటే "నా సోదరుడు చిరంజీవి బన్వారీలాల్ శ్రీవాస్తవ్ నేటికి ఆరు నెలలనుంచీ కనబడటం లేదు... అమ్మ నాకోసం అన్నం. నీళ్లు విడిచిపెట్టినది. ఆమె జీవించే ఆశకూడ కనబడటం లేదు. చిరంజీవి బన్వారీ చిన్నమాటమీద కోపం వచ్చి ఇంటినుంచి వెళ్ళిపోయాడు. ఇంతవరకూ తిరిగి రాలేదు. రంగు చామన ఛాయ. ఎత్తు - పొట్టి పొడుగు కాకుండా మధ్యరకం. నొంటి మీద వారల నొక్కు ఉంటుంది. ఆనవాళ్లు తెలిసిన సజ్జనులకు అయిదువందల రూపాయలు బహుమానం ఇవ్వబడును.

కన్హైలాల్ శ్రీవాస్తవ్.

రాత్రి పూర్తికావటానికి ఘడియో అరఘడియో ఆలస్యం ఉంది. చంపా అంతవరకూ ఎదురుగుండా కాగితాలు కుప్పపోసుకుని స్వప్నావిష్టయై కూర్చునిఉంది. తెల్లారుతున్న కాకి కావుమనటం వినపడేప్పటికి ఉలిక్కిపడింది మాసే ఏముంది - తెలతెల వారుతూంది. చాలాసేపటివరకు అలాగే కూర్చుని ఏదో ఆలోచిస్తూనే వున్నది. ఆ తరువాత గోవిందపురం వెళ్ళింది. అక్కడ ఆమె మామయ్య కొడుకు దంపూ పోస్టాఫీసులో పని చేస్తున్నాడు.

బన్వారీ మొహం కడుక్కుని వసారాలో చాపేసుకుని కూర్చోబోతూండగా చంపా వచ్చింది. అప్పటికి తెల్లగా తెల్లవారింది. బన్వారీ ఆమె ముఖంవంక చూస్తూ ఏమిటి చంపా ఏమైంది - ఎందుకో చాలా ఉదాసీనంగా ఉన్నావ్, అన్నాడు.

చంపా పంటితో పెదవి నొక్కిపట్టి - 'ఏమీ లేదు' అని మరమరాలు వేయించుకోవాల నెపంతో బయటికి వెళ్లిపోయింది. తిరిగి సాయంకాలం దీపాలు పెట్టినతరువాత వచ్చింది.

ఆరోజు బన్వారీ కేవలంగా గడిపినా గడవలేదు. పగలంతా చాలా తత్తరబిత్తర లాడుతూ ఉన్నాడు. సాయంత్రం దోవలో చంపాకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. చంపారావటం చూశాక అతని మనస్సు మనస్సులోకి వచ్చింది

ఇవాళ నువ్వు పగలంతా కనిపించనే లేదు. అందువల్ల పగలంతా తిరుగుతూనే ఉన్నానన్నాడు.

ఆమాట వినేప్పటికి చంపాకి కళ్లనీళ్లు వచ్చాయ్. ఎల్లాగో తమాయించుకుని - ఇవాళ గోవిందపురం వెళ్ళాను - మరమరాలకి బియ్యం చూద్దామని అని జవాబు చెప్పింది అయితే ప్రొద్దుటనుంచి ఏమీ తినలేదన్నమాట. చేతులు కాళ్లు కడుక్కొని వచ్చి ముందు కాస్త తిను. రొట్టె పప్పు మూతపెట్టిఉంది. ఈలోపల నేనోకసారి దుకాణం చూసి వస్తానన్నాడు బన్వారీ.

బన్వారీ వెళ్ళాడు.

వసారాలో కొంగుపరచుకుని పడుకుంది చంపా. ఓగంటసేపైన తరువాత లేచి తులసెమ్మదగ్గర దీపం పెట్టింది. ఆపైన రొట్టె తినడానికి కూర్చుంది. బన్వారీ స్వయంగా ఆమెకోసం రొట్టెలు చేసి పెట్టాడు.

# ★ చంపా ★

భగవంతుడు ఎంత పరిహసిస్తున్నాడు! మొదటి ముద్ద తినడానికి నోటిదాకా తీసుకెళ్ళింది. అంతే వెక్కి వెక్కి ఏడవటం మొదలెట్టింది. అప్పుడే ఆ కంచం కప్పెట్టి లేచి వెళ్ళింది. ఇక ఆ రోజు చంపా ఏమీ తిన లేకపోయింది.

ఇప్పటికి చాలా రోజులనుంచి చంపా ఇంత ఉదాసీనంగానూ, ఇంత గంభీరంగానూ ఉండటానికి కారణమేమిటో బన్వారీ తెల్సుకోలేకపోయాడు. నాలుగు రోజులైన తరువాత—ఒకనాడు అప్పుడే భోజనాలై కూర్చున్నారు. దుకాణానికి ముహూర్తంగడా పద. అనుకున్నది కానీ అన్నాడు బన్వారీ. చంపా ఏదో అందామనుకుని ఆగిపోయింది. ఆతరువాత కొంతసేపు మెదలకుండా ఊరుకుని ఇవాళ వద్దులెమ్మా—అన్నది.

ఏం? దసరా దగ్గిరకి వచ్చింది. ఇప్పటినుంచి చక్కబెట్టుకోబోతే అప్పటికల్లా? కొనుక్కునే వాళ్ళకి తెలియాలిగదా—ఇక్కడ దుకాణం ఉందని...?

చంపా తులసెమ్మదగ్గర గోమయంతో అలుకుతూన్నది. నిరాశతో, నిమ్మళంగా ఉఁ ఇప్పుడు దుకాణం ఒకటి తక్కువైంది. అన్నది. బన్వారీకి సరిగ్గా వినపడకపోవటం వ తిరిగి మళ్ళీ అడిగాడు. చంపా లేచి నిలబడి - దుకాణం సంగతి భగవంతుడికే తెలియాలి. ఇప్పుడు నన్ను నువ్వేమీ అడగవద్దు అన్నది.

బన్వారీకి ఈమాటకి అర్థం తెలీకపోయినా తన రెండో ప్రశ్నని మాత్రం లోపల్లోపలే మింగేసి ఊరుకున్నాడు.

సాయంకాలం చంపా తన గదికి ఎదురుగా ఉన్న వసారాలో కూర్చుని బొంత కుట్టుకుంటూంది. బన్వారీ బయట అరుగు మీద కాళ్లు వ్రేలాడేసుకుని కూర్చుని త్వరలో దుకాణం తెరిచే విషయంమీద రకరకాల యుక్తులు మాపిస్తూ అనర్గళంగా వాగుతున్నాడు. ఇంతలో ఎవరో బయటి గుమ్మందగ్గిరకి వచ్చి 'చంపాబాయి ఇంట్లో ఉన్నారా?' అని కేకేశారు. చంపా జవాబు పొందకుండానే - ఒక నడివయసులో ఉన్న పురుషుడు ఒక ముసలావిడతో ముంగిట్లోకి జొరబడ్డాడు. హఠాత్తుగా తల్లిని పోల్చుకుని చూచి బన్వారీ ఒక్కసారిగా ఉక్కిరిబిక్కిరయ్యాడు. ముసలి తల్లి బన్వారీని హృదయానికి హత్తుకుని రోదించటం మొదలెట్టింది.

చంపా నోటితో ఒక్క మాటగూడ మాట్లాడకుండా వసారాలో చాపమాత్రం వేసి చక్కాపోయింది. బయట బండి సిద్ధంగా ఉన్నది. వంట చేయాలనే వంకతో గిన్నెతో ఎసరుపెట్టి చంపా వంటింట్లోనే కూర్చుంది. సుడిగాలిలాగా విసురుగా బన్వారీ వంటింట్లోకివచ్చి సరే, నే వెడతాను. కానీ నువ్వు నా దగ్గర ఇంత పన్నాగం పన్నావేం? నాతో 'నువ్వు వెళ్లు' అని చెబితే నేనే వెళ్ళిపోయేవాణ్ణిగా అన్నాడు.

బన్వారీని చూడగానే చంపా లేచి పాదాలు తాకి నమస్కారం చేసి తప్పుకుని నిలబడింది. బన్వారీ ఆరోపించినదానికి జవాబుగా ఒక్క అక్షరంగూడ నోటివెంట రాలేదు. ఒక్కసారి మాత్రం అతని ముఖమంతా పూర్తిగా పారజూచింది.

కాని బన్వారీ ఆ సజలవ్యథాతురమైన దృష్టిని అర్థం చేసుకోలేక పోయాడు. ఐదు వందల రూపాయలకు ఆశపడి; — ఏం? అన్నాడు శ్లేషగా.

అన్నగారు తనకోసం అయిదువందల రూపాయలు బహుమానం యిస్తానని ప్రకటించిన సంగతి అతనికి తెలుసు.

బన్వారీ అనిన మాట వినేప్పటికి చంపా కళ్లవెంట నిప్పులు కురిశాయ్. ఏమిటో చెప్పాలనుకుంటూందామె. ఇంతలో - చంపా! మా తల్లి ఎక్కడున్నావమ్మా! అంటూ బన్వారీ తల్లి అక్కడికి వచ్చింది. 'భగవంతుడు నీకు అక్షయ వైకుంఠాన్ని ప్రసాదించుగాక' ఏం చెప్పను తల్లీ! ముసలిదాన్ని నువ్వు బతికించావ్ మా యమ్మా! బతికి ఉన్నంత కాలం నీ పేరు చెప్పి 'భగవంతుడికి తులసీదళం అర్పించుకుంటానమ్మా! ఇదిగో తీసుకో - ఏదో సంసారంలో అవసరం అంటూ కలుగుతూనే ఉంటుంది. దీన్ని ఉంచు. అని ముసలావిడ అనేకానేక ఆశీర్వాదాలిస్తూ చంపా చేతిలో చిన్న పొట్లం బలవంతాన పెట్టింది.

ఆతరువాత ఆ ముగ్గురు బండి ఎక్కారు. బండి వెళ్ళింది. చంపా ఆ వెడుతున్న బండివంక చాలా సేపటివరకూ రెప్పవాల్చకుండా చూస్తూ నిలబడింది. ఇంతలో పొరుగింటి మున్నీ పిల్లలు - మోతీ మానికలువచ్చి - 'చంపక్కా' అని పిలిచారు. చంపాయింటికి ఎవరొచ్చారో తెల్సుకోడానికని మున్నీ వాళ్ళిద్దర్నీ పంపించింది.

మానిక్ ని చూసేప్పటికి చంపాకి తెలివొచ్చింది. ఆమె ఒక పెదనిట్టూర్పు విడిచి - భగవంతుడా నువ్వే దిక్కు, అని వంటింట్లోకి వెళ్ళి లోపలినుంచీ తలుపు వేస్తుండగా చేతిలో ఉన్న పొట్లంపైన ఆమె దృష్టి పడింది. విప్పిచూస్తే అందులో వందరూపాయలనోట్లు అయిదు ఉన్నయ్. బహుమానం! ఏహ్యభావంతో చంపా పెదవి విరిచింది. కాస్త నువ్వు ఇక్కడే ఉండు మానిక్. నేను బండి ఎంతదూరం వెళ్లిందో చూసివస్తానన్నది. బండి అప్పుడే ఠాకూర్ గారితోటదాకా వెళ్లింది. ఇంతలో వెనకనుంచి ఎవరో పరుగెత్తుకుంటూ రొప్పుతూ వచ్చి - కొంచెం బండి ఆపండి అన్నారు.

కన్హైలాల్ వెనక్కి తిరిగి - ఎవరు? అన్నాడు.

నేను మానిక్ ని. ఇదిగో తీసుకోండి—చంపక్క ఈ పొట్లం తిప్పిపంపింది. అని చెప్పి ఆ పొట్లం బండిలో గిరవాటు వేసి - ఆపక్కన ఉన్న సన్న సందులోంచి పరిగెత్తాడు.

ఇందులో ఏముందన్నయ్యా అన్నాడు బన్వారీ.

అవే-అయిదు వందల రూపాయల నోట్లు. తిప్పి పంపించేసినట్టుంది - అన్నాడు కన్హాయ్

బన్వారీ కళ్లు క్షణంసేపు ఆశ్చర్యంతో పెద్దవై కన్నీళ్ళతో నిండిపోయినయ్.

చంపా ఈనాటికీగూడ నెత్తిమీద మరమరాల సంచి పెట్టుకుని అమ్ముతుంది. ఆ దుకాణానికామె తాళం పెట్టే ఉంచింది. కాని ప్రతి సారి దాని అద్దె చెల్లిస్తూనే ఉంటుంది. ప్రతి రోజు సంధ్యపడగానే దుకాణంలో సంధ్యాదీపం వెలిగిస్తుంది. ఎందుకో...ఏమో. ఎవ్వరికీ తెలీదు - మరి ఆమె మనసులో ఏముందో.. ★



# మొదటికి మోసం!!

వేదుల నారాయణశాస్త్రి

'కాంగుహాంగ'నే ఒక గ్రామంలో
'చాంగూ' 'చింగూ' సోదరులు
పదిఅణాలు తమ చేతపట్టుకుని
పట్నం బజారు చేరారు.

పదిఅణాలతోనే వ్యాపారం
ప్రారంభించాలన్నారు
చెరిసగమూ ఒక సరుకునుకొని ఆ
సరుకును అమ్మాలన్నారు.

పదికొనాలో తెలియనివారై
ఆ దినమంతా తిరిగారు
వేసంకాలం లాభంకోసం
ఐస్‌ఫ్రూటులను కొన్నారు.

* * *

చింగూఛాంగూ సరుకునుతీసుకు
సినిమారోడ్డుకి వెళ్లారు.
'ఐస్‌ఫ్రూట్!' అని కేకలువేస్తూ
ఆరోడ్డంతా తిరిగారు.

చింగుకింతలో దాహం వేసీ
చాంగును పిలచిటులన్నాడు:
"చాంగూ, ఐస్‌ఫ్రూటును తిందామా?"
చాంగు "నష్ట"మని అన్నాడు.

చింగుజేబులో కానీతీసీ
చాంగు చేతిలో పెట్టాడు.
చాంగుప్లాస్కులో ఐస్‌ఫ్రూటొక్కటి
చింగుకి ధరకే అమ్మాడు.

చాంగుకి మళ్లీ దాహంవేస్తే
చింగుకు కానీ యిచ్చాడు.
చింగుప్లాస్కులో ఐస్‌ఫ్రూటొక్కటి
చాంగుకి ధరకే అమ్మాడు.

* * *

చింగుచాంగుకీ, చాంగుచింగుకీ
చివరకు అన్నీ అమ్మారు-
అమ్మకమవగా, లెక్కచూడగా
ఆదాకానీ వచ్చింది.

చిత్రంకాదా, పాపల్లారా!
చింగుచాంగులవ్యాపారం!
ఊరికె యివ్వక, ధరకిస్తేనే
ఉన్నది హారతికర్పూరం!




## చిలుక - గబ్బిలము

పంజరాన పాపమెట్లొ
పట్టుపడిన ఒకచిలుక
రాత్రివేళ మాత్రమె తన
గాత్రమెత్తి పాడెడిది.

సంజపడిన వెనుకలేచి
సంచరించు గబ్బిలము
దీనికేమి కారణమని
తికమకపడె పలుమార్లు.

కడకు చిలుక పంజరమ్ము
కడకుపోయి గబ్బిలము,
"రేయితప్ప పగటివేళ
కూయిడవే"మని యనెను.

చిలుకయపుడు రెక్కలార్చి
పలికెనిట్లు నిట్టూర్చి:
"పగటిపూట పాడుటెంత
ప్రమాదమో ఎరుగవా?

పగటిపూట మేనుమరచి
పాటపాడి నందుకే
వేటగాని చేతజిక్కి
పాటులిన్ని పడినాను.

కావున ఇకమీద పగలు
కంఠమెత్త గూడదని
బాస యొకటి చేసి నోరు
మూసికొంటి, మిత్రమా!"

గబ్బిలమ్ము ఇది విని కడు
పుబ్బి నవ్వి ఇట్లనెను:
"ఫలితమేమి లేదుగాని
భలేబాస చేసితివి!

చిలుకలను గురించి వింటి
తెలివితేట లెక్కువని.
తెలిసెనిపుడు నీదుతెలివి
పులుసు కాచుకొనుటకే!

పట్టుబడినవెనుక ఇట్టి
గట్టిబాస లెందుకో?
ప్రతిన లెన్నిచేసిన, నీ
బ్రతుకు బాగు పడునోకో?"

ఈసప్ కథలు: 11

నండూరి రామమోహనరావు



నీతి

చేయి కాల్చుకొని ఆకులు
చేతపట్టు టన్నది

గతజలముల కానకట్ట
కట్టుకొనుట వంటిది.




## 25

ఆ పాట వినీవినటంతోనే మార్గరెట్ ప్రాణాలు విలవిలలాడినాయి. షావలిన్ అనుచరులందఱు ఆయుధాలు సిద్ధంచేయటం మొదలుపెట్టారు.

మొదట దూరాన వినవచ్చినపాట క్రమంగా సమీపించింది. గుట్టక్రింద సముద్రం హోరెత్తుతున్నది. గంభీరస్వరంతో పాడుతున్న పాట కొండరాళ్ళలో ప్రతిధ్వనిస్తున్నది. అందుచేత ఆ పాట ఎటునుండి వినపడుతున్నదో, ఎంతదూరంనుండి వినపడుతున్నదో నిశ్చయించి చెప్పటానికి వీలులేకుండా ఉన్నది.

"గాడ్ సేవ్ ది కింగ్?" భగవంతుడు రాజును రక్షించాలిట? తాను ప్రమాదంలో ఉన్నాడు—తన రక్షణసంగతి అతనికి పట్టనేలేదు!!

అగ్నిజ్వాలలమధ్యన ఉన్నట్లు తపించిపోయింది మార్గరెట్. భగవంతునికనికరించమని మొరపెట్టుకున్నది. పెర్సీ వారిచేతికి చిక్కకూడదు. ఏమయినా సరే, అంతగాకాకపోతే అర్మండ్ ప్రాణాలయినా పోనీ; తన కన్నుల ముందర అతని నెత్తురు ప్రవహించినా ఫరవాలేదు. అతని చావుకు తానే కారణమైనా ఫరవాలేదు. కాని పెర్సీని రక్షించగలిగితే చాలు.

ఈ ఆలోచన రాగానే ఆమె గొంతుచించుకొని, కెవ్వున కేకపెట్టింది. రివ్వున లేచి నిలబడింది. అంతవఱకు తాను ఆనుకొని కూర్చున్న రాతిని చుట్టిపోయి, కుటీరంవద్దకు పరుగుతీసింది. ఆ కుటీరపుగోడల మీద చేతులతో బాదుతూ "అర్మండ్! అర్మండ్! తుపాకి చేతపట్టు, మీ ప్రియతమ నాయకుడు అపాయస్థితిలో ఉన్నాడు. అర్మండ్!" అని అరవసాగింది.

ఇంతలో ఎవరో వెనకనుండివచ్చి ఆమెను ఇవతలికి లాగి నేలమీదకు త్రోసేశారు. నేలమీదపడి కూడా ఆమె కేకలు ఆపలేదు. "పెర్సీ! పారిపో! ఇటు రాకు! పారిపో!" అని హెచ్చరిస్తూనే ఉన్నది.

"ఏయ్! ఎవరైనా ముందానోరు మూయించండి." అని గద్దించాడు షావలిన్.

మార్గరెట్‌కు ఊపిరి సలపకుండా ఎవడో ముఖాన గుడ్డ పడేశాడు. దానితో ఆమె నోరు కట్టుపడింది.

మార్గరెట్ కేకలు వేయగానే, పాట ఆగిపోయింది. షావలిన్ అనుచరులందరు రహస్యస్థలాల నుండి బయటికి వచ్చారు.

షావలిన్ విసుగుకుంటూ, మండిపడుతూ ఒక కారుకూత కూశాడు. తన ఆశలన్నీ భగ్నమై పోతున్నందుకు నిర్జీవంగా క్రుంగిపోతూ. "ఇంకా చూస్తారేం గుడ్లగూబలలాగా? ఉరకండి. ఆ కుటీరంలోనుండి ఒక్కడినికూడా తప్పించుకుపోనివ్వవద్దు." అని ఉరిమాడు.

మబ్బులమధ్యనుండి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. ఆ గుట్టమీద చీకట్లు విరిసి, ప్రశాంతంగా వెన్నెల కాస్తున్నది. సైనికులు కుటీరం వద్దకి ఉరకులు పరుగులుగా పోయినారు. ఒకడు మాత్రము మార్గరెట్‌కు కావలాగా ఉండిపోయినాడు.

కుటీరం తలుపు ఓరగా తెసిఉన్నది. ముందు వెళ్లినవాడు తలుపునెట్టాడు. లోపల చీకటి గుయ్యా

రంగాఉన్నది. చలికాచుకోవటం కోసం ఉంచిన బొగ్గు నిప్పులు మాత్రమే కణ కణ లాడుతున్నాయి. సైనికులు యంత్రపు బొమ్మలలాగా బయట అటెన్షన్‌లో నిలబడ్డారు.

పావలిన్ హోరాహోరి యుద్ధమేదో జరగక తప్పదనుకుంటున్నవాడు, తన అనుచరు లలా నిలబడటం చూసి ఆశ్చర్యపోయినాడు. తానుకూడా పరుగెత్తుకుంటూవచ్చి ఒకసారి లోపలికి తొంగిచూసి, "ఏమిటిది ?" అని అడిగాడు.

"లోపల ఎవ్వరూ లేరనుకుంటానండి." అన్నాడొక సైనికుడు.

"ఏమిటి? ఆ నలుగురిని పారిపోనిచ్చారన్న మాట! అంతేనా? ఒక్కడినికూడా పారిపోనివ్వవద్దని చెప్ప లేదూ? అలానిలబడ్డారేం దయ్యాలలా? తరిమి పట్టుకోండి. ఊఁ!"అన్నాడు పావలిన్.

సైనికులు ఆజ్ఞ శిరసావహించి అన్ని దిక్కుల వెతకటానికి పరుగెత్తుకొనిపోయినారు.

"ఈ వేళ మీరు చేసిన పొరపాటుకు నిన్ను నీవు తెచ్చిన మనుష్యులనుకూడా ఉరితీయిస్తాను. లేకపోతే...!" అని పళ్లుకొరికాడు పావలిన్, ఆ సైనికులతో వచ్చిన సార్జెంట్ వంకచూచి. డెజ్‌గాజ్! నిన్ను కూడా!"

"మేమేమి తప్పుచేశాం? మీరు చెప్పినది తుచ తప్పకుండ పాటించాం ఇంగ్లీష్‌వాడు వచ్చినదాకా మమ్మల్ని కదలవద్దంటిరిగదా !" అన్నాడు సార్జెంట్.

"అదికాదు. ఆవిడ అరవగానే ఏం చెప్పాను? ఎవ్వరూ పారిపోకుండా పట్టుకొమ్మని చెప్ప లేదూ?"

"బాగుంది. ఆ కుటీరంలోవాళ్లు అంతకు ముందే వెళ్ళిపోయినారు. ఆవిడ అరిచినప్పుడు అందు ఎవరూ లేనే లేరు."

"అంతకుముందే పోయినారా? పోతూంటే చూస్తూ కూర్చున్నావా? నిన్ను ఏమిచేస్తే పాపముంది?..."

"ఇంగ్లీష్‌వాడికోసం కాచుకు కూర్చోమంటిరి. మీ ఆజ్ఞదాటితే ఉరితీయిస్తామనిబెదిరిస్తిరి. మరి మేము ఏమి చెయ్యాలి? కుటీరంలో ఉన్న మనుష్యులు ఒకరొక్కరుగా ప్రాకుకుంటూ వచ్చారు. ఆ తరువాత చాలాసేపటికి ఆమె అరిచింది."

పావలిన్ అయోమయంలో పడ్డాడు.

ఇది ఏమైయుంటుందా అని యోజించసాగాడు.

"అదుగో వినండి!"అన్నాడు డెజ్‌గాజ్ హఠాత్తుగా ఉలికిపడి.

దూరంగా ఎక్కడో తీరంవెంట తుపాకి కాల్పు వినిపించింది. పావలిన్ ఆ ప్రక్కకు తిరిగి చూచాడు. కాని చంద్రుడు సమయానికి మబ్బువెనుక చేరి ముఖం దాచుకోవటంవలన అతనికి ఏమీ కనిపించలేదు.

"ఎవ్వరైనా ఆ కుటీరంలోకి పోయి దీపం వెలిగించండి." అన్నాడు పావలిన్."

మారుమాటాడకుండా సార్జెంట్ లోపలకు వెళ్లాడు. బెల్టుకు వ్రేలాడుతున్న చిన్నదీపం తీసి వెలిగించాడు

"దీనిలోనుండి పోయినవారందరూ ఎటు దిక్కుగా వెళ్లారో?" అని అడిగాడు పావలిన్.

"ఎటువెళ్లింది చెప్పటం కష్టం. మొదట ఈ గుట్టమీదినుండి క్రిందికి దిగారు..."

"ఉండుండు - ఏమిటా చప్పుడు ?"

పావలిన్, డెజ్‌గాజ్, సార్జెంట్ ముగ్గురు శ్రద్ధగా విన్నారు. దూరంగా ఎక్కడినుంచో ఒక అర డజనుమంది తెడ్లువేసుకొని పడవ నడుపుకుపోతున్నట్లు వినిపించింది. ఆ శబ్దంకూడా స్వల్పంగా వినిపించి నిశ్శబ్దంలో కలిసిపోయింది.

పావలిన్ చేతి రుమాలుదీసి నుదుటిమీద చెమట తుడుచుకున్నాడు."ఆ ఇంగ్లీషు నౌక తాలూకు చిన్నపడవ!" అని రొజుకుంటూ, వగర్చుకుంటూ అన్నాడు.

ఆర్మాండ్ సెంట్‌జస్ట్ తక్కిన ముగ్గురు కాందిశీకులు క్షేమంగా ఫ్రాన్సుతీరంనుండి బయటపడ్డారన్న మాట! పావలిన్ సైనికులు, సైనిక మర్యాదలు పాటించినాయి కాని ఆజ్ఞను తు,చ, తప్పకుండా శిరసావహించారు. ఆ ఇంగ్లీషువాడికోసం సైనికులు కనిపెట్టకొనేఉన్నారు. వీరుమాత్రం ఆ కుటీరందాటి, ఆ సమీపంలో ఏ కొండరాయి చాటునోఉన్న పడవ ఎక్కి ఆ ఇంగ్లీషునౌక డే డ్రీమ్ చేరుకున్నారు.

వారు సురక్షితంగా చేరుకున్నట్లు గురుతుగా నౌకమీద తుపాకి కాల్పుధ్వని వినిపించింది.

"ఆ నౌక బయలు దేరుతున్నట్లున్నది." అన్నాడు డెజ్‌గాజ్ మెల్లిగా.

పావలిన్‌కు అరికాలుమంట నెత్తికెక్కుతున్నది. స్కార్లెట్ పింపర్నల్ మరొకసారి తనను టోకరా తినిపించాడు. ముప్ఫయిమంది సైనికులు కట్టు

దిట్టంగా కాపలా కాస్తున్న ఈ గుట్టమీదికి ఎలా వచ్చాడు? ఈ కుటీరం ఎలా సమీపించాడు? ఎలా గైతేనేమి, మొత్తానికి వచ్చాడన్న మాటే కదా?

ఆ రూబెన్ గాడిబండిలో ఈరోడ్డువెంట ఎవరి కంట బడకుండా ఎలా ప్రయాణం చేసిఉంటాడు. పోనీ గస్తీదళాలు తక్కువగా ఉన్నాయా? అదీ లేదు. ఆ పింపర్నల్‌కు ఏవయినా మానవాతీతమైన శక్తులున్నాయేమో!

షావలిన్ ఒకసారి చుట్టూచూశాడు. ఆ సముద్ర తీరందగ్గర అన్ని గుట్టల మధ్యన ఒక గుట్టమీద చీకటి వేళ వారు ముగ్గురుమాత్రమే ఉన్నారు.ఏదో తెలియని భయంతో షావలిన్ వళ్లు జలదరించింది.

తాను, తన అనుచరులు అందరూ అతనిపాట విన్నారు. కాని అతడేమయినట్లు? ఇక్కడ అతడు పాట పలికిన రెండునిమిషాలకు సరిగా పడవ తెడ్లు వేయటం వినిపించింది. ఈ రెండు నిమిషాలలో ఇక్కడి వాడు అక్కడికి ఎలా పోగలిగాడు?

షావలిన్‌కు మరొక ఆలోచన కలిగింది. బహుశా పింపర్నల్ పోయి ఉండడు. తానుకూడా వారితోపాటే పోవటానికి అవకాశం చిక్కనందున ఈ ప్రాంతాలలోనే ఎక్కడో ఉండిఉంటాడు. కాబట్టి ఇప్పటికైనా అతనిని పట్టుకోవటానికి అవకాశం మించిపోలేదు అనుకున్నాడు.

షావలిన్ మనస్సులో ఈ ఆలోచన, ఈ ఆశ కలిగిన క్షణంలోనే, కొందరు సైనికులు ముఖాలు వ్రేలాడవేసుకొని తిరిగివచ్చారు.

"మేము పోయేసరికి ఆలస్యం అయిపోయిందండి. ఇక్కడికొక మైలుదూరంలో ఒక పెద్దకొండ రాయి సముద్రంలోకి చొచ్చుకొనిఉన్నది. అక్కడ ఎక్కడో ఆ పడవ దాగి ఉన్నట్లున్నది మేము పోయేసరికే ఆ పడవ బయలుదేరి దివ్వెన నౌక దగ్గరకు పోతున్నది. మేము తుపాకులు కాల్చాము కాని ప్రయోజనం లేక పోయింది."

షావలిన్ పళ్లు కొరికాడు. "ఏమిటి? ఇక్కడికి మైలుదూరంలో పడవ ఉన్నదా? మీరు ఇక్కడినుండి వెళ్లేసరికే అది మీ తుపాకి కాల్పుల కందనంత దూరంపోయిందా?"

"మేము వేగంగానే పరుగెత్తాము. నా అనుమానం ఏమిటంటే, ఆవిడ అరచిగోల చెయ్యకముందే ఆ పడవ బయలుదేరిఉంటుంది" అని ఒకడు బదులు చెప్పాడు.

దీనితో షావలిన్ ఆశలు మళ్ళీ చిగురించినాయి. అతనిపాట వినిపించగానే మార్గరెట్ అరిచింది. అంతకుముందే ఆ పడవ బయలుదేరింది అంటే, పింపర్నల్ ఆ పడవలో బయలుదేరలేదన్న మాటేగా!

"ఆ దీపం ఇలా తీసుకురా" అని ఆజ్ఞాపించాడు షావలిన్ ఆ దీపం వెలుతురులో కుటీరం అంతా పరిశోధించారు. ఒకమూలన ఒక తెల్లకాగితం ముక్క పడి ఉన్నది. అక్కడివారు హడావిడిలో పోయినట్లుగా కనిపించింది. కుర్చీపీటలు రెండు అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి

"ఏదీ, ఆ కాగితం తియ్యండి." అన్నాడు షావలిన్ "ఇలా తెండి."

ఆ కాగితం ముక్క బాగా నలిగిపోయిఉన్నది. పారిపోయేముందు ఆ కాందిశీకులు దానిమాట మరిచి పోయిఉంటారు. షావలిన్ కోపంతో మండిపడుతూ ఉండటం, చూచి సార్జెంట్ నిలువునావణికిపోతున్నాడు. వినయ విధేయతలతో క్రిందికివంగి ఆ కాగితం ఏరి మర్యాదగా షావలిన్ చేతికిచ్చాడు.

"తీసుకొని చదవు"

"ఈ కాగితం బాగా నలిపివేశారు. పైగా దస్తూరికూడా చిక్కిరిబిక్కిరిగా ఉన్నది."

"'తీసుకొని చదువు' అంటున్నాను."

సార్జెంట్ భయపడుతూ దీపం దగ్గరగా పెట్టుకొని అందులోని ఒక్కొక్క అక్షరం శోధించాడు.

"మీప్రాణాలకు, నాప్రాణాలకు ముప్పులేకుండా, మీదగ్గరదాకా రావటం సాధ్యముకాదు. అందువలన ఈ కాగితం ముక్క అందగానే రెండునిమిషాలు ఊరుకొని ఒక్కొక్కరే బయటికి ప్రాకుకుంటూ రండి. ఎడమ ప్రక్కకు మలుపుతిరిగి, తీరంవెంటపోయి తొలిగా కనిపించిన కొండరాయిదగ్గర ఆగండి. దానిచాటున మన పడవఉన్నది. అందులో ఎక్కండి, ఇంగ్లీష్‌నౌక డేడ్రీమ్‌కు చేరుస్తుంది. మీరు డేడ్రీమ్ ఎక్కినతరువాతమాత్రం ఆపడవను నాకోసం మళ్లీ పంపించండి. కలేహోటల్ గ్రిజ్ ఎదురుగా ఉన్న కోవదగ్గరకు పొమ్మనిచెప్తే చాలు. వాళ్ళకు తెలుస్తుంది. నేనువచ్చి మామూలు ఈల వేసేదాకా పడవ ఒడ్డు పట్టించకూడదని చెప్పండి. ఈ ప్రకారం తు. చ. తప్పకుండా చెయ్యండి."

"ఆ క్రింద సంతకం ఉన్నదండి" అన్నాడు

సార్జెంట్ చదవటం ముగిస్తూ: షావలిన్ చెవులలో ఆ వాక్యం మారోగ్మ్రోగింది. "కెలేలో హోటల్ గ్రిజ్ ఎదురుగా ఉన్న రోడ్డుదగ్గర..."

అన్వేషిస్తూపోయిన సైనికులంతా వచ్చేశారు. షావలిన్ బిగ్గరగా అరిచాడు. "ఈతీరం బాగా తెలిసినవారెవరో మీలో ముందుకు రండి."

"నాకు తెలుసునండి." అంటూ ఒకడు ముందుకు వచ్చాడు. నేను కెలెలో పుట్టినవాడినే. ఇక్కడ ప్రతిపుట్టా, గుట్టా నాకు తెలుసు."

"హోటల్ గ్రిజ్‌కు ఎదురుగా ఉన్న రోడ్డుందే! అది సముద్రతీరానికి ఎక్కడ కలుస్తుందో తెలుసా?"

"తెలుసు."

"ఇంగ్లీష్‌వాడు అక్కడకు పోయినాడు. మనము వెంటనే అక్కడికిపోతే దొరకవచ్చు. నీకు దగ్గరదారి ఏదయినా తెలుసా?"

"తెలుసు."

"అతడేదారిన వచ్చినా కాస్త జాగ్రత్తగా రావలసి ఉంటుంది. గస్తీవాళ్లకు పట్టుపడకుండా ఉండటంకోసం ఆలస్యంకాక తప్పదు. కనుక మనకు అతడు దొరకవచ్చు. ఇంగ్లీష్‌వాడికంటె ముందు ఆచోటికి ఎవరెవరు వెళ్లగలరో వారికి ఒక్కొక్కరికి వెయ్యిఫ్రాంకుల బహుమానం!"

ఈమాట వారిమీద బాగా పనిచేసింది. సైనికులు కూడ వడిగా పరుగెత్తుకుపోయినారు. మరికొన్ని క్షణాలలో వారి అడుగుల సవ్వడి దూరంగా గాలిలో కలిసిపోయింది. వినపడినంతసేపు ఆ చప్పుడు వింటూ నిలబడ్డాడు షావలిన్. పింపర్నెల్ దొరకటానికి ఇంకా అవకాశంఉన్నా, దొరుకుతాడన్న ధైర్యంమాత్రం లేదు.

డెజ్‌గాజ్ షావలిన్ ఆజ్ఞకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. మార్గరెట్‌కు చెరొకప్రక్కన ఇద్దరు సైనికులు ఉన్నారు. షావలిన్ ముఖంత్రిప్పి డెజ్‌గాజ్ వంక తీవ్రంగా చూశాడు. తానంత కట్టుదిట్టంగా పథకంవేసినా, అది పనిచెయ్యకపోవటంవలన అతనికి ఆ పాదమస్తకం మండుకుపోతున్నది. ఈకోపం, ఏదో విధంగా తీర్చుకోవాలి.

మార్గరెట్ బలహీనంగా నీరసంగా నేలమీద ఉన్నది. కనీసం లేవాలనికూడా ప్రయత్నం చెయ్యటం లేదు. అయినా సైనికు లిద్దరు ఆమెను పట్టుకొని ఉన్నారు. విచారంతో ఆమె ముఖం పాలిపోయి ఉన్నది. కన్నులక్రింద నల్లని వలయాలు ఏర్పడి నాయి.

"సగం చచ్చిన ఆడదానికి అంత కాపలా అక్కరలేదులే!" అన్నాడు షావలిన్ కటువుగా. "అయిదుగురు మగవారినిచూస్తూ విడిచిపెట్టారుగాని."

సైనికులు వినయంగా లేచి దగ్గరకు వచ్చారు. "మనం వచ్చినదారి ఏదో, ఆ బండి ఎక్కడ తగలడిందో చూడండి." అన్నాడు షావలిన్. కాని ఇంతలోనే అతనిబుఱ్ఱకు గొప్ప ఆలోచన తట్టింది

"మరచిపోయినాను. ఆయూదు ఏడి?"

"ఈప్రక్కనే ఉన్నాడు. మీరు చెప్పినట్లు కాళ్లు చేతులు కట్టివేసి పడేశాను." అని బదులు చెప్పాడు డెజ్‌గాజ్.

ఇంతలో ఆదగ్గరనుండి మూలుగు వినిపించింది. డెజ్‌గాజ్, షావలిన్ అక్కడికి వెళ్లారు. కుటీరం ఆవలిప్రక్కన యూదు కుప్పగా పడిఉన్నాడు. కాళ్లు రెండు గట్టిగా కట్టివేసి ఉన్నాయి. నోరు గట్టిగా బిగించి ఉన్నది. భయంతో తెగవణికిపోతూ నోట మాటరాక కొట్టుకుంటున్నాడు. మొట్టమొదట అతనిని కట్టిన త్రాడు కట్లుజారిఉన్నది. కాని యూదుమాత్రం ఒక్కఅంగుళమైనా ప్రక్కకు కదలలేదు.

"ఆవెధవ నిలా లాక్కురండి."

షావలిన్ కోపం వెళ్లగ్రక్కేటందుకు ఒకడు దొరికాడు. సైనికులనేమి అనటానికీ వీలులేకపోయి నందున, వారుచేసిన పొరపాటుకు తానే కారణమైనందున, ఇందాకటినుండి కోపం లోలోన అణచుకొని చచ్చినట్లు పడిఉన్నాడు. అసలే యూదులంటే గ్రౌంచివారికి కోపం, ఇప్పుడు వీడొకడు చేతిలో చిక్కాడు;

"ఏమిరా! మీయూదులు బేరాలమాట మరిచి పోరుగామోసునే;"

వాడికి నోటివెంట మాటరా లేదు. వణికిపోతూ గుడ్లప్పగించి నిలబడ్డాడు.

"చెప్పు." అని షావలిన్ గదమాయించాడు.

"అ—అవునండి."

"ఊఁ! కెలేలో మనం మాట్లాడుకున్న బేరం గుర్తుందా? రూబెన్‌గాడిబండిని దాటిస్తానన్నావు కదూ?"

"అదికాదండి."

"ఏదికాదు? నీకు గుర్తుందా, లేదా?"

"ఉందండి."

"ఏమిటి నేరం?"

యూదు మాట్లాడలేదు. చుట్టూ చూశాడు. పైన చంద్రుడిని చూశాడు. గోళ్లు గిల్లుకున్నాడు. కాలిబొటనవ్రేలు నేలకు రాశాడు.

'మాట్లాడవేం పశువా!"

మాట్లాడాలనే ప్రయత్నం చేశాడు కాని మాట్లాడలేకపోయినాడు. "అయ్యగోరూ!..."

"భయంతో వణికి చస్తున్నావు. నోటివెంట మాటరావటం లేదు. సరే నేనే చెప్తున్నా విను. రూబెన్ గాడిబండి దాచేసి, అందులో ఉన్న మా స్నేహితుడిని కలుసుకోనేటట్లు చేస్తే పది బంగారు నాణెములు ఇవ్వమన్నావు. అవునా?"

యూదు ఏడుపుముఖం పెట్టాడు.

షావలిన్ ఒక్కొక్క అక్షరం నొక్కి నొక్కి చెప్పటం ఆరంభించాడు. "అలాకాక నీవు నన్ను వంచించావా, జన్మలో మళ్లీ మరిచిపోకుండా ఉండేలాగా చితకగొట్టిస్తానని చెప్పాను."

"అబ్రహాంతోడు, నేను తమర్ని మోసం చెయ్యలేదు."

"నీమాట నీవు నిలబెట్టుకోలేదుకాని నామాట నేను నిలబెట్టుకుంటాను. ఏయ్! మీరిద్దరూ ఇలారండి" అని సైనికులను పిలిచాడు. "బెల్టులు విప్పండి. కాస్త చురుకు తగిలించండి వీడికి."

వారు బెల్టులు విప్పారు. యూదు కెవ్వున కేక పెట్టాడు.

"వాడి ప్రాణాలుమాత్రం తియ్యకండి. చావగొట్టి వదలిపెట్టండి. తెలుసుగా నేను చెప్పవలసిన పనేముంది?" అన్నాడు షావలిన్.

తాను చెప్పినపని దగ్గర ఉండి చేయించనక్కర్లేదని షావలిన్‌కు తెలుసు. సైనికులు ఇంకా ధుమధుమలాడుతూనే ఉన్నారు. తాను పెట్టిన చివాట్లు వాళ్లు మరిచిపోలేదు. కాబట్టి ఆకోపం వాడిమీద బాగానే చూపిస్తారు.

షావలిన్ డెజ్ గాజ్ కొంచెం ఇవతలికి వచ్చారు.

"ఆపని అయినతరువాత, వారిద్దరూ మనకు దారిచూపిస్తారు. ఒకడిని బండి తోలమందాం. ఆ యూదు, ఆవిడ ఒకరికొకరు తోడుగా ఇక్కడే పడుంటారు. అంతగా కాకపోతే తెల్లవారినతరువాత ఎవడినైనా పంపిద్దాంలే!" అన్నాడు షావలిన్. డెజ్ గాజ్ తల ఆడించాడు.

"ఇద్దరూ ఒకలాగే ఉంటారు. ఇప్పుడున్న పరిస్థితులలో ఎవరూ పారిపోలేరు. వీళ్ళనికూడా ఇప్పుడెవడు తీసుకుపోతాడు?"

డెజ్ గాజ్ శ్రద్ధగావిని ఇందుకు అంగీకరించాడు. షావలిన్ చేతులు నలుపుకుంటూ, అరచేతితో గడ్డం రుద్దుకుంటూ నిలబడ్డాడు

"ఛీ! ఛీ! ఈ వెధవలకి ఒక్క పిసరు బుద్ధి ఉండి ఉన్నట్లయితే ఇలా అయ్యేదేకాదు. దొరికినట్లే దొరికి తప్పించుకుపోయినారు అందరూ." అని విసుగుకున్నాడు.

కరుకు జీవితానికి అలవాటుపడిన సైనికుల చేతులలో దెబ్బలు తింటూ, దురదృష్టవంతుడయిన ఆ ముసలివాడు కొండలు ప్రతిధ్వనించేటట్లు కేకలు పెడుతున్నాడు. ఆ కేకలకు షావలిన్ హృదయతాపం కొంత ఉపశమించింది. కనీసం ఈ ఒక్కడినైనా సాధించగలిగినందుకు తృప్తిగా ఇకిలించాడు.

క్రమంగా యూదు కంఠస్వరం నీరసించిపోయింది. "ఇక చాలులే! వాడిని ప్రాణాలతో విడిచిపెట్టండి:" అని ఆజ్ఞాపించాడు షావలిన్. సైనికులు పరమవిధేయులై కొట్టటం మానివేసి వాడిని కాలితో ఒకప్రక్కకు తన్ని వేశారు.

"వాడిని అక్కడ వదిలిపెట్టి, ఆబండి ఎక్కడ ఉన్నదో చూద్దాం పదండి. మీ యిద్దరూ ముందు దారితీయండి." అంటూ షావలిన్ మార్గరెట్ దగ్గిరకు పోయినాడు.

ఆమెకు అప్పుడే స్మృతివచ్చింది. వచ్చీరావటంతోనే తనకు మళ్లీ ఆ కిరాతకుని చేతిలో చిక్కిన యూదుశోకాలు విన్నది.

షావలిన్ ఆమెను సమీపించి ముందుకు వంగాడు. ఎగతాళిగా అన్నాడు. "మార్గరెట్ గారూ! నాకు సరిహద్దులు దాటిన విచారం కలుగుతున్నది. ఏంచెయ్యను? పరిస్థితులు బాగాలేవు; విషమించినాయి. నేను కొండొకపనిమీద పోతున్నాను.

# ఆంధ్రపత్రిక

## సచిత్ర వారపత్రిక

# పిల్లల దసరా సంచిక

## చిత్రాలు, రచనలకు బహుమతులు

### గడువు తేదీ 1955 సెప్టెంబరు 20

రాబోయే విజయదశమి పండుగకు (26-10-55) ఆంధ్రవారపత్రిక పిల్లల దసరా సంచికగా ప్రచురించబడుతుంది. మామూలు ప్రకారం ఈ సంచికలో బాలబాలికల రచనలకు చిత్రాలకు ప్రాధాన్య మివ్వబడుతుంది. 15 సంవత్సరాలలోపు పిల్లల రచనలు, చిత్రాలలో ఉత్తమమైనవానికి బహుమతు లివ్వబడతాయి.

బాలబాలికల రచనలు చిత్రాలు కాక ఈ సంచికలో ప్రత్యేకచిత్రాలు, ఫోటోలు, వ్యాసాలు, కథలు కూడా ప్రచురించబడతాయి. ఆకర్షణీయమైన ప్రత్యేక త్రివర్ణ ముఖచిత్రంతో సంచికను సర్వాంగసుందరంగా ప్రచురించడానికి కృషి చేస్తున్నాము.

బాల బాలికలకోసం ఉద్దేశించబడిన ఈసంచిక ప్రచురణలో బాల బాలికలు పెద్దలుకూడా మాకు తోడ్పడ గలరని ఆశిస్తున్నాము.

చిత్రాలు, రచనలు పంపేవారు ఈక్రింది అంశాలను గమనించ కోరుతున్నాము.

* చిత్రాలు, రచనలు, ఫోటోలు మా కార్యాలయానికి సెప్టెంబరు 20వ తేదీలోగా చేరాలి.

* వీనిని ఎడిటర్, ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక, మద్రాసు 1. ఎడ్రస్‌కి పంపాలి. కవరుపైనా లేక రేపర్ పైనా, లోపల మొదటి కాగితంపైనా, లేక చిత్రం వెనుకా "ఆంధ్ర-వారపత్రిక దసరా సంచికకు" అని వ్రాయాలి.

* ప్రచురణకు స్వీకరించబడని రచనలు, చిత్రాలు, ఫోటోలను తిరిగి తమకు పంపగోరేవారు వానితోపాటే అవసరమైన స్టాంపు చేర్చి పంపాలి.

* రచనలు అచ్చులో మూడు పేజీలకు మించకూడదు. కాగితంపైన ఒకే ప్రక్క సిరాలోనే వ్రాయాలి. చిత్రాలను డ్రాయింగ్ పేపరుపైన ఇండియన్ ఇంక్‌లోనే వ్రాసిపంపాలి బొమ్మలు రంగులలో కాని, రంగు కాగితంపైన కాని పెన్సిల్, సిరాలతో వ్రాసినవి కాని స్వీకరించబడవు.

* 15 సంవత్సరాల లోపు బాలబాలికలు మాత్రమే పోటీలో పాల్గొనవచ్చును.

* రచనలు, చిత్రాలు స్వతంత్రమైనవై ఉండాలి.

* పోటీలో పాల్గొనడానికి రుసుము, లేదు.

* రచయితలు, చిత్రకారులు తమ పూర్తి పేరు (ఇంటిపేరుతో సహా), వయస్సు, చిరునామా అన్నీ వివరంగా రచనలూ చిత్రాలతోపాటే వ్రాసిపంపాలి.

* రచనలు చిత్రాలనుగురించి ఉత్తరప్రత్యుత్తరాలు జరపవద్దని రచయితలను చిత్రకారులను కోరుతున్నాము.

—సంపాదకుడు.

మీకు తోడుగా ఈ బెంజమిన్‌ను అట్టిపెడుతున్నాను. తెల్లవారినతరువాత మీకోసం బండి పంపిస్తాను. అంతవరకు సెలవు!" నొసటితో వెక్కిరిస్తూ, తలవంచి ప్రణామం చేసి, పావలిన్ శలవు తీసుకున్నాడు.

మార్గరెట్ కదలలేనిపరిస్థితిలో ఉండికూడా వెగటుతో తలప్రక్కకు త్రిప్పుకున్నది. "గాడ్ సేవ్ ది కింగ్!" అన్నపాట వినిపించినతరువాత ఏమి జరిగిందో ఆమెకు తెలియలేదు.

పెర్సీ ఏమయినాడు? ఆర్మండ్ ఏమయినాడు? ఆమెకు తెలియలేదు. లేచే ఓపిక లేక అలాగే వెల్లకిలా పడుకొని విచారించసాగింది.

పావలిన్, అనుచరులు వెళ్లిపోయినారు. వెళ్ళిపోతున్నవారి అడుగులసవ్వడి క్రమంగా దూరమైపోసాగింది.

(ఇంకా ఉంది)



బోసినవ్వు — ఫొటో : డి. వి. సోమయాజులు—కాకినాడ.

చైనీస్ కథలు: ఫెంగ్‌స్వే ఫెంగ్

# 5. స్వార్థ్యస్త్రమయం

ఎడారి పడమటికొనను, భూమి ఆకాశం కలిసేచోట సూర్యుడు అస్తమిస్తూ, ఎడారి అంతా రక్త సముద్రంలా కనిపించేటట్లు ఎర్రని కాంతులు ప్రసరింపచేశాడు. ఆ సాయంతనం ప్రశాంతంగా విహరిస్తున్న ఒక సింహం ఆ కాంతి ప్రవాహాన్ని చూసి "ఈ సౌందర్యం మళ్లీ వస్తుందా?" అని తలపోసింది. దాని హృదయంలో ఏదో అవ్యక్త వేదన బయలుదేరింది. "ఆ ఎర్రని కాంతిగోళమేకదా, నా రాజ్యాన్ని ఇంత అందగింపజేసింది? మరొక క్షణంలో అది అంతర్హితమై పోతుంది. అది పోకముందే దాన్ని పట్టుకుని నా స్వాధీనం చేసుకుంటే నా రాజ్యం ఎప్పటికీ ఇలాగే ఉంటుంది కదా?" అని భావించింది.

ఈ వెర్రికోరికతో దాని రక్తం ఉడుకెత్తింది. పిచ్చిపట్టినట్లు పశ్చిమ దిశాభిముఖంగా పరుగెత్త నారంభించింది. దానివేగానికి ఎడారి దుమ్ము ఎర్రని మబ్బులా లేచింది. కాని సింహం ఎంత పరిగెత్తినా సూర్యుడు అందలేదు. పరిగెత్తిన కొద్దీ సూర్యబింబం వెనక్కి పోతోంది. క్రమంగా ఇందాకటి అరుణకాంతులుకూడా మాసిపోతున్నాయి.

ఇంతలో సింహం ఒక సరస్సును సమీపించింది. 'ఎడారి ముత్యాలు' అని పిలవబడే సరస్సుల్లో అదొకటి. నిర్మలంగా, సుందరంగా ఉన్న ఆ జలాశయం కనిపించగానే సింహం ఆగిచూచింది. ఆకాశంలో ఇంకా చెదిరిపోకుండా మిగిలిన ఎర్రని మేఘం ఒకటి నీటి అద్దంలో ప్రతిబింబించింది. "ఇదిగో కాంతిగోళం! దొరికింది!" అని సంతోషిస్తూ సింహం సరస్సులోకి ఒక్కదూకు దూకింది. నీటిలో మునిగిపోతూ సింహం ప్రాణాలపై ఆశ వదులుకుని ఇలా అనుకున్నది: "మరణిస్తున్నందుకు అణుమాత్రమైనా నాకు విచారంలేదు. ఒక ఆదర్శం కోసం ప్రాణత్యాగం చేయడంకంటె కోరదగిన దేమున్నది?"

చరిత్రలోకూడా ఇలాటిసంఘటనలు జరుగుతాయి. కోల్పోయిన అధికారం తిరిగి సంపాదించుకోవాలని కొందరు స్వార్థపరులు ప్రయత్నిస్తారు. ఆ ప్రయత్నాలు ఫలించవు. అప్పుడు ఏవో అందమైన ఆదర్శాలను ఊహించుకొని వాటి కోసం త్యాగం చేశామనుకొని సంతృప్తి పడతారు. ★

---

# హిరణ్మయి

## బాలసాహితిలో క్రొత్తసీరియల్

ఆంధ్రవారపత్రిక 17-8-55 సంచికనుండి 'బాలసాహితి' శీర్షికలో "హిరణ్మయి" అనే క్రొత్త సీరియల్ కథ ప్రచురిస్తున్నాము. భారత దేశంపై రెండువేలేండ్లకు పూర్వము గ్రీకు చక్రవర్తి అలెగ్జాండరు చేసిన దండయాత్రను వాతావరణంగా తీసుకుని శ్రీ పాలంకి వెంకటరామచంద్రమూర్తిగారు ఈ పెద్దకథ రచించారు. ఈ కథలోని ఇతివృత్తం ఒక ఇంగ్లీషుకథ ఆధారంగా అల్లబడినది. మా పాఠకులు ఈ సీరియల్ చదివి ఆనందిస్తారని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు

# దివ్యాంజనము

ఒకానొకదేశంలో ఒకానొక రాజుకు అతని తండ్రి ఎక్కువ సామ్రాజ్యాన్ని, తక్కువ తెలివిని వదిలిపెట్టి చనిపోయాడు. అతనికి ఒక రాకుమారితో వివాహం జరిగింది. ఆమె తెలివికూడా అంత మాత్రమే! వారికి ఒక కుమార్తె కలిగింది.

ఆ అమ్మాయి చాలా చక్కగా వుండేది. అందుకు ఆ తలిదండ్రులు తమను తాము అభినందించుకున్నారుకూడా! అయితే ఆ బూరెబుగ్గలను చూసి దుఃఖంతో "అయ్యో! ఏమిపిల్ల! ఎంత చిన్నది! బోసినోరు! బట్టతల! పిశాచం!" అని విలపించారు.

ఆస్థానవైద్యులు ఎన్నివిధాలనో చెప్పారు. పసిపిల్లలు అలాగే వుంటారనీ, జుట్టు ఒత్తుగా వుండదనీ, పళ్లు వుండవనీ దుఃఖించ నవసరంలేదనీ నచ్చచెప్పారు. కాని రాజు, రాణి వారిమాటలను ఆలకించలేదు. "రాచబిడ్డ అందరిపిల్లల్లా వుంటుందా?" అని రాజూ, రాణీ ప్రశ్నించారు.

రాజవైద్యులు నిరుత్సాహులైనారు. రాజదంపతులు తమకు కలిగిన "అనాకారి" బిడ్డను చూసి అసహ్యించుకున్నారు. దేశంలోని వైద్యులనందరనూ సమావేశపరిచారు. తమబిడ్డ ఆరోగ్యాన్ని సరిచేయలేరా? అని ప్రశ్నించారు. "మాబిడ్డను పొడవుగా ఎదిగేలాగ, జుట్టు ఒత్తుగా పెరిగేలాగ, పళ్లు అన్నీ వచ్చేలాగ చెయ్యగలిగే మందును తయారుచెయ్యవలసిందని మీకు ఆజ్ఞాపిస్తున్నాను. నాయీ ఆజ్ఞను మీరు నిర్వర్తించకపోయిన పక్షంలో మీలో ప్రతి ఒక్కనిని బెత్తంతో మోదిస్తాను."

ఈ హెచ్చరికతో వైద్యసమ్మేళనం గజగజలాడిపోయింది. సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగలరా? వైద్యులలో కోలాహలం రేగింది. కాని రాజు చలించలేదు.

**కె. రామచంద్రరావు**

"నాకు తెలుసు. నేను రాజును. నానిర్ణయం సరియైనది. అది ఖాయమైనది. అయిదునిమిషాలలో మీరు నిర్ణయించుకోవాలి. మందుఇస్తారా? బెత్తం దెబ్బలను తింటారా?" అంటూనే ముందుగా సింహాసనం దిగి వచ్చేశారు రాజదంపతులు.

తిరిగి వైద్యసమూహంలో సర్వత్రా భయం వ్యాపించింది. నాలుగున్నర నిమిషాలు గడిచిపోయాయి. తిరిగి రాజు ప్రవేశిస్తాడని తెలియజేసే మొదటిగంట మ్రోగింది. సభ అంతటా నిశ్శబ్దం తాండవమాడుతూంది.

రెండవగంట మ్రోగింది...

మూడవగంట మ్రోగింది...

తలుపులు తెరుచుకున్నాయి. సాయుధభటులు ముందు రాగా రాజదంపతులు ఠీవిగా ప్రవేశించారు సింహాసనాన్ని అధిష్ఠించారు.

"ఏమైంది ఘనవైద్యుల్లారా? ఏమి నిర్ణయించారు?" రాజు ప్రశ్నించాడు. ఎవరూ సమాధాన మివ్వలేదు.

"ఏమిటి? ఇదేనా మీ ప్రభుభక్తి! మీరంతా శిక్షనే వాంఛిస్తున్నారన్నమాట! అయితే సరే!" అంటూ రాజు ముఖ్యసేనాధిపతిని ఉద్దేశించి ఏమో చెప్పబోతుండగా ఒక వృద్ధవైద్యుడు లేచి "మహాప్రభూ! తమ ఆజ్ఞను శిరసావహించడానికే మేము నిశ్చయించాము. ఒక అద్భుతమైన అంజనమును తయారుచేయుటకు మేము సిద్ధముగా నున్నాము. అది రాకుమార్తె పుష్టిగా ఎదుగుటకును, కేశములు వృద్ధిపొందుటకును, పళ్లు అన్నీ వచ్చుటకును దివ్యముగా పనిచేయును" అని విన్నవించాడు.

"ఏమిటా అంజనము?" అని రాజు ప్రశ్నించాడు.

"నాలుగువందల డబ్బైఅయిదు వనమూలికలు, మూడువందల పన్నెండు రసాయనములు, ఒకవందా ఇరవైరెండురకముల రసములు కలిపి ఈ అంజనమును తయారుచేసెదము...కాని..."

"ఏమిటి కాని...?"

"కాని తమరు తొందరపడినట్లుగా ఆ దివ్యాంజనమును అయిదు

నిమిషాలలో తయారించలేము ప్రభూ."

"ఎందు చేత? నేను ఆజ్ఞాపించాను కదా? నేను రాజును. మరవకండి."

"ఎందుచేతనంటే రాజశక్తి ఎంతటి బలమైనదైనా అది కొన్ని సమయాల్లో ప్రభావాన్ని కొంత వరకు కోల్పోతుంది రాజా! రాకుమార్తెలో అభివృద్ధిని కనబరచే ఈ మందును తయారించేందుకు ఒకానొక మొక్క అవసరం. ఆ మొక్కను నాల్గవపర్యాయం పుష్పించిన ప్రథమ ప్రభాతసమయాన పెల్లగించి తీసుకురావాలి ఆ మొక్క రెండుసంవత్సరాలకు ఒకసారి పుష్పిస్తుంది. అదేవిధంగా ఈ సందర్భంలో వుపయోగించే ఒకానొక రాయి మన దేశంలో ఉత్తరాన ఉన్న పర్వతశిఖరాగ్రాన లభ్యమవుతుంది. అది అంజనం తయారు చేసేసమయానికి రెండవతూరి మంచుకరిగేస్థితిలో వుండాలి. ఇప్పుడు ఆ పర్వతాల్లో మంచు ప్రతి ఆరు సంవత్సరాలకు కరుగుతూవుంది."

"అంటే మీ ఉద్దేశం?"

"నాఉద్దేశం తమరు సహనంతో వేచివుండాలని ప్రభూ! అయితే ఫలితంవిషయంలో మేము హామీ యివ్వగలం. మా అంజనం రాకుమార్తె పొడవుగా బలంగా ఎదుగుటకు, నల్లని శిరోజములు, తెల్లని పళ్లు వచ్చుటకు నిశ్చయంగా పనిచెయ్యగలదు అయితే అందుకు కొంత వ్యవధి అవసరము."

"అంటే ఒకవారం చాలునా?" అని రాణి ప్రశ్నించింది.

"చాలదు మహారాణీ! పన్నెండు సంవత్సరాలు సరిపోవచ్చునని మా అంచనా. ఈ పన్నెండు సంవత్సరములూ రాకుమార్తె మా అధీనంలో, మా పోషణలో వుండాలి. ఆమెను రాజబంధువులు కాని, ఆస్థానమువారెవరుకాని దర్శించరాదు ప్రభూ! ఆ వ్యవధి అనంతరము మా కృషి ఫలించనిపక్షంలో మాఅంతట మేము వైద్యశాస్త్రము బూటకమని అంగీకరించి ప్రకటించెదము. అంతేకాదు మా కుత్తుకలను ఉత్తరించమని వేడెదము"

"మీ అభిప్రాయ మేమి?" అని రాణీని రాజు అడిగాడు.

"ఇది చాలా న్యాయముగా ఉన్నట్లు కనబడుతూ వుంది. వారు కోరినవ్యవధిని వారికివ్వండి. అనంతరంమాత్రం తమరు నిర్దయగా ఉండవలెనని నాకోరిక" అని రాణి తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

* * *

పన్నెండు సంవత్సరాల అనంతరం వైద్యశాస్త్రం తన శక్తిని రుజువు చేసుకున్నది.

వైద్యులయొక్క అవిరళ కృషి ఫలితంగా రాకుమార్తెకు మంచి బలమైన శరీరము, నల్లని కేశములు, తెల్లని పళ్లూ వచ్చాయి. అవి ఎదిగి



ఉరాంగ్ ఉటాంగ్ ఫొటో: పి. గురుమూర్తి—మద్రాసు

# ★ మామిడి ★

(9వ పేజీ తరువాయి)

రిచ్చిన అంటుమామిడితోట నీవు కోరగ వ్రాసి యిచ్చినాను" అని సుబ్బిశెట్టి పాత్ర చేత ఏడిపిస్తాడు నాటక కర్త. నిజానికి అది సుబ్బిశెట్టి ఏడుపు కాదు. మనవారికి మామిడి తోటలమీది మమకారానికి మచ్చుముక్క వంటి పద్యపాదం అది. "మంత్రాలకు మామిడికాయలు రాలవు" అనేది మన సామెతల్లో ఒకటి. స్త్రీల పాటల్లో "పండుపాట" అనేది ఒకటి వుంది. అందులో అభివర్ణిత మైన పండు మామిడిపండు. పిల్లలకు చెప్పే కథలు చాలావరకు, అనగనగా ఒక రాజు, ఆ రాజుకు ఒక రాణీ, వారికి పిల్లలు లేక పోవడం, దానధర్మాలు, జపతపాలు, పూజాపునస్కారాలు చేయడం, గుళ్లు, గోపురాలు, సత్రాలు కట్టించడం, తటాకాలు త్రవ్వించడం, పస్తులు, ప్రాణాచారాలు పడడం జరిగిన తర్వాత వారి కుల దేవత కలలో కనిపించడం, ఊరికి ఉత్తరాన, దారికి దక్షిణాన వుండే మంత్రాల మామిడి చెట్టులోని పండు తెచ్చి రాణీకిచ్చి తినిపించడం' ఆ రాజు ఆశకు గంపెడు కోసినా చెట్టు దిగేసరికి చేతికి ఒకటే మిగలడం, ఈశ్వరుడిచ్చిన ఫలం ఇంతేనని నమ్మి ఇంటికి తీసుకుపోయి రాణీకిస్తే ఆవిడ దానిని అతిభక్తితో స్వీకరించి గర్భంధరించి సుముహూర్తంలో సుపుత్రుణ్ణి కనడంతో ప్రారంభమయ్యేవే. "ఒక్క సందుకన్నా ఎక్కువ ఇంటే, కథలోనైనా సరే) రాణీకి కడుపు రావడం బదులు కడుపునొప్పి రావచ్చునుకదా?" అని ఎవరైనా కొంటెప్రశ్న వేస్తారని ముందుగానే ఊహించి ఆ కథల్లో ఆ కాలం కథకులు ఆ రాణీలచేత ఒక్కొక్క పండే తినిపించినారు. ఇది ఉత్తమ కథక లక్షణానికి చక్కని నిదర్శనం.

మరణవేదన పడుతూ మరుక్షణంలో శాశ్వతంగా కన్ను మూయబోయే రాజమాతకు "రామా కృష్ణా" అనుకోడానికి బదులు మామిడిపండ్లమీద మనసు పోగా, ఆ పండ్లు తెచ్చేలోగా ఆమె ప్రాణంపోవడం, ఆమె ఆత్మశాంతికిగాను బంగారు మామిడి పళ్లె దానంపట్టిన బ్రాహ్మలకు తెనాలి రామయ్య వాతలు పెట్టడం తెలిసిన విషయమే.

మల్గోవా, పీతర్, నీలం, బెంగుళూర్, రుమానీ, రకరకాల పసందులు, దాడి పసందు, (పీచు మామిడిపండుకు పెట్టిన పెద్దపేరు) అంటుమామిడి, కలెక్టరు మామిడి, కొబ్బరి మామిడి, బంగనపల్లి మొదలైన ఎన్నో జాతుల మామిడిపండ్లు వుండికూడా, అసలు మామిడి జాతికి చెందని వానికిన్ని "మామిడి"పదం తగిలించి, అటికమామిడి (ఆకుకూర) ముంతమామిడి, మామిడి అల్లం అనే పేర్లు పెట్టుకోవడం చూస్తే మనకు మామిడిమీద మక్కువ ఎంత ఎక్కువో తెలుస్తుంది. ఇవన్నీ చాలక పుల్లమామిడాకు అని ఇంకొకటుంది. అది పచ్చడికి పసందుగా వుంటుంది.

మామిడిపండ్ల రసాన్ని ఎండించి తాండ్ర తయారుచేస్తారు. తాండ్ర ప్రసక్తి వచ్చినప్పుడు బొబ్బిలి పులి, తాండ్ర పాపారాయుడు తలపుకు వస్తాడు తాండ్ర చెట్టంటూ ఒకటి వుంది. దానికీ తాండ్రకూ సంబంధం లేదు. తాండ్రవారు గాక, చిరుమామిళ్ల, మామిడిపూడివారున్నూ వున్నారు. మామిడి సింగన్న మంత్రి పేరు సాహితీ పరులకు చక్కగా తెలుసును.

"మాంగామాలై" (మామిడి కాయల హారం) అనేది ఒక బంగారు నగ. "మామిడి పండు ముడి" వచ్చేటట్లు చీర కడతారు కూడా. ఊగాది పచ్చడికి మామిడి పిందెలు ముఖ్యం. మామిడిచెట్టు మొలిస్తేనే గారడి వాని విద్యాప్రదర్శనంలో మోజు పుడుతుంది. మామిడాకులతో విస్తళ్ళు కుడతారు మామిడాకుతో పళ్లు తోముకొనే

# దివ్యాంజనము

ఆగిపోలేదు. ఇంకా పెరుగుతూనే వున్నాయి.

ఆ రాజ్యానికి తరువాత వారసురాలు ఆమె యేకనుక ఆమెను విజ్ఞానవంతురాలుగా, వివేకవంతురాలుగా చెయ్యడంలో వైద్యులు శ్రద్ధ తీసుకున్నారు. తలిదండ్రుల వద్దనే ఆమె వుండినపక్షంలో ఆమె కూడా వారివలెనే బుద్ధిహీనగా, తెలివి తక్కువగా పెరిగివుండేదని ప్రజల అభిప్రాయం. అందుచేత రాజు, రాణీకంటే ఆ ప్రజలు వైద్య ప్రముఖులకు భక్త్యంజలులను, కృతజ్ఞతను వెల్లడించారు.

(ఫ్రెంచికథకు అనుకృతి)

వారూ వున్నారు. మామిడి మాను పలకలకు, దూలాలకు పనికివస్తుంది. పట్టు మందుకు ప్రయోజనపడుతుంది. చిగుళ్లు, చిన్న కొమ్మలు వంటచెరుకుగా వాడబడుతవి. మామిడి టెంకలు కాల్చి అందులోని పప్పు కూడా కొందరు తింటారు.

మామిడి పేరుమీదుగా "మాంబాక్కం", "మాంగాడు" అనే గ్రామాలున్నవి. మా గురువుగారికి ఎవరిమీదనైనా కోపం వస్తే వాణ్ణి చూచి, "మాంబాకా చినగంగి రెడ్డి కొడకా మావూరి గంగాధరా! నిన్ను చూస్తే నా కడుపు భగ్గున మండెగదరా నిర్భాగ్య దామోదరా!" అనేవారు. బహుశా "మాంబాక" అనే తెలుగు గ్రామమే అరవంలో "మాంబాక్కం" అయిందో లేక "మాంబాక్కం" తెలుగులో "మాంబాక" నే అయిందో తెలియదు గాని, ఆ వూళ్లో తెలుగువారి ఉనికిని సూచించడానికి సాక్షీభూతంగా ఈ జానపద గీతం ఈనాటికీ నిలిచివుంది. కాబట్టి నార్తార్కాడు, సేలం, చెంగల్పట్టు (చెంగల్వ పట్టు కాదుగదా) జిల్లాలలోని వివాద ప్రాంతాలతోబాటు, మాంబాక, మాంబాక వంటి మరుగుపడిన గ్రామాల విషయంకూడా ఇకముందు జరుగబోయే చర్చలలో పరిష్కారం కావలసివుంది. ఆ పరిష్కారానికి అవకాశం కల్పించడానికి అనుగుణంగా చరిత్రపరిశోధకులు శాసనాలు, సర్వేరాళ్ళు పరిశీలించి వివరాలు తెలిపితే అక్కడక్కడి తెలుగువారికి మహోపకారం చేసినవారౌతారు. విధి వశాత్తుగా విడిపోయి, విచిత్రమైన మార్పులకు తల ఒగ్గి తమ్ముతాము మరిచిపోయిన తెలుగువారంతా మళ్ళీ కలిస్తేనే విశాలాంధ్ర లక్ష్యసాధనకు వీలుకలుగుతుంది. ఆ సమీకరణం సాహిత్యంద్వారానే శాంతంగా సాధించడానికి సాధ్యమౌతుంది. ★

# స్వీకారం

"అరుణోదయ" మాసపత్రిక

సంపుటి 2. సంచిక 1. వ్యవస్థాపకుడు కుంకరకనకారావు; సంపాదకుడు మాగాత్రి రామన్; విడిప్రతి వెల 0-8-0. కార్యస్థానం 72, గోవిందప్ప నాయకన్ వీధి, జి. టి. మద్రాసు 1. విజయవాడనుండి కొంతకాలం పక్షపత్రికగా ప్రచురింపబడిన ఈ పత్రిక ఈ జులైనుండి సినిమా మాసపత్రికగా, త్రివర్ణ ముఖచిత్రంతో మద్రాసు నుండి వెలువడుతున్నది. సినిమా పరిశ్రమకు సంబంధించిన కొన్ని వ్యాసాలు, వార్తలు, ఫొటోలు ఈ సంచికలో ఉన్నాయి. ★



కాకినాడలో ఈమధ్య నృత్య ప్రదర్శనా లిచ్చిన నర్తకి వహీదారహమాన్.

ఫొటో : డి. వి. సోమయాజులు.



"జయసింహ"లో ఎన్. టి. రామారావు, వహీదా.

* * * * * *

నేషనల్ ఆర్టు థియేటరువారి "జయసింహ"లో జయసింహుడుగా ఎన్. టి. రామారావు, బుద్ధిమతిగా రేలంగి, కాళిందిగా అంజలీదేవి.



# బొంబాయి సినిమా లేఖ

చలన చిత్ర పరిశ్రమ చాలా దేశాలలో శీఘ్రంగా అభివృద్ధి అవుతుంటే, భారతదేశంలో మాత్రం వెనక్కి నడుస్తున్నది. దీనికి ప్రభుత్వంవారి నిరాదరణ కొంతవరకూ కారణం. సంఖ్యలో భారతీయ చిత్రాలకు ద్వితీయస్థానం ఏనాడో పోయింది. ఐక్యరాజ్య విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంఘం ప్రచురించే 'కొరియర్' పత్రిక ఏప్రిల్ సంచికలో ఇవ్వబడిన వివరాల ప్రకారం 1953 లో అమెరికా 360, జపాను 302, భారతదేశం 259, హాంకాంగ్ 200, ఇటలీ 150, బ్రిటన్ 138, ఫ్రాన్సు 111, పశ్చిమజర్మని 101 చిత్రాలు నిర్మించాయి. దూరప్రాచ్యంలో చైనీస్ చిత్రాలకు గిరాకీ విపరీతంగా ఉండడం వలన హాంకాంగ్ చిత్రపరిశ్రమ ఉన్నట్టుండి పెరిగిందట.

భారతీయ చిత్రాలు ఇప్పుడు యూరపియన్ థియేటర్లలో ప్రదర్శింపబడుతున్నాయని 'కొరియర్' పత్రిక వ్రాసింది. చిత్రాల సంఖ్య తగ్గడంవలన, దేశంలో వివిధ వర్గాల నుండి విమర్శ చెలరేగడం వలన పరిశ్రమ కొంత దెబ్బతిన్నా, భారతీయ నిర్మాతలు విదేశాలలో మార్కెట్ సంపాదించడానికి తీవ్రకృషి చేశారు. దోబిఘా జమీన్, ఆవారా, బైజూ బావ్రా, ఆంధియాన్, మున్నా, రాహి చిత్రాలు యూరప్‌లో ఈ యేడాది మొదటి అర్థభాగంలో ప్రదర్శింపబడి విజయం పొందినప్పటినుండి, 'శ్యాంచీ ఆయీ', 'బూట్ పాలిష్' మొదలైన భారతీయ చిత్రాలకు చాల విదేశాలలో గిరాకీ హెచ్చింది. ముఖ్యంగా చెప్పకోదగిన సంఘటన సొహ్రాబ్ మోడీ నిర్మించిన ఝాన్సీకీరాణి ఇంగ్లీషు చిత్రం జులై 5 తేదీన అమెరికాలో విడుదల కావడం. అమెరికన్ ప్రజలు, విమర్శకులు కూడా ఈ చిత్రాన్ని అమితంగా మెచ్చుకున్నారు. 'సంగీతం మనకు కొత్తదైనా, శ్రావ్యంగా ఉన్నది. చక్కని నృత్యాలు చిత్రమంతటా ఉన్నాయి', అని ఒక విమర్శకుడు వ్రాశాడు. పురాతన భారతీయ సంస్కృతీ సౌందర్యాలతో నిండిన మన చిత్రాలకు విదేశాలలో విజయం లభిస్తుందనడానికి ఈ ఉదాహరణలు చాలును. కాని మన జీవితాన్ని, జీవిత విధానాన్ని, అందులోని అందాన్ని, విశిష్టతనీ విదేశీయులకు పరిచయం చేసే చిత్రాలను తీయడానికే మన నిర్మాతలు కృషి చేయాలి.

చేతన్ ఆనంద్, కె. ఎ. అబ్బాస్, బిమల్ రాయ్ ముగ్గురూ అంతర్జాతీయ ప్రదర్శనకు గాను చిత్రాలు తీయడానికి నిశ్చయించారు. చైనీస్ యాత్రికుడు యువాన్ చ్వాంగ్ జీవితవిశేషాలను ఇతివృత్తంగా చేతన్ ఆనంద్ తీయదలచిన చిత్రం భారతీయ, చైనీస్, రష్యన్ నటీనటులతో, మూడు దేశాలలోను, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్. దేశాలలోను షూట్ చేయబడుతుంది. చైనీస్ అగ్రశ్రేణినటుడొకడు యువాన్ చ్వాంగ్ పాత్ర ధరిస్తాడు. మూడు దేశాల ఫిలిం పరిశ్రమల సహకారంతో ఈ చిత్రం నిర్మింపబడి ప్రపంచం అంతటా సులభంగా మార్కెట్ సంపాదించుకోగలదు.

దర్శక నిర్మాత కె. ఎ. అబ్బాస్ అంతర్జాతీయ దృష్టిగల నిర్మాత. ఈయన హిందీ రష్యన్ భాషలలో, చెర్కాసోవ్, నర్గీస్‌లతో చిత్రం తీస్తానని ప్రకటించాడు. భారతదేశానికి వచ్చిన మొదటి రష్యన్ యాత్రికుని కథ ఈ చిత్రానికి ఇతివృత్తం. ఆ యాత్రికుని పేరు అఫనాసి నికితిన్.



చైనా వెళ్ళిన భారతీయ సాంస్కృతిక ప్రతినిధులు, కేంద్ర లలిత కళా విద్యాలయాన్ని దర్శించారు: ప్రతినిధివర్గనాయకుడు ఎ. కె. చందా ఒక చైనీస్ కళా విద్యార్థినితో మాట్లాడుతున్న దృశ్యం.

1469నుండి 72వరకూ అతడు భారతదేశంలో ఉన్నాడు. సోవియెట్ సాంస్కృతిక శాఖమంత్రితో దీని విషయమై సంప్రదించడానికి వెళ్లిన అబ్బాస్ భారతప్రభుత్వం తన చిత్ర నిర్మాణ సంకల్పాన్ని ఆశీర్వదించినదని తెలిపారు. అబ్బాస్ 1953 డిసెంబరులో ప్రారంభించి వదిలివేసిన 'మిష్టర్ 54' వలె కాకుండా ఈచిత్రం యథార్థంగా నిర్మింపబడుతుందనే మనం ఆశించాలి.


బిమల్ రాయ్ నిర్మించదలచిన ఇండో-రష్యన్ చిత్రానికి పండిట్ నెహ్రూ రచించిన 'భారత దర్శనం' అనే గ్రంథం ఆధారం. ఇందులో నటీనటులందరూ భారతీయులే. టెక్నీషియన్లుమాత్రం రష్యానుండి వస్తారు.

*　　*　　*

ఎస్. ఎమ్. ఎస్. నాయుడుగారి 'ఆజాద్' విజయం పొందిన తరువాత బొంబాయి తారలకు మద్రాసులో గిరాకీ ఎక్కువై వారి రేట్లు ఇదివర కెన్నడూ లేనంతగా పెరిగిపోయాయి. దీనివలన బొంబాయి ఫిలింరంగానికి చాలా నష్టంకలుగుతున్నది. కొద్ది పేరుపడిన ప్రతి నటీ నటుడూ విపరీతంగా డబ్బు అడుగుతున్నారు. ప్రతి ఒక్కరూ అరడజను చిత్రాల్లో నటిస్తున్న కారణంచేత నెలకి నాలుగైదు రోజులకంటే ఏ చిత్రం షూటింగ్‌కి హాజరు కావడంలేదు. నిర్మాణ వ్యయం చాలా పెరిగిపోతున్నది. తారల కొరత వలన కూడా బొంబాయి నిర్మాతలు యిబ్బంది పడుతున్నారు. గడచిన రెండేళ్లలోను నటన, అందం కలిగినవారు ఇద్దరు మాత్రమే తారాపథంలో ప్రవేశించారు. 1951 లో భారీ పబ్లిసిటీ సహాయంతో జరిగిన కె. కె. టి. అందాల పోటీవలన కూడా తగినంతగా కొత్త తారలు బయటికి రాలేకపోయారు.

*　　*　　*

అందాలపోటీలు బాగా జరగడానికి భారతీయసంస్కృతి ఒప్పుకోదు. అందుచేత తారలకోసం దేశమంతటా తిరగడం ఒకటే మార్గం. దురదృష్టవశాత్తు ఇలా దేశంలో తిరిగేవారు లేరనే చెప్పవచ్చును. ప్రస్తుతం అనుమానాస్పద పద్ధతులలో తారలను రిక్రూట్ చేయడం జరుగుతున్నది. ఫిలిం నిర్మాతలు పత్రికలలోచేసే ప్రకటనల వ్యయాన్ని తగ్గించడానికి కృషిచేస్తున్న ఐ. ఎమ్. పి. పి. ఎ. అతిముఖ్యమైన ఈ తారల కొరతను భర్తీచేయడానికి ప్రయత్నించడం నిర్మాతలకు ఎంతైనా శ్రేయస్కరం. ఇందుకోసం ప్రత్యేకం ఒకశాఖను స్థాపించి ఏడాదికి కనీసం ఇద్దరినైనా కొత్త నటీనటులను ప్రవేశపెట్టాలి. పత్రికా ప్రకటనలను తగ్గించడంకంటే ఇది ఉత్తమమైన లక్ష్యం. ప్లేబాక్ రంగంలోకూడా



సాధనావారి "సంతానం"లో రమణారెడ్డి.

చేయవలసినది చాలా ఉన్నది. దాదాపు పదేళ్ళనుండీ లతామంగేష్కర్, ఆశా భోన్స్లే, గీతారాయ్, రఫీ, హేమంత కుమార్, తలత్ మహమూద్‌ల కంఠాలే ప్రతి చిత్రంలోనూ విని విని విసుగు పుడుతున్నది. సంగీతదర్శకులు కొత్తగాయకులను తీసుకురావడంలో సహాయపడరు సరిగదా, కొత్తవారిని నిరుత్సాహపరుస్తారు కూడాను. దీని ఫలితంగా, సుధా మల్‌హోత్ర, మీనా కపూర్, సి. హెచ్. ఆత్మ, మధుబాల ఝువేరి, ప్రమోదినీ దేశాయి, సుమన్ హెమడీ, ధనంజయ భట్టాచార్య, సబితా బెనర్జీ మొదలైనవారి కంఠాలు సాధారణంగా హిందీ చిత్రాల్లో వినిపించనే వినిపించవు. ఎప్పుడైనా కొత్త కంఠం వినిపించినా, అది పాడుగా ఉండి, సంగీతాన్ని బట్టి కాక మరే కారణంవల్లనో ఆ వ్యక్తిని బుక్ చేసినట్లు తెలిసిపోతుంది. ఇటీవల ఒక గాయకి తాలూకు పాట జోత్తిగా రాని సోదరీ సోదరులు తమకు కూడా ప్లేబాక్ అవకాశం ఇవ్వాలనీ, లేకపోతే తమ సోదరి ఇకమీదట పాటలు పాడడానికి ఒప్పుకోదనీ నిర్మాతలను బెదరించడం కూడా జరిగింది.

*　　*　　*

షేక్ ముఖ్తార్ నిర్మిస్తున్న "లంబూ" చిత్రంలో సురయ్యా నటిస్తోంది. ఈమధ్య కొద్ది వెనుకబడిన సురయ్యా దీనితో తిరిగి ముందుకు రాగలదు. ఈ చిత్రంలో షేక్ ముఖ్తార్, శ్యామ, కొత్తగా ప్రవేశించిన కమల్ జిత్ కూడా నటిస్తున్నారు.

# ★ బొంబాయి సినిమా లేఖ ★

దిలీప్‌కుమార్, దేవ్ ఆనంద్, బీనారాయ్, విజయలక్ష్మి, హాలీవుడ్ చింపంజీ జిప్పీ నటిస్తున్న జెమినీ 'ఇన్సానియత్' హిందీచిత్రం ఆగస్టులో విడుదల కాగలదని తెలుస్తున్నది.

'బీర్బల్ పరిస్తాన్‌మే" అనే సంగీత చిత్రం ఆగస్టులో విడుదల అవుతుంది. ఇందులో గీతాబాలి నటించింది. అక్బరు ఆస్థాన విదూషకుడైన రాజా బీర్బల్ కథలు ఈచిత్రానికి ఆధారం.

'హౌస్‌నంబర్ 44' చిత్రం బాగా ప్రజాదరణ పొందడంతో దేవ్ ఆనంద్ నిర్మాతగాకూడా పేరు సంపాదించాడు. ఇతడిప్పుడు 'ఫన్‌తూష్' అనే మరో చిత్రం తీస్తున్నాడు. షీలా రామానితో అతడు నటించే ఈ చిత్రం సగం పైగా తయారైంది. నిర్మాత చేతన్ ఆనంద్.

బి. ఆర్. చోప్రా తీస్తున్న 'ఏక్ హీ రాస్తా' లో అశోక్‌కుమార్, మీనాకుమారి, సునీల్‌దత్ నటిస్తున్నారు. రచయిత ముఖ్‌రం శర్మ.

ఆగస్టులో బాక్స్.ఆఫీసు విజయం పొందగల చిత్రం 'బరాదారీ' విడుదల కానున్నది. నిర్మాత అమర్‌నాథ్. గీతాబాలి, అజిత్, చంద్రశేఖర్ నటిస్తున్న ఈచిత్రంలో కథ రాజపుత్రస్థానానికి చెందినది.

ఇస్మయిల్ ఫిలిమ్స్‌వారి "జవాబ్"లో బల్రాజ్ సానీ, నజీర్‌ఖాన్, గీతాబాలి, జానీవాకర్, నటిస్తున్నారు.

సామాన్యపత్రికారచయిత పడే కష్టాలను చూపించే "సొసైటీ" అనే చిత్రం షాహిద్ లతీఫ్ నిర్మిస్తున్నాడు. ఇందులో నజీర్‌ఖాన్ పత్రికా రచయితగా నటిస్తున్నాడు. కథానాయిక నిమ్మి.

అరేబియన్ వాతావరణంతో ఆనంద్ ఫిలిమ్స్ తీస్తున్న "బాద్షా సలామత్" చిత్రంలో క్రొత్తనటి జబీన్' జానీవాకర్. కుంకుం నటిస్తున్నారు.

మరొక అరబ్బీ కథాచిత్రం "సిపాహ్‌సలార్"లో షమ్మీకపూర్, నాదిరా నటిస్తున్నారు. ఇందులో నృత్యాలు, పాటలు కొల్లలుగా ఉంటాయట. అరేబియన్ వాతావరణం కల చిత్రాలు ఇటీవల బాగా ప్రజాదరణ పొందుతున్నందువల్ల వీటి ఉత్పత్తి కూడా పెరుగుతున్నది. ★

# సినిమా వార్తలు


భరణీ వారు "చింతామణి" చిత్రం ప్రారంభించారు. ఎన్. టి. రామారావు, భానుమతి, జమున, రేలంగి మున్నగు వారు ఈ చిత్రంలో నటిస్తున్నారు. దర్శకుడు రామకృష్ణ.

* * *

నేషనల్ పిక్చర్స్‌వారి "పరాశక్తి" విడుదలకు సిద్ధం చేయబడింది. ఈ చిత్రం తమిళంలో కొంతకాలం క్రిందఅఖండ విజయం పొందింది. గణేశన్, శ్రీరంజని మున్నగు వారీ చిత్రంలో నటించారు. దర్శకత్వం కృష్ణన్ పంజు. ఎ. వి. ఎమ్. వారి 'వదినె' విడుదల వాయిదా వేయబడిందట.

* * *

వినోదావారి 'కన్యాశుల్కం' పూర్తయినట్లు తెలుస్తోంది.



జి. పి. సిప్పీచిత్రం "మెరైన్‌డ్రైవ్"లో కె. ఎన్. సింగ్, అజిత్.

జూలై 22న మొదలుపెట్టి వరసగా 17 కేంద్రాలలో సారథీ వారు 'రోజులు మారాయి' చిత్రం శత దినోత్సవాలు చేస్తున్నారు. ఈ చిత్రం మద్రాసు, శ్రీకృష్ణాలో ఇంకా నడుస్తున్నది. హఠాత్తుగా తారాపథంలో ప్రవేశించిన వహీదారహమాన్ బొంబాయినిర్మాత గురుదత్ తీసే చిత్రంలో నటించే విషయం మాట్లాడడానికి బొంబాయి వెళ్లిందట.

*　　*　　*

ప్రధాని నెహ్రూ రష్యా పర్యటనను చూపించే సోవియెట్ వర్ణ చిత్రం మద్రాసు, న్యూ గ్లోబ్‌లో గత వారం విడుదలయింది.

*　　*　　*

ఫిల్మిస్థాన్ వారి 'నాగిన్' చిత్రం మద్రాసు, ప్లాజాలో శత దినోత్సవం దాటి ఇంకా నడుస్తున్నది. ఈ చిత్రంలో సంగీతం తప్ప మరేమీ లేకపోయినా అఖండ విజయం పొందింది.

ఫిల్మిస్థాన్ వారి మరొక చిత్రం 'జాగృతి' కూడా బొంబాయిలో రజతోత్సవం చేసుకున్నది.

*　　*　　*

టెక్నికలర్ చిత్రం 'ఝనక్ ఝనక్ పాయల్ బాజే' నిర్మించిన వి. శాంతారాం ఆ చిత్రం తాలూకు కాపీలు తీయించడం కోసం లండను వెడుతున్నారట. ఈయన 'షాయిర్ ప్రభాకర్' అనే మరొక చిత్రం ఇటీవల ప్రారంభించారు. మహారాష్ట్ర జానపద వాగ్గేయ కారుడైన ప్రభాకర్ జీవితకథ ఈ చిత్రంలో ఇతివృత్తం. దీనికి సంగీత దర్శకుడు వసంత్ దేశాయ్. 'రాజ్ కమల్' తార సంధ్యకూడా ఇందులో నటిస్తుందట. నాలుగు నెలల్లో ఈ చిత్రం ముగించాలని శాంతారాం సంకల్పం.

*　　*　　*

భారత ప్రభుత్వ చలన చిత్ర శాఖవారికి మొదటి నుండీ ప్రధాన నిర్మాతగా ఉంటున్న ఎం. భవనాని ఇప్పుడు విరమించు కున్నారు.

*　　*　　*

నిర్మాత చేతన్ ఆనంద్ తాను నిర్మించబోయే "అంజలి" అనే చిత్రంలో బుద్ధుని శిష్యుడైన ఆనంద్ గా నటిస్తాడట. ఖండాల బాలికగా నిమ్మి, రాజకుమార్తెగా షీలారామాని నటిస్తారట.

*　　*　　*

బిమల్ రాయ్ నిర్మించదలచిన బుద్ధ జీవిత చిత్రం సెప్టెంబరులో ప్రారంభింపబడుతుందట. బౌద్ధ కుడ్యచిత్ర, శిల్ప ఖండాల ద్వారానే బుద్ధుని జీవితకథను చిత్రించాలని బిమల్ రాయ్ సంకల్పమట. ★




"సంతానం"లో ఎస్. వి. రంగారావు.

# ప్రేక్షకుల అభిప్రాయాలు

## "చెరపకురా చెడేవు"

బాస్కర్ ప్రొడక్షన్సువారి "చెరపకురా - చెడేవు" చిత్రం హాస్యరస పూరితమై ప్రేక్షకుల మన్ననలందుకొన్న దనుటలో సందేహము లేదు. ఈ చిత్రమునందు మోహన్‌గా యన్. టి. రామారావు, ఆనంద్ గా అమర్ నాథ్, దయానిధిగా ఆర్. నాగేశ్వరరావు, పీతాంబరంగా రేలంగి, లలితగా జానకి, సావిత్రిగా చంద్రకుమారి, మేనకగా రాజసులోచన, శాంతగా లక్ష్మీరాజ్యం గార్లు చాలా బాగా నటించారు. చెవిటి కారు డ్రైవర్ గా యన్. టి. రామారావుగారు అమోఘంగా నటించారు.

చిత్రమునందు పాటలలో ముఖ్యముగా మేనక పాడిన "గులాబీలతోట - బుల్ బుల్ పాట" తరువాత పీతాంబరం సీత కలసి



"జయసింహ"లో ఎన్. టి. రామారావు.

## ★ ప్రేక్షకుల అభిప్రాయాలు ★

పాడిన "నాటకం - ఆడుదాం - మహా నాటకం" అన్న పాటలు చాలా బాగున్నాయి. ఘంటసాలవారి సంగీతము ఒక మాదిరిగా వున్నది.

భాస్కర్ రావుగారికి దర్శకత్వములో ఈ చిత్రమే మొదటిదయినా చాలా నిపుణత్వముతో నిర్వహించారు. మొత్తంమీద చిత్రము చాలా బాగున్నదని చెప్పక తప్పదు.

జి. వి. వి. నరశింహరాజు,
—చెరుకుపాడ.

* * *

కథలో బిగువు లేదు. కొంత లోపించింది. నటీనటులు తమ సామర్థ్యాన్ని ప్రదర్శింపగల పాత్రలు ఈ చిత్రంలో లేక— అన్ని పాత్రలు ఇంచుమించు సమానంగా కన్పిస్తవి. కథాగమనం సరిగ్గా లేక అతుకుల బొంతగా తయారైంది. ఘంటసాల వెంకటేశ్వరరావుగారి సంగీతం మామూలుగా వుంది. రెండు పాటలు బాగున్నవి. ఇంటర్వెల్ తరువాత చిత్రం బాగా వుంది. రామారావుగారి నటన బాగుంది.

యస్. దశరథ రెడ్డి
—వరంగల్.

* * * *

## "కన్యాదానం"

ఈ చిత్రం ఒక మోస్తరుగా ఉంది. సీతారామయ్యగా సి. ఎస్. ఆర్. అద్వితీయంగా నటించాడు. జానకి, రాజనాల, కాంతారావుల నటన పరవాలేదు. వహీదా రహమాన్ చేసిన రెండు నృత్యాలు చిత్రానికి ప్రత్యేకాకర్షణ. శ్రీశ్రీ మాటలు బాగున్నాయి సంగీతం సామాన్యంగా వుంది. మధ్య మధ్య కొన్ని సంభాషణలు విసుగు పుట్టించాయి.

నరిశేపల్లి లక్ష్మీనారాయణ,
—గుంటూరు.


* * *

చిత్రంలో కట్నాల సమస్య చాల బాగా చూపించారు. 'సజీవ నటన' సి. యస్. ఆర్. నటన. రాజనాల పాత్రను అర్థం చేసుకొని నటించాడు. కాంతారావు హీరో వేషం వేసినా అంతగా రాణించలేకపోయాడు. జానకి నటన పేలవంగా ఉంది. కోసరాజు నృత్యగీతాలు బాగానే ఉన్నాయి. వహీదా నృత్యం మొదటిదానికంటె రెండవది చాల రక్తి కట్టించి. బాల సరస్వతి నేర్పుతో బాగా నటించింది.

ఎం. హెచ్. ప్రసాద్,
—చీరాల.


★

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor : S. Sambhu Prasad.



మ లు పు దా రి

—ఫొటో: పి. రామారావు, రాజమండ్రి.


నేడే చూడండి!!
విశాలాంధ్రలో అన్ని ముఖ్యకేంద్రములలో ప్రదర్శింపబడుచున్న
...భాస్కర్ ప్రొడక్షన్స్ చిత్రం...
చెరపకురా చెడేవు!
నిర్మాత - దర్శకుడు... కోవెలమూడి భాస్కరరావు
CH. E. PRASAD